అమ్మ
రూ॥ 350/-
పేజీలు: 400

నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★


హైదరాబాద్‌లో మంగళవారం సిఎం రేవంత్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన స్విట్జర్లాండ్ రాయబారి మాయా తిస్సాఫీ.

సంపుటి 08, సంచిక: 157 | బుధవారం | 07-05-2025 | మహబూబ్‌నగర్ Published from: Mahabubnagar, Hyderabad, Khammam, Karimnagar పేజీలు: 12+8 | వెల రూ. 5.00



## ఆర్‌టిసి కార్మికుల
# సమ్మె వాయిదా

● టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి నాయకుల ప్రకటన ● సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో చర్చలకు ఆర్‌టిసి జెఎసి కార్మికులు ● రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌తో చర్చలు సఫలం ● సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతామని వెల్లడి ● ఆర్‌టిసి పరిరక్షణ, కార్మికుల సంక్షేమం కోసం ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి

ప్రజాపక్షం/హైదరాబాద్

టిజిఎస్ ఆర్‌టిసి కార్మికుల సమ్మె వాయిదా పడింది. నేటి నుంచి సమ్మె చేయాలని నిశ్చయించుకున్న టిజిఎస్ ఆర్‌టిసి జెఎసి నాయకులతో రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పొన్నం ప్రభాకర్ జరిపిన చర్చలు సఫలమయ్యాయి. జెఎసి నేతల డిమాండ్లను సమ్మతి తెలపడంతో ప్రస్తుతానికి సమ్మె విరమించుకున్నట్లు వారు ప్రకటించారు. జెఎసి ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం భారీ కవాతు సైతం నిర్వహించగా, తాజాగా మంత్రి పొన్నం ప్రభాకర్‌తో జరిపిన చర్చలు సఫలం కావడంతో సమ్మె వాయిదా పడింది. తమ డిమాండ్లను తీర్చకపోతే ఈ నెల మే 7వ తేదీ నుంచి సమ్మెకు దిగుతామని ఆర్‌టిసి జెఎసి నేతలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్‌టిసి జెఎసి నేతలతో జరిపిన చర్చలు విజయవంతమయ్యాయి. సిపిఐ శాసనసభ పక్షనేత, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు నేతృత్వంలో ఆర్‌టిసి జెఎసి ప్రతినిధులను సచివాలయానికి వెళ్లారు. సమావేశంలో ఎమ్మెల్సీ కోదండరాం, దేవరకద్ర ఎంఎల్‌ఎ జి.మధుసూదన్ రెడ్డిలు పాల్గొన్నారు.

**సమస్యలపై మంత్రి సానుకూలం..**

సమ్మె కొంతకాలం వాయిదా వేయాలని నిర్ణయించామని జెఎసి ఛైర్మన్ ఈదురు వెంకన్న, కో ఛైర్మన్ కె.హనుమంతు ముదిరాజ్, వైస్ ఛైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎం.డి. మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి వెల్లడించారు. సచివాలయం మీడియా పాయింట్ వద్ద జెఎసి నేతలు మాట్లాడుతూ ప్రస్తుత తరువాయి 2లో

### ఉద్యోగ సంఘాలతో చర్చలకు కమిటీ

చైర్మన్‌గా నవీన్‌మిట్టల్
పెండింగ్ సమస్యల పరిష్కారానికి సాధ్యాసాధ్యాలపై నివేదిక రూపొందించాలని ప్రభుత్వం ఆదేశం

ఉద్యోగుల సంక్షేమం,పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాలను అమలు చేయడంలో అన్ని స్థాయి ఉద్యోగుల పాత్ర కీలకమని ప్రభుత్వం వెల్లడించింది. ఉద్యోగ సంఘాలతో చర్చించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు ఐఎఎస్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీకి చైర్మన్‌గా రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి నవీన్‌మిట్టల్, సభ్యులుగా పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, డిప్యూటీ సిఎం కార్యాలయం ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తరువాయి 2లో

## ఉద్యోగులందరూ...
# మా సోదరులే

● గత ప్రభుత్వ ఆర్థిక విధ్వంసం వల్ల కొంత ఆలస్యమైనా చెప్పింది చేస్తాం ఇచ్చిన హామీలు నిలబెట్టుకుంటాం ● ముఖ్యమంత్రి ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి ● ఒకరిద్దరు బెదిరించినట్లు మాట్లాడినందువల్లే ఆ విధంగా స్పందించారు ● ఏ వర్గానికీ వ్యతిరేకం కాదు ● గత ప్రభుత్వ నిర్వాకం వల్లే అప్పులు తీసుకువచ్చే పరిస్థితి లేదు ● రాష్ట్రాన్ని దివాళా తీసే విధంగా బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని నడిపింది ● దిగిపోవాలంటున్న బిజెపి పహల్గామ్, ఆర్థిక వ్యవస్థ, నిరుద్యోగంపై ఏం సమాధానం చెబుతది? ● జర్నలిస్టుల ఇష్టాగోష్టిలో మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం / హైదరాబాద్

'ఉద్యోగులు మా సోదరులు, మిత్రులు, మా కుటుంబ సభ్యులు. గత ప్రభుత్వం ఆర్థిక విధ్వంసం కారణంగా కొంత ఆలస్యమైనా చెప్పింది చేస్తాం. మేము వెనకకు పోము. కష్టపడతాం. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటామ'ని పరిశ్రమలు, ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు అన్నారు. ఉద్యోగ సంఘాలను ఉద్దేశించి సిఎం చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ముఖ్యమంత్రి ముక్కుసూటిగా మాట్లాడే వ్యక్తి అని, అంతకు ముందు ఒకరిద్దరు బెదిరించినట్లు మాట్లాడినందుకే ఆయన ఆ విధంగా మాట్లాడారే తప్ప వారికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ప్రశ్నించారు.గత ప్రభుత్వం కారణంగా అప్పులు తీసుకువచ్చే పరిస్థితి కూడా లేకుండాపోయిందనే సిఎం అన్నారని చెప్పారు. రూ.7లక్షల కోట్ల పైచిలుకు అప్పు చేసి గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని దివాళా తీసే పరిస్థితికి తీసుకువచ్చిందని విమర్శించారు. రాష్ట్రాన్ని దివాళా తీసే విధంగా బిఆర్‌ఎస్ ప్రభుత్వాన్ని నడిపిందని, మేము దివాళా తీయకుండా నడిపిస్తున్నామని చెప్పారు. పాలన చేతకాకపోతే దిగిపోవాలన్న కొందరు బిజెపి నేతలు తరువాయి 2లో

'మాది ప్రజాప్రభుత్వం.అందరికీ గొంతు విప్పే అవకాశం ఉంది. అందుకే మాట్లాడుతున్నారు. గతంలో ఫాసిస్టు ప్రభుత్వం ఉండేది. ఎవరినీ గొంతు విప్పనివ్వలేదు. ఆనాడు ప్రభుత్వం ఎందుకు ఉద్యగుల రిటైర్‌మెంట్ వయసు పెంచింది? రిటైర్‌మెంట్ తరువాత వేల కోట్లు ఎందుకు బకాయిలు పెట్టింది? ఇది ఆలోచిస్తే లాజిక్ అర్థమవుతుంది. మేము వచ్చాక సమన్వయంతో ఉద్యోగ నియామకాలు కూడా చేపడుతున్నాం'

– మంత్రి శ్రీధర్‌బాబు

## హామీల అమలుకు లేని పైసలు
# అందాల పోటీలకు ఉంటాయా?



అధికారం కోసం కాంగ్రెస్ అడ్డగోలు హామీలిచ్చింది తప్పించుకునేందుకు ప్రయత్నిస్తోంది బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి రామారావు

ప్రజాపక్షం/హైదరాబాద్

పరిపాలన చేతగాకపోతే సిఎం రేవంత్ రెడ్డి ప్రజలకు క్షమాపణ చెప్పి, తన సిఎం పదవికి రాజీనామా చేసి తప్పుకోవాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు సూచించారు. పరిపాలన చేతగాక కాడి తరువాయి 2లో

## మినీ అంగన్‌వాడీలకు
# పదోన్నతి



అంగన్‌వాడీ టీచర్లుగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు

రూ. 7800ల నుంచి రూ.13,650లకు పెరిగిన వేతనం

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని మినీ అంగన్‌వాడీ టీచర్లను రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీ టీచర్లుగా పదోన్నతి కల్పించింది. రాష్ట్ర వ్యాప్తంగా పని చేస్తున్న 3,989 మినీ అంగన్‌వాడీ టీచర్లను ఇక నుంచి అంగన్‌వాడీ టీచర్లుగా తరువాయి 2లో

## గాలి జనార్ధన్‌రెడ్డికి
# ఏడేళ్లు జైలు



● బివి. శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, విడి. రాజగోపాల్‌కు కూడా... ● రూ. 10 వేల చొప్పున జరిమానా ● ఓబుళాపురం మైనింగ్ కేసులో తుది తీర్పు వెలువరించిన నాంపల్లి సిబిఐ కోర్టు ● **నిర్దోషిగా మాజీమంత్రి సబితాఇంద్రారెడ్డి**

**హైదరాబాద్ :** ఓబుళాపురం మైనింగ్ కేసులో నాంపల్లి సిబిఐ కోర్టు తుది తీర్పు వెలువరించింది. 15 ఏళ్ల పాటు సుదీర్ఘ విచారణ అనంతరం ఈ కేసులో మొత్తం ఐదుగురిని దోషులుగా, ఇద్దరిని నిర్దోషులుగా ప్రకటించింది. ఈ కేసులో ప్రధాన నిందితులైన గాలి జనార్ధన్‌రెడ్డి, బివి. శ్రీనివాసరెడ్డి, మెఫజ్ అలీఖాన్, గనుల శాఖ అప్పటి డైరెక్టర్ విడి. రాజగోపాల్‌ను దోషులుగా నిర్ధారిస్తూ శిక్షలు ఖరారు చేసింది. గాలి జనార్దన్ రెడ్డి సహా నలుగురికి ఏడేళ్ల పాటు జైలు శిక్ష ఖరారు చేసింది. అలాగే, దోషులకు రూ.10వేలు చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. ఓబుళాపురం మైనింగ్ కంపెనీకు రూ.2 లక్షలు జరిమానా విధించింది. ఈ కేసులో అప్పటి గనుల శాఖ మంత్రిగా ఉన్న సబితా ఇంద్రారెడ్డికి తరువాయి 2లో

### హర్షం వ్యక్తంచేసిన సబిత



ఓబుళాపురం మైనింగ్ కేసులో తనను సిబిఐ కోర్టు నిర్దోషిగా ప్రకటించడంపై మాజీ మంత్రి, బిఆర్‌ఎస్ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. తనను నిర్దోషిగా ప్రకటించిన న్యాయ వ్యవస్థకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. ఈ కేసు విషయంలో తరువాయి 2లో

## 300 సివిల్ డిఫెన్స్ జిల్లాలలో
# నేడు 'మాక్ డ్రిల్స్'

అణువిద్యుత్ కేంద్రాలు, సైనిక స్థావరాలు, శుద్ధి కర్మాగారాలు, జలవిద్యుత్ ఆనకట్టలు వంటి సున్నితమైన ప్రాంతాల్లో సైరన్ హెచ్చరికలు



**న్యూఢిల్లీ :** భారతదేశంపాకిస్థాన్ మధ్య యుద్ధ మేఘాలు మరింత కమ్ముకుంటున్న నేపథ్యంలో భారత్ దేశవ్యాప్తంగా ప్రజలను మాక్ డ్రిల్లుల ద్వారా అప్రమత్తం చేస్తోంది.అణువిద్యుత్ కేంద్రాలు, సైనిక స్థావరాలు, శుద్ధి కర్మాగారాలు, జలవిద్యుత్ ఆనకట్టలు వంటి సున్నితమైన సంస్థాపనలు కలిగిన దాదాపు '300 సివిల్ డిఫెన్స్ జిల్లాలలో' వైమానిక దాడి హెచ్చరిక సైరన్‌లు మోగించి శత్రుదాడిని ఎదుర్కొనేందుకు సన్నద్ధులను చేస్తోంది. పౌర శిక్షణ, బంకర్లు, కందకాలను శుభ్రపరచడం వంటి తక్షణ చర్యలు కూడా మాక్ డ్రిల్లులలో భాగంగా కవర్ చేయబడుతున్నాయి. మంగళవారం కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ అధ్యక్షతన జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశంలో మాక్ కసరత్తును ఏవిధంగా నిర్వహించి, అందులో ప్రజలను చురుకైన భాగస్వాములను చేయాలన్నదానిపై లోతుగా చర్చించారు. దేశంలోని అత్యున్నత సివిల్, పోలీస్ ఆఫీసర్లు ఈ సమావేశంలో పాల్గొన్నారు. అధికారవర్గాలు ఈ విషయాన్ని వెల్లడించాయి. కేంద్ర హోం వ్యవహారాల మంత్రిత్వశాఖ శత్రుదేశం నుంచి 'సరికొత్త, సంక్లిష్ట బెదిరింపుల' తరువాయి 2లో

### హైదరాబాద్‌లో నాలుగు చోట్ల..

హైదరాబాద్‌లోని నాలుగు ప్రాంతాల్లో మాక్ డ్రిల్‌ను రక్షణ శాఖ బృందాలు నిర్వహించనున్నాయి. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు సికింద్రాబాద్ కంటోన్మెంట్, గోల్కొండ, కంచన్ బాగ్, మల్లాపూర్‌లలోని ఎన్‌ఎఫ్‌సిలలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించనున్నారు. ఈ మేరకు రక్షణ శాఖ ఉన్నతాధికారులు మంగళవారం వెల్లడించారు. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ క్రమంలో ఏ క్షణం ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొన్నది. శత్రువుల నుంచి దాడులు ఎదురైన పక్షంలో పౌరులు సమర్థవంతంగా ఆత్మరక్షణ చేసుకునేందుకు పాటించాల్సిన అంశాలపై బుధవారం సెక్యూరిటీ మాక్ డ్రిల్స్ నిర్వహించాలని ఆదేశించింది. ఢిల్లీ, ముంబయి, చెన్నై తదితర నగరాలతోపాటు 259 ప్రదేశాల్లో మెగా సెక్యూరిటీ డ్రిల్ నిర్వహించనున్నారు. దాడులకు అవకాశం ఉన్న జిల్లాలను మూడు కేటగిరీలుగా విభజించారు. కేటగిరి 2లో తెలుగు రాష్ట్రాల్లోని విశాఖపట్నం, హైదరాబాద్‌లో ఉన్నాయి.

## ఇంటలిజెన్స్ నివేదిక వల్లే
# ప్రధాని కశ్మీర్ పర్యటన రద్దు

కాంగ్రెస్ చీఫ్ ఖర్గే ఆరోపణ
పహల్గామ్‌కు భద్రతా బలగాలను ఎందుకు పంపలేదని నిలదీత

**రాంచి :** జమ్ముకశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రదాడికి జరగడానికి మూడు రోజుల ముందు ఇంటలిజెన్స్ నివేదిక అందిందని, అందువల్లే ప్రధాని నరేంద్రమోదీ కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే పేర్కొన్నారు. పహల్గామ్ మారణహోమంలో తరువాయి 12లో

## భారత్– బ్రిటన్ మధ్య
# స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం

● పెట్టుబడులు, ఉద్యోగాల సృష్టికి సరికొత్త ద్వారం ● రెండు దేశాల్లో జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని మోదీ–స్టార్‌మర్ ఆశాభావం



**న్యూఢిల్లీ:** భారత్–బ్రిటన్ దేశాలమధ్య చరిత్రాత్మకమైన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టిఎ) మంగళవారంనాడు పూర్తయింది. ఈ సందర్భంగా రెండు దేశాల ప్రధానమంత్రులూ టెలిఫోన్‌లో సంభాషణ జరిపారు. ''ఈ చరిత్రాత్మక మైలురాయిఘట్టం వాణిజ్యానికి, పెట్టుబడులకు, వృద్ధికి ఉత్ప్రేరకంగా దోహదం చేస్తుంది, రెండు దేశాల ఆర్థిక వ్యవస్థలలో ఉద్యోగాల సృష్టికి దోహదపడుతుంది'' అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ టెలిఫోన్‌లో తరువాయి 2లో

## ద్వైపాక్షిక చర్చల ద్వారా
# పరిష్కరించుకోండి

**భారత్ – పాక్ సమస్యపై తేల్చిచెప్పిన ఐక్యరాజ్య సమితి భద్రతామండలి**



● పాకిస్థాన్‌కు దిమ్మతిరిగే ప్రశ్నలు ● క్షిపణి పరీక్షలు, యుద్ధయత్నాలపై ఆందోళన ● తనకు అనుకూలంగా అంతర్జాతీయ సమస్య చేయాలనుకున్న పాక్ ప్రయత్నం విఫలం

**న్యూఢిల్లీ:** పహల్గామ్ ఘటనపై భారత్‌కు వ్యతిరేకంగా తీర్మానం చేసి ప్రయోజనం పొందాలని ప్రయత్నం చేసిన పాకిస్థాన్‌కు ఐక్యరాజ్యసమితి భద్రతామండలిలో చుక్కెదురైంది. పాకిస్థాన్‌కు దిమ్మదిరిగే ప్రశ్నలు ఎదురయ్యాయి. పాకిస్థాన్ చేస్తున్న క్షిపణిపరీక్షలు, యుద్ధప్రయత్నాలపట్ల భద్రతామండలిలో ఆందోళన వ్యక్తమైంది. సమస్యను ద్వైపాక్షికంగా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని తరువాయి 12లో

## కర్రెగుట్టల్లో
# ఏం జరుగుతోంది?



ఓవైపు వైమానిక దాడులు.. మరోవైపు భూతలం కూంబింగ్
మావోయిస్టు అగ్రనేతలు హతమయ్యారా? గాయపడ్డారా?
శాంతి చర్చల ప్రతిపాదనను పట్టించుకోని కేంద్రం

ప్రజాపక్షం/ఖమ్మం

కర్రెగుట్టలపై ఏమి జరుగుతోంది. ఇప్పుడు యావత్ దేశంలో జరుగుతున్న చర్చ ఇది. కర్రెగుట్టలపై 20వేల మంది పోలీసుల కూంబింగ్ తర్వాత బస్తార్ ఐజి సుందర్ రాజన్ చెప్పినట్లుగా మావోయిస్టు అగ్రనేతలు గాయపడ్డారా అన్న చర్చ కూడా సాగుతుంది. మావోయిస్టులకు కీలక స్థానంగా ఉన్న తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు బీజాపూర్ జిల్లాలోని కర్రెగుట్టలపై పోలీసులు ఒక పక్క వైమానిక దాడులు, మరో పక్క భూతలం నుంచి కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. 15 రోజులుగా ఆపరేషన్ జరుగుతున్నా ఇంత వరకూ మావోయిస్టుల జాడ కనిపించ లేదు. ఇప్పటి వరకూ ఒక మావోయిస్టు కూడా కర్రెగుట్టలపై మరణించినట్లు తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## ఇక రష్యాతో ఇయు ఇంధన దిగుమతి రద్దు

**వాలెన్సియా :** రాబోయే రెండేళ్ళలో రష్యా నుండి శిలాజ ఇంధన దిగుమతులను పూర్తిస్థాయిలో రద్దు చేయాలని యూరోపియన్ కమిషన్ ప్రతిపాదించనున్నది. అదేవిధంగా గ్యాస్ దిగుమతులను కూడా పూర్తిగా రద్దుచేయాలని యూరోపియన్ పార్లమెంటులో మంగళవారంనాడు ప్రతిపాదించింది. యూరోపియన్ యూనియన్ అధికార ప్రతినిధి స్టీఫర్ డీ కీర్స్‌మేకే ఈ విషయం చెప్పారు. ఈ ఏడాది ఆరంభంలో చేసిన ఈ ప్రతిపాదనను ఇప్పటికే రెండుసార్లు వాయిదా వేసినట్లు ఆయన చెప్పారు. బుధవారం నాడు తాము ఒక పత్రికాగోష్ఠి నిర్వహించి, దీనికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియజేస్తామన్నారు. ప్రస్తుతం ఉన్న కాంట్రాక్టుల కింద దిగుమతయ్యే శిలాజ ఇంధనాన్ని రాబోయే రెండేళ్ళలో నిలిపివేసేవిధంగా, కొత్త గ్యాస్ కాంట్రాక్టులను కూడా ఈ ఏడాది చివరి నాటికి రద్దుచేసేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయాన్ని యూరోపియన్ కమిషన్ చైర్మన్ ఉర్సులా వోండర్ లేయర్ కూడా గతనెలాఖరులో స్పెయిన్‌లోని వాలెన్సియాలో జరిగిన యూరోపియన్ పీపుల్స్‌పార్టీ కాంగ్రెస్ సమావేశంలో చెప్పారు. ఉక్రేన్‌లో పూర్తిస్థాయి యుద్ధం తర్వాత యూరోపియన్ యూనియన్ ఈ నిర్ణయానికి వచ్చింది.

## ఛాన్సలర్ ఎన్నికలో మెర్జ్ దిగ్భ్రాంతికర ఓటమి

### జర్మనీలో మళ్ళీ ఎన్నికలకు ఎఎఫ్‌డి డిమాండ్




**బెర్లిన్ :** జర్మనీలో క్రిస్టియన్ డెమోక్రటిక్‌పార్టీ (సిడియు) నాయకుడు ఫ్రెడరిక్ మెర్జ్ ఛాన్సలర్ పదవి దక్కించుకోవడంలో విఫలమయ్యారు. ఆయన ఓటమి అందరికీ తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. ఆయన కూటమికి పూర్తి మెజారిటీ ఉన్నప్పటికీ రహస్య బ్యాలెట్‌లో మాత్రం ఆయనకు తగినన్ని ఓట్లు పడలేదు. ఈ కూటమి సభ్యులలో ఎవరు ఫిరాయించారనే విషయం ఇంకా పూర్తి వివరాలు తెలియరాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు సంతకాలు విజయవంతంగా చేసిన తర్వాత కూడా పార్లమెంటులో మెర్జ్‌కు పూర్తిస్థాయి మెజారిటీ రాకపోవడం గమనార్హం. పార్లమెంటులో సోషల్ డెమోక్రటిక్ పార్టీ (ఎస్‌పిడి), క్రిస్టియన్ డెమోక్రటిక్ యూనియన్ (సిడియు), సోషల్ యూనియన్ ఇన్ బవారియా (ఎస్‌యుబి)లకు ఉమ్మడిగా 328 స్థానాల బలం ఉంది. ఐతే ఫ్రెడరిక్ మెర్జ్ అదేరోజు రెండోసారి రెండో రౌండు ఎన్నికలకు సిద్ధపడలేదు. ఛాన్సలర్ పదవి ఖచ్చితంగా మెర్జ్ గెలుచుకుంటారని అందరూ భావించారు. బుధవారంనాడు ఆయన అధికారిక హోదాలో విదేశీ పర్యటన కూడా చేయాల్సి ఉంది. దీంతో ఆయన విదేశీ పర్యటన అనిశ్చితంగా మారింది. పారిస్, వార్సాలలో ఆయన పర్యటించాల్సి ఉంది. రెండోరౌండ్‌లో కూడా మెర్జ్ తిరిగి పోటీ పడే అవకాశం ఉంది. ఐతే ఆయనతోపాటు ఇతర అభ్యర్థులు కూడా పోటీ పడి మెజారిటీస్థానాలు పొందే అవకాశాలు కూడా చట్టబద్ధంగా ఉన్నాయి. 14 రోజుల్లో తిరిగి ఎన్నికల జరగకపోతే వెంటనే సింపుల్ మెజారిటీతో మరో అభ్యర్థిని ఎన్నుకునే అవకాశాలు కూడా చట్టబద్ధంగా ఉన్నాయి. జర్మనీ రాజ్యాంగంలోని 63వ అధికరణ ప్రకారం ఒక నాయకుడు ఛాన్సలర్ పదవి గెలుచుకోలేకపోతే తిరిగి 14 రోజుల వ్యవధిలో పూర్తి మెజారిటీతో ఫెడరల్ ఛాన్సలర్‌ను ఎన్నుకోవచ్చును. పార్లమెంటు బుండేస్టాగ్‌లో మంగళవారంనాడు జరిగిన మొదటి రౌండు ఎన్నికల్లో ఆయన ఛాన్సలర్ పదవి దక్కించుకోడానికి తగినన్ని పొందలేకపోయారని బుండేస్టాగ్ అధ్యక్షుడు జూలియా క్లోక్నెర్ చెప్పారు. దీంతో దేశంలో తిరిగి ఎన్నికలు నిర్వహించాలని ఎఎఫ్‌డి పార్టీ డిమాండ్ చేసింది. బుండేస్టాగ్‌లో ఉన్న మొత్తం 610 మంది పార్లమెంటు సభ్యులకు గాను 320 మంది మాత్రమే ఆయనకు అనుకూలంగా ఓటు వేశారు. ఆయన ఛాన్సలర్ పదవి దక్కించుకోవాలంటే మొత్తం 316 ఓట్లు అవసరం అవుతాయి. కేవలం ఆరు ఓట్ల తేడాతో మొదటిరౌండ్‌లో ఆయన ఛాన్సలర్ పదవిని పోగొట్టుకున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి 23న జర్మనీ పార్లమెంటుకు ఎన్నికలు జరిగాయి. సిడియు, సిఎస్‌యు కూటమికి 28.5 శాతం ఓట్లు లభించాయి. అల్టర్నేటివ్ ఫర్ జర్మనీ పార్టీ మొదటిసారి జర్మనీ చరిత్రలో 20.8 శాతం ఓట్లు సంపాదించుకుని రెండోస్థానంలో ప్రధాన ప్రతిపక్షంగా ఎదిగింది. 16.4 శాతం ఓట్లుతో సోషల్ డెమోక్రటిక్ పార్టీ మూడోస్థానంలో నిలిచింది. గ్రీన్స్‌పార్టీకి 11.6 శాతం ఓట్లు, వామపక్షాలకు 8.8 శాతం ఓట్లు లభించాయి.

## రుమేనియా ప్రధానమంత్రి రాజీనామా

### మే 18న రెండో రౌండ్ అధ్యక్ష ఎన్నిక







**బుఖారెస్ట్ :** రుమేనియా అధ్యక్ష ఎన్నికల్లో నేషనలిస్ట్ పార్టీ మొదటి రౌండ్‌లో ఆధిక్యత సాధించింది. దీంతో యూరోపియన్ యూనియన్ అనుకూల, సోషల్ డెమోక్రటిక్‌పార్టీకి చెందిన సంకీర్ణ ప్రభుత్వ ప్రధాన మంత్రి మార్సెల్ సియోలా (57) తన పదవికి రాజీనామా చేశారు. గత ఏడాది జరిగిన ఎన్నికల్లో సియోలా అధికారంలోకి వచ్చారు. సియోలా రాజీనామా చేయడంతో తదుపరి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ఏర్పడేవరకూ నేషనల్ లిబరల్ పార్టీకి చెందిన దేశీయాంగమంత్రి కేటలిన్ ప్రెడోయిన్‌ను ప్రధానమంత్రిగా నియమితులయ్యారు. ప్రెడోయిన్ తాత్కాలికంగా 45 రోజులపాటు అధికారంలో కొనసాగుతారు. అధ్యక్ష పదవికి జరిగిన మొదటి రౌండు ఎన్నికల్లో పచ్చి మితవాది, యూనియన్ ఆఫ్ రుమేనియన్స్ కూటమి (ఎయుఆర్) వ్యవస్థాపకుడు జార్జి సిమియోన్ (39) విజయం సాధించారు. రుమేనియా ఉభయసభల్లోనూ 2024 నుండి ఎయుఆర్ రెండవ అతిపెద్ద పార్టీగా కొనసాగుతున్నది. జార్జి సిమియోన్ మొదటిరౌండ్‌లో 40.9 శాతం ఓట్లు సంపాదించుకున్నారు. మే 18వ తేదీన జరిగే రెండో రౌండు ఎన్నికల్లో కూడా ఆయనే హాట్ ఫేవరెట్‌గా కొనసాగుతున్నారు. రెండో రౌండులో లిబరల్ పార్టీకి చెందిన బుఖారెస్ట్ మేయర్ నికుసోర్ డాన్‌ను సిమియోన్ ఎదుర్కొంటారు. గత ఏడాది డిసెంబరులో రుమేనియా అధ్యక్ష ఎన్నికల్లో గెలిచిన జార్జెస్క్యూ వెనుక రష్యా జోక్యం ఉందన్న కారణంతో రాజ్యాంగ కోర్టు రెండో రౌండు ఎన్నికలకు 48 గంటల ముందు జార్జెస్క్యూ అభ్యర్థిత్వాన్ని రద్దుచేసింది.

## శ్రీలంకలో స్థానిక ఎన్నికలు

**కొలంబో :** శ్రీలంకలో స్థానిక కౌన్సిల్ ఎన్నికలు జరిగాయి. దేశాధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకే సారథ్యానగల అధికార నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పిపి)పార్టీకి ఇది కీలక పరీక్ష. మంగళవారం ఉదయం ఏడు గంటలకు ప్రారంభమైన ఓటింగ్ సాయంత్రం నాలుగు గంటలకు ముగిసింది. మొత్తం 339 స్థానిక ప్రభుత్వాలను ఎన్నుకుంటారు. కోటీ 71 లక్షలమంది ఓటర్లు 8.287మంది నాయకులను స్థానిక సంస్థలకు ఎన్నుకోవలసి ఉంది. వీరికోసం 13,759 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 49 రాజకీయ పార్టీలకు చెందిన 75,000 మంది అభ్యర్థులు ఈ స్థానిక ఎన్నికలకు పోటీపడుతున్నారు. వీరిలో 257 స్వతంత్ర గ్రూపులున్నాయి. ఎన్నికైన వారు నాలుగు సంవత్సరాలపాటు అధికారంలో కొనసాగుతారు. గత ఏడాది దిస్సనాయకే దేశాధ్యక్షుడుగా ఎన్నికైన తర్వాత జరిగిన మొట్టమొదటి స్థానిక ఎన్నికలివే. 2018లో చివరిసారి స్థానిక సంస్థలకు శ్రీలంకలో ఎన్నికలు జరిగాయి. ఈ స్థానిక ఎన్నికలు రెండుసార్లు వాయిదాపడిన తర్వాత తిరిగి ఇప్పుడు జరుగుతున్నాయి. గత ఏడాది సెప్టెంబరులో 42 శాతం ఓట్లతో దిస్సనాయకే దేశాధ్యక్షుడుగా విజయం సాధించారు. సుపరిపాలన అందించేందుకు వీలుగా ఎన్‌పిపిని గెలిపించాలని ఓటర్లకు దిస్సనాయకే విజ్ఞప్తి చేశారు.

## రష్యాపై 100 డ్రోన్లతో ఉక్రేన్ దాడి

### గట్టి జవాబిస్తామని రష్యా హెచ్చరిక



**మాస్కో :** నాజీ ఉన్మాదులపై రెండో ప్రపంచయుద్ధంలో విజయం సాధించిన రష్యా ఈనెల తొమ్మిదో తేదీన మాతృదేశంకోసం చేసిన మహాయుద్ధ 80వ విజయోత్సవ వేడుకలు చేసుకుంటున్నది. ఈ సందర్భంగా ఈనెల ఎనిమిదో తేదీ నుండి పదో తేదీ వరకూ ఉక్రేన్‌పై కాల్పుల విరమణ ప్రకటించింది. కానీ ఉక్రేన్ దాడులు కొనసాగించడంతో రష్యా ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒకవేళ ఉక్రేన్ గనుక పుతిన్ ప్రకటించిన మూడు రోజుల కాల్పుల విరమణను ఉల్లంఘిస్తే తగినవిధంగా సమాధానం చెబుతామని క్రెమ్లిన్ అధికార ప్రతినిధి దీమ్రీ పెస్కోవ్ హెచ్చరించారు. కాగా ఉక్రేన్ డ్రోన్లతో దాడులు చేయడంతో మాస్కోలోని నాలుగు విమానాశ్రయాలలోనూ విమానాల రాకపోకలను నిలిపివేశారు. మొత్తం 100కుపైగా ఉక్రేన్ డ్రోన్లు రష్యాలోని వివిధ ప్రాంతాలపై దాడులు చేశాయి. మరో తొమ్మిది విమానాశ్రయాలలో కూడా తాత్కాలికంగా రాకపోకలను నిలిపివేశారు. వరుసగా రెండో రోజున కూడా ఉక్రేన్ ఈ విధంగా రష్యాపై దాడులు చేసిందని రష్యా రక్షణ అధికారులు చెప్పారు. అదేవిధంగా రష్యా దళాలు కూడా 20 షాహెద్ డ్రోన్లను ఖార్కీవ్‌పై ప్రయోగించింది. ఈ దాడుల్లో ఏడుగురుపైగా పౌరులు గాయపడ్డారు.

## 'మాక్ డ్రిల్స్' (మొదటి పేజీ తరువాయి)

నేపథ్యంలో అన్ని రాష్ట్రాల ప్రజలను మాక్‌డ్రిల్లులను నిర్వహించాలని కోరింది. కశ్మీర్‌లోని పహల్గామ్‌లో జరిపిన ఉగ్రదాడిలో 26మంది ప్రజలను ఉగ్రవాదులు అత్యంత కిరాతకంగా కాల్చి చంపిన పరిణమాల అనంతరం ఇరుదేశాల మధ్య చోటుచేసుకుంటున్న ఉద్రిక్తతల దృష్ట్యా నిర్వహించిన ఈ సమావేశం అత్యంత ప్రాధాన్యతను సంతరించుకుంది. అన్ని రాష్ట్రాలకు చెందిన అధికారులు ఆయా రాష్ట్రాలలో విద్యాసంస్థలకు చెందిన విద్యార్థులను, ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు చెందిన ఉద్యోగులను, యూనిఫామ్ ధరించిన పోలీస్ సిబ్బంది సహా హాస్పిటల్ స్టాఫ్, రైల్వే, మెట్రో అధికారులను, పారామిలిటరీ, రక్షణ బలగాలతో ఈ మాక్ డ్రిల్లులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కోరారు. సివిల్ డిఫెన్స్ జిల్లాలు సాధారణ పరిపాలనా జిల్లాలకు భిన్నమైనవని అధికారవర్గాలు వెల్లడించాయి. కంటోన్మెంట్ ఏరియా, శుద్ధి కర్మాగారం, న్యూక్లియర్ ప్లాంట్ కలిగిఉన్న భౌగోళిక ప్రాంతం అవసరం మరియు ఆవశ్యకతను బట్టి 'సివిల్ డిఫెన్స్ జిల్లాలు'గా గుర్తించబడతాయి. 'సంబంధిత రాష్ట్ర అధికారులచే గుర్తించబడిన ఆ తరహా జిల్లాలు దేశవ్యాప్తంగా దాదాపు '300 సివిల్ డిఫెన్స్ జిల్లాలు'గా గుర్తించబడ్డాయని' వారు చెప్పారు. ఉత్తర్‌ప్రదేశ్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) ప్రశాంత్‌కుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 19జిల్లాలను మాక్ డ్రిల్లుల కోసం గుర్తించిందని, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం ఈ మాక్ డ్రిల్లులను రాష్ట్రం అంతటా ఏర్పాటు చేయాలని నిర్ణయించిందని తెలియజేశారు. మేం భారత ప్రభుత్వం తరపున సివిల్ డిఫెన్స్ మాక్ డ్రిల్లులను మే 7వ తేదీన (బుధవారం) నిర్వహించాలన్న ఆదేశాలను అందుకున్నాం. అందుకోసం 19 జిల్లాలను గుర్తించడం జరిగింది. వీటిలో ఒక జిల్లా 'ఏ' కేటగిరీ, రెండు జిల్లాలు 'సి'కేటగిరీ, మిగతా జిల్లాలు అన్నీ 'డి' కేటగిరీ కిందకు వస్తాయి' అని డిజిపి ప్రశాంత్ కుమార్ చెప్పారు. దేశంలోని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు సహా గ్రామ స్థాయి వరకూ ఈ పౌర రక్షణ పద్ధతులకు సంబంధించిన మాక్ డ్రిల్లుల కసరత్తు చేపట్టాలనే ధ్యేయంతో నిర్వహించనున్నట్లు తెలియజేశారు. డిస్ట్రిక్ట్ కంట్రోలర్లు, వివిధ జిల్లా అధికారులు, సివిల్ డిఫెన్స్ వార్డెన్లు, వాలంటీర్లు, హోంగార్డులు, నేషనల్ కేడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి), నేషనల్ సర్వీస్ స్కీమ్ (ఎన్‌ఎస్‌ఎస్), నెహ్రూల యువ కేంద్ర సంఘతన్ (ఎన్‌వైకెఎస్), కళాశాల, పాఠశాల విద్యార్థులు ఈ మాక్ డ్రిల్లుల కసరత్తులో భాగస్వాములను చేయనున్నారు.

## పదోన్నతి

(మొదటి పేజీ తరువాయి)

పదోన్నతి కలిపిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో మినీ అంగన్‌వాడీ టీచర్లకు వేతనాలు రూ. 7800ల నుంచి రూ. 13,650లకు పెరగనుంది. పదోన్నతులు ఈనెల నుంచే అమలులోనికి రానున్న నేపథ్యంలో పెరిగిన వేతనాలను ఏప్రిల్ మాసం నుంచి క్రమం తప్పకుండా అందజేయనున్నారు. ఈ ఉత్తర్వుల ప్రకారం రాష్ట్రంలో ఇక నుంచి మినీ, మెయిన్ అనే తేడా లేకుండా అందరినీ అంగన్‌వాడీ టీచర్లుగా పరిగణించనున్నారు. పలు సాంకేతిక, న్యాయపరమైన చిక్కుల కారణంగా మినీ అంగన్‌వాడీ టీచర్లను పదోన్నతి జాప్యం జరిగినట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఎటువంటి చిక్కులు లేకుండా సమస్యను పరిష్కరించి, ఇక నుంచి ప్రతి నెలా అంగన్‌వాడీ టీచర్ల మాదిరిగానే తమను అంగన్‌వాడీ టీచర్ల వేతనాలను అందిస్తున్న మంత్రి ధనసరి అనసూయ సీతక్కకు మినీ అంగన్‌వాడీ టీచర్లు కృతజ్ఞతలు తెలిపారు.

## చర్చలకు కమిటీ

(మొదటి పేజీ తరువాయి)

కె.రామకృష్ణ రావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చించి, వారు ప్రాస్తవించిన అంశాలు, పెండింగ్ సమస్యలను గుర్తించి, వాటిని అధ్యయనం చేసి, వాటి అమలు సాధ్యాసాధ్యాలపై చర్చించి సమగ్రమైన నివేదికను రూపొందించాలి. ఈ ప్రక్రియను మొత్తం ఏడు రోజుల్లో పూర్తి చేసి రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి స్థాయి నివేదికను సమర్పించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకపోతే ప్రత్యేక్ష ఆందోళనకు దిగుతామని టిజిఇజెఎసి హెచ్చరించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో చర్చనీయంశంగా మారాయి. ఉద్యోగ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే అధికారులతో కమిటీని ఏ ర్పాటు చేయడం పట్ల ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

**నేటి నుంచి చర్చలు ప్రారంభం :** ఉద్యోగ సంఘాలతో బుధవారం నుంచి చర్చలు ప్రారంభంకానున్నాయి. హైదరాబాద్‌లోని సచివాలయంలో బుధవారం సాయంత్రం 4గంటలకు ఐఎఎస్ అధికారుల సమావేశం కానున్నట్టు టిజిఇజెఎసి ప్రధాన కార్యదర్శి ఏలూరి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సమావేశంలో జెఎసి తరపున సుమారు 15 మంది ప్రతినిధులు హాజరుకానున్నామని పేర్కొన్నారు. కాగా ఈ సమావేశనంతరం సాయంత్రం 5 గంటలకు తెలంగాణ ఉద్యోగుల జెఎసి సమావేశం కానున్నట్టు చైర్మన్ వి.లచ్చిరెడ్డి తెలిపారు. పలు సంఘాలతో వేర్వేరుగా సమావేశం కానున్న అధికారుల కమిటీ వారి నుంచి పలు సమస్యలపై చర్చించి, వినతి పత్రాలను స్వీకరించనుంది. ఈ సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు తమ సమస్యలను కమిటీ దృష్టికి తీసుకురానున్నారు. అయితే ఐఎఎస్ అధికారుల కమిటీ ఉద్యోగ సంఘాలతో చర్చల అనంతరం, వారి వినతులను స్వీకరించిన తర్వాత, ఆ కమిటీ తమ నివేదికలో ఆర్థిక, ఆర్థికేతర సమస్యలతో వేర్వేరుగా ప్రభుత్వానికి నివేదిక సమర్పించనున్నట్టు తెలిసింది.

## వాణిజ్య ఒప్పందం

(మొదటి పేజీ తరువాయి)

బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్‌మర్‌తో చెప్పారు. ఈ చరిత్రాత్మక వాణిజ్య ఒప్పందంతోపాటు రెండు దేశాల ద్వైపాక్షిక సహకార ఒప్పందం కూడా పూర్తయింది. బ్రిటన్‌దేశం యూరోపియన్ యూనియన్ నుండి బయటకు వచ్చినప్పటినుండీ చేసుకున్న అతిపెద్ద వాణిజ్య ఒప్పందం ఇదేనని ఈ సందర్భంగా మోదీతో కీర్ స్టార్‌మర్ చెప్పారు. ''ఈ చారిత్రక మైలురాయి ఘట్టంలో భారత్‌-బ్రిటన్ దేశాలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న పరస్పర ప్రయోజనకరమైన స్వేచ్ఛావాణిజ్య ఒప్పందాన్ని దాంతోపాటు ద్వంద్వ సహకార ఒప్పందాన్ని కూడా విజయవంతంగా పూర్తిచేశాం'' అని నరేంద్రమోదీ సోషల్ మీడియాలో పోస్టింగ్ పెట్టారు. ''ఈ చరిత్రాత్మక ఒప్పందం తదుపరి రెండు దేశబూల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేస్తుంది, వాణిజ్యానికి, పెట్టుబడులకు, వృద్ధికి, ఉద్యోగాల సృష్టికి ఉత్ప్రేరకంగా ఉంటుంది, రెండుదేశాల ఆర్థిక వ్యవస్థల నవీకరణకు దోహదపడుతుంది'' అని పేర్కొన్నారు. ''సమతుల్యమైన, సమానత్వంతో నిష్పక్షపాతమైన, ఎంతోకాలంగా ఆత్రంగా ఎదురుచూస్తున్న సేచ్ఛావాణిజ్య ఒప్పందం పూర్తికావడంతో ద్వైపాక్షిక వాణిజ్యంలో వస్తుసేవలలో వ్యాపారం గణనీయంగా వృద్ధిచెందుతుందని అంచనావేస్తున్నాం, ఉద్యోగాలవృద్ధికి కొత్త ద్వారాలు తెరచుకుంటాయి, తద్వారా జీవన ప్రమాణాలు బ్రహ్మాండంగా పెరుగుతాయి, పౌరుల జీవన విధానం రెండు దేశాలలో బాగా మెరుగుపడుతుందని అంచనావేస్తున్నాం'' అని భారత ప్రకటన పేర్కొంది. రెండు దేశాలలో సంయుక్తంగా ఉత్పత్తులు, ప్రపంచ మార్కెట్ సేవలు గణనీయంగా విస్తరిస్తాయి,కొత్త సామర్థ్యాలు వెల్లువెత్తుతాయని, మార్కెట్లు విస్తరిస్తాయని ప్రకటన పేర్కొంది. రెండుదేశాల ప్రజలమధ్య ఆర్థిక అనుబంధం, కొత్త సంబంధాలు వృద్ధి చెందుతాయని నాయకులు పేర్కొన్నారు. ఈ ఒప్పందంవల్ల మైత్రీబంధం బలపడుతుందని, మరింత బలమైన, భద్రతతో కూడిన ఆర్థిక వ్యవస్థతో ప్రపంచవ్యాప్తంగా వాణిజ్యపరమైన ఆటంకాలు గణనీయంగా తొలగిపోతాయని కీర్‌స్టార్‌మర్ అన్నారు. ఈ ఒప్పందం వల్ల బ్రిటన్ ఆర్థిక వ్యవస్థలో బిలియన్లకొద్దీ ధనం కొత్తగా వచ్చి చేరుతుందని, వేతనాలు గణనీయంగా పెరుగుతాయనీ, ప్రభుత్వ ప్రణాళికలలో మార్పులు జరుగుతాయని బ్రిటన్ ప్రధానమంత్రి కార్యాలయం తన ప్రకటనలో పేర్కొంది. ''బ్రిటన్‌కు ఇది ఒక పెద్ద ఆర్థిక విజయం, దీనివల్ల శ్రామికులకు చేతినిండా పని, వ్యాపారాల వృద్ధి జరుగుతుందని ప్రధానమంత్రి గ్రహించారని ప్రకటన పేర్కొంది. ఇలాంటి నిర్ణయాత్మకమైన నాయకత్వం వహిస్తున్న స్టార్‌మర్‌కు మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు.

## హర్షం వ్యక్తం చేసిన సబిత

(మొదటి పేజీ తరువాయి)

పన్నెండున్నరేళ్ల క్రితం కన్నీళ్లతో కోర్టు మెట్లు ఎక్కానని ఈ సందర్భంగా ఆమె గుర్తు చేసుకున్నారు. ఎన్ని అపవాదులు వచ్చినా తన నియోజకవర్గ ప్రజలు మాత్రం తనకు అండగా నిలిచారన్నారు. తీర్పు అనంతరం ఆమె కోర్టు వద్ద మీడియాతో మాట్లాడుతూ.. ఏ తప్పూ చేయకపోయినా ఈ కేసులో నన్ను చేర్చడంపై బాధ పడ్డాను. న్యాయ వ్యవస్థ ద్వారా తనకు న్యాయం జరుగుతుందని నమ్మాను. ఈరోజు అదే జరిగింది. కానీ, ఇన్నేళ్లుగా నేను పడిన అవమానాలు, ప్రతిపక్షంలో ఉన్నవారు నన్ను అవినీతిపరురాలినని, జైలుకు పోతానని మాటలు అంటుంటే ఎంతో బాధపడ్డాను. అలా ప్రచారం చేసినా నా జిల్లా ప్రజలు, నియోజకవర్గం ప్రజలు నాపై సంపూర్ణంగా విశ్వాసం ఉంచారు. ఎవరెన్ని మాట్లాడినా నమ్మకుండా నన్ను గెలిపిస్తూ వచ్చారు.

## అందాల పోటీలకు ఉంటాయా?

(మొదటి పేజీ తరువాయి)

కింద పడేశారనే విషయం ఉద్యోగ సంఘాలనుద్దేశించి సిఎం రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలతో తేలిపోయిందన్నారు. ఉద్యోగులకు, ప్రజలకు మధ్య చిచ్చుపెట్టేందుకు సిఎం ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇక నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని తిట్టినా, కెసిఆర్‌ను దూషించినా చూస్తూ ఊరుకోబోమని,నాలుక చీరేస్తామని హెచ్చరించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు, ఎంఎల్‌ఎలు, మాజీ ఎంఎల్‌ఎలతో కలిసి కెటిఆర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు పైసలు లేవు కానీ,అందాల పోటీలను నిర్వహించేందుకు పైసలు ఉంటాయా అని ప్రశ్నించారు. అధికారం కోసం అడ్డగోలుగా హామీలు ఇచ్చారని, ఇచ్చిన హామీలను అమలు చేయకుండా తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టిన అంశాలనే ఉద్యోగులు అడుగుతున్నారని, రిటైర్డ్ ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇచ్చేందుకు పైసలు లేవా అని అన్నారు. ఆదాయం పెరిగిన తెలంగాణ రాష్ట్రాన్ని తాము కాంగ్రెస్ చేతిలో పెట్టామన్నారు. రాష్ట్ర అప్పులపైన సిఎం నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని, రేవంత్ రెడ్డి సర్కార్ నడుపుతున్నారా.?, సర్కస్ నడుపుతున్నారా? అని ప్రశ్నించారు. రాష్ట్రం దివాళా తీసిందని ఎవరైనా బజారున పెట్టుకుంటారా అని మండిపడ్డారు. అలాంటివి ఏమైనా ఉన్నప్పటికీ అంతర్గతంగా మాట్లాడాలన్నారు.

## ఏడేళ్ల జైలు

(మొదటి పేజీ తరువాయి)

ఉపశమనం లభించింది. ఆమెతో పాటు అప్పటి పరిశ్రమల శాఖ కార్యదర్శి కృపానందంను సిబిఐ కోర్టు నిర్దోషులుగా ప్రకటించింది.

**విడి. రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్ల జైలు**

ఈ కేసులో విడి.రాజగోపాల్‌కు అదనంగా మరో నాలుగేళ్ల జైలు శిక్ష విధించింది. భూగర్భ గనుల శాఖ డైరెక్టర్‌గా ఉన్నందున అవినీతి నిరోధక చట్టం కింద ఆయనకు అదనపు శిక్షను ఖరారు చేసింది. ప్రభుత్వ అధికారిగా ఉంటూ అక్రమాలకు పాల్పడినందున మొత్తంగా 11 ఏళ్ల పాటు అతడికి జైలు శిక్ష పడింది. కాగా, ఈ కేసులో దోషులను అధికారులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. కోర్టులోనే వైద్యులు వీరికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం కోర్టు నుంచి చంచల్‌గూడ జైలుకు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా, 2007 జూన్ 18న ఓఎంసికి లీజులు కేటాయిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉద్దేశపూర్వకంగానే క్యాప్టివ్ అనే పదాన్ని తొలగించారని, తద్వారా అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై 2009లో డిసెంబర్ 7న తొలిసారి సిబిఐ కేసు నమోదు చేసింది. ఆ తర్వాత తెలంగాణ హైకోర్టులో స్టే రావడం, మళ్లీ డివిజన్ బెంచ్ స్టే ఎత్తివేయడం.. ఇలా పలు రకాల పిటిషన్లు వేయడంతో దాదాపు 15 ఏళ్ల పాటు విచారణ కొనసాగింది. ఐదేళ్లు దర్యాప్తునకే సమయం పట్టింది. 2009 నుంచి 2014 వరకు సీబీఐ నాలుగు ఛార్జిషీట్‌లను దాఖలు చేసింది.

## సమ్మె వాయిదా (మొదటి పేజీ తరువాయి)

పరిస్థితుల్లో ఆర్‌టిసి సమ్మెను వాయిదా వేస్తున్నామని, సమస్యలు పరిష్కరించకపోతే మళ్లీ సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు. ఈ సమస్యపై రవాణా శాఖ మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. సమస్యలను ముఖ్యమంత్రి దగ్గరకు తీసుకెళ్ళి తప్పకుండా పరిష్కారం చేస్తామని, యూనియన్లను అనుమతిస్తామని హామీనిచ్చారన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరామని, తమ డిమాండ్లకు మంత్రి సానుకూలంగా స్పందించడంతో సమ్మెను వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వంతో సుధీర్ఘంగా జరిపిన చర్చలు సఫలమయ్యామని చెప్పారు. రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్, సిపిఐ శాసనసభ పక్షనేత, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి కోదండరాం, దేవరకద్ర ఎంఎల్‌ఎ జి.మధుసూదన్ రెడ్డిలతో అనేక అంశాలపై చర్చించినట్లు పేర్కొన్నారు.

**సమస్యలు పరిష్కరించకపోతే సమ్మెకు దిగుతాం..**

ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని కోరామని తెలిపారు. ఆర్‌టిసి యూనియన్‌లపై ఆంక్షల తొలగింపు, అన్ని కేటగిరీల్లో ఖాళీ భర్తీ, గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నిర్వహణ, కారుణ్య నియామకాలు, ఉద్యోగ భద్రతపై సర్క్యులర్, నేరుగా ఆర్‌టిసికే ఎలక్ట్రిక్ బస్సులు, 2025 నుంచి రిటైర్డ్ ఉద్యోగుల ప్రయోజనాల చెల్లింపులు, 2017లో రిటైర్ అయిన వారికి వేతన సవరణ ప్రకారం బెనిఫిట్స్ వంటి డిమాండ్లపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. వేతన సవరణ గురించి సానుకూలంగా స్పందించారని, సింగరేణి మాదిరిగా రెగ్యులర్ ప్రాతిపదికన కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరామని చెప్పారు. అలాగే 2019 లో సమ్మె కాలంలో ఉద్యోగులపై వేసిన పోలీస్ కేసులను మాఫీ, ప్రభుత్వంలో ఆర్‌టిసి కార్మికుల విలీనం చేయాలని కోరినట్లు వెల్లడించారు. విలీనంపై సుదీర్ఘంగా చర్చించామని చెప్పారు. తమ అన్ని డిమాండ్లను విడతల వారీగా పరిష్కరిస్తామని సర్కార్ హామీ ఇచ్చిందని తెలిపారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో మళ్ళీ సమ్మెకు పోతామని జెఎసి నాయకత్వం రవాణా శాఖమంత్రికి తెలిపామన్నారు. మళ్ళీ సమ్మె దాకా వెళ్ళే పరిస్థితి తీసుకురామని, సమస్యలు సామరస్యంగా పరిష్కరిస్తామని, కార్మికులకు న్యాయం చేస్తామని రవాణా శాఖమంత్రి తెలిపారన్నారు. చర్చలకు సహకరించిన సిపిఐ ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావు, ప్రొఫెసర్ కోదండ రాం, దేవరకద్ర ఎంఎల్‌ఎ జి.మధుసూదన్ రెడ్డిలకు జెఎసి నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ చర్చలలో ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్షులు ఎస్.బాబు, డిప్యూటీ జనరల్ సెక్రటరీ పి.అప్పారావు, టిఎంయు అధ్యక్షులు ఎ.ఆర్.రెడ్డి, టిజెఎంయు రాష్ట్ర అధ్యక్షులు డి.వి.కె.రావు వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్ గౌడ్, వైస్ ప్రెసిడెంట్ జి.పి.ఆర్ రెడ్డి, ఎన్‌ఎంయు నాయకులు వి.బాబు, బికెయు నాయకులు ఎ.రాములు పాల్గొన్నారు.

**ప్రయాణికుల సౌకర్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది : మంత్రి పొన్నం**

ఆర్‌టిసి పరిరక్షణ, కార్మికుల సంక్షేమం, ప్రయాణికుల సౌకర్యానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రవాణా శాఖమంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. టిజిఎస్ ఆర్‌టిసి జెఎసితో చర్చలు సఫలమైన అనంతరం ఆయన మాట్లాడుతూ సమ్మె వాయిదా వేసుకోవాలని ఆర్‌టిసి కార్మిక సంఘాలకు విజ్ఞప్తి చేశామని, అందుకు వారు అంగీకరించారని తెలిపారు. ఆర్‌టిసి కార్మికులు తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలకంగా పని చేశారని మంత్రి గుర్తు చేశారు. ఆర్‌టిసి కార్మికుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. సమస్యల పరిష్కారానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి కోదండరాంలతో కలిసి ముఖ్యమంత్రితో మాట్లాడతామన్నారు. ఆర్‌టిసి సమస్యలపై ముఖ్యమంత్రితో మాట్లాడి కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

పరిగి ఎంఎల్‌ఎ రామ్మోహన్ రెడ్డి,దేవరకద్ర ఎంఎల్‌ఎ మధుసూదన్ రెడ్డి, షాట్ ఛైర్మన్ శివసేన రెడ్డిలు ఆర్‌టిసి కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దృష్టికి తీసుకురావడానికి చొరవ తీసుకున్నారన్నారు. ప్రజా పాలన ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఆర్‌టిసి కార్మికులను తమ కుటుంబంలా భావిస్తున్నామన్నారు. ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆర్‌టిసికి వ్యతిరేకంగా ఏ ఒక్క నిర్ణయం కూడా తీసుకోలేదన్నారు. గత ప్రభుత్వం ఆర్‌టిసిని నిర్వీర్యం చేస్తే, మహాలక్ష్మి పథకం తీసుకొచ్చి ఆర్టీసీని ఇప్పుడిప్పుడే లాభాల బాటలో నిలబెడుతున్నామని చెప్పారు. గత 10 సంవత్సరాలుగా ఆర్‌టిసిని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఒక్క బస్సు కొనుగోలు చేయలేదని, ఒక్క ఉద్యోగం కూడా నియామకం చేయలేదన్నారు.

## మా సోదరులే (మొదటి పేజీ తరువాయి)

అంటున్నారని, మొన్న పహల్గామ్ అంశంలో, ఆర్థిక వ్యవస్థ , నిరుద్యోగం, వ్యవసాయ రంగం అంశాలలో ఏమి సమాధానం చెబుతారని ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని కాంగ్రెస్ శాసనసభాపక్ష (సిఎల్‌పి) కార్యాలయంలో మంగళశారం నాడు మంత్రి శ్రీధర్‌బాబు జర్నలిస్టులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడుతూ పలు ప్రశ్నలకు స మాధానమిచ్చారు. ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇచ్చిన హామీల విషయంలో వెనక్కిపోమని, ఆర్థిక వనరులను పెంచుకునే ప్రయత్నం చేస్తున్నామని, పెంచుకొని అనుకున్న లక్ష్యం దిశగా ముందుకు పోతామన్నారు. కొన్ని ప్రభుత్వాలు రెండు, మూడు టర్మ్‌లలో హామీలను నెరవేర్చిందని, తాము తొందరలోనే నెరవేర్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఐఎఎస్ అధికారి స్మితా సభర్వాల్ విషయంలో ప్రభుత్వమేమి కక్ష సాధింపుతో వ్యవహరించలేదని, రూల్స్ ప్రకారమే వ్యవహరించిందని, అలాగే స్పెషల్ సిఎస్ హోదాలో ఉన్న సీనియర్ ఐఎఎస్ కాబట్టే జయేశ్ రంజన్‌కు తగిన బాధ్యతలు ఇచ్చినట్లు ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. మిస్ వరల్డ్ పోటీలను కమ్యూనిస్టులు వారి సిద్ధాంతం ప్రకారం వ్యతిరేకిస్తున్నారని, గతంలో ముంబై, ఢిల్లీలో జరిగాయని, ఈసారి హైదరాబాద్‌కు అవకాశం వచ్చిందన్నారు. ఇవి కేవలం అందం గురించే కాదని, వ్యక్తిత్వం ఏ విధంగా తీర్చిదిద్దుకోవాలనే అంశంపై కూడా ఉంటుందని చెప్పారు. ప్రజాసంక్షేమాన్ని ఆలోచించి గత ప్రభుత్వం చిన్నాభిన్నం చేసిన ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టాలని చేస్తున్న ప్రయత్నాల కారణంగా ఉద్యోగుల అంశాల పరిష్కారంలో కొంత ఆలస్యమైందన్నారు. గత ప్రభుత్వంలో మూడవ వారంలో జీతాలిచ్చేవారని, తాము వచ్చాక ఒకటవ తారీఖునే జీతాలు ఇస్తున్నామని, పెండింగ్ డిఎ కూడా ఇచ్చామని గుర్తు చేశారు. సిఎం రేవంత్‌రెడ్డి వర్క్ ఫర్ హోమ్ సిఎం అని కెటిఆర్ ఆరోపణలను ఖండిస్తూ ముఖ్యమంత్రి ప్రతి రోజు ప్రభుత్వ కార్యాలయాలలోనే వివిధ శాఖలకు సంబంధించి సమీక్షలు నిర్వహిస్తూ, అవసరమైన సంస్కరణలు తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారని, కెసిఆర్ ఫామ్ హౌజ్‌లో లేరా అని అన్నారు.

**హెలికాప్టర్‌లను గత ప్రభుత్వమే కిరాయికి తీసుకుంది :** మంత్రులు హెలికాప్టర్‌లలో ఇష్టమొచ్చినట్లు తిరిగుతున్నారని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ చేసిన ఆరోపణలపై స్పందిస్తూ గత ప్రభుత్వ హయాంలోనే హెలికాప్టర్‌ను కిరాయికి తీసుకొని ఖాళీగా ఉంచారని, తమ ప్రభుత్వం వచ్చాక మంత్రులు ఊరికే కిరాయి చెల్లించి ఖాళీగా ఉంచకుంటా అందులో తిరిగుతున్నారని శ్రీధర్ బాబు తెలిపారు. ప్రజసంక్షేమం, ప్రజలకు ఉపయోగపడే పనుల్లో భాగస్వామ్యం అయ్యేందుకే తమ మంత్రులు హెలికాప్టర్‌ను ఊపయోగిస్తున్నారని, దానికయ్యే ఖర్చు కంటే జిల్లా పర్యటనలకు వెళ్ళేందుకు మంత్రుల కాన్వాయ్‌లకు అయ్యే ఖర్చే ఎక్కువ అని తెలిపారు.

**నక్సల్స్‌తో శాంతి చర్చలు జరిపిన చరిత మాది :** నక్సలైట్ల విషయంలో కాంగ్రెస్ ద్వంద్వ ప్రమాణాలు అవలంభిస్తుందన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ వ్యాఖ్యలపై ప్రశ్నించగా, వారు జనజీవన స్రవంతిలో కలవాలని తాము భావిస్తున్నామని శ్రీధర్‌బాబు అన్నారు. మ కుటుంబంలో అన్యాయంగా ఒకరిని కోల్పోయామని, ఇంకో కుటుంబంలో అలా జరగొద్దని తాను భావిస్తున్నానని చెప్పారు. శాంతియుతంగా ఉండాలనేదే తమ పార్టీ భావన అని, బిజెపి వైఖరి బండి సంజయ్ చెప్పారని, మా ప్రభుత్వ వైఖరి మేము చెప్పామని అన్నారు.గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్న సందర్భంలోనే నక్సల్స్‌తో శాంతి చర్చలు జరిపిన విషయాన్ని గుర్తు చేశారు.

**గతంలో అసెంబ్లీలో చెప్పిన దానికంటే ఎక్కువ అప్పులు ఉన్నాయి**

ఆర్థిక పరిస్థితి బాగోలేదనే విషయం ఎన్నికల ముందు హామీలు ఇచ్చినప్పుడు తెలియదా? అని విపక్షాలు అడిగిన ప్రశ్నలకు జావాబిస్తూ గతంలో సిఎల్‌పి నేతగా భట్టి విక్రమార్క, తాను శాససభలో అప్పులు గురించి ఆందోళన వ్యక్తం చేస్తూనే వచ్చామని, అప్పుడు అసెంబ్లీలో కొన్ని లెక్కలే పెట్టారని, తాము అధికారంలోకి వచ్చాక బడ్జేటేతర అప్పులు, వివిధ పనులకు, కాంట్రాక్టర్‌లకు, ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇలా అనేక అంశాలలో బకాయిల విషయాలు కూడా తెలిసాయని, వెంటనే శ్వేత పత్రం పెట్టి గత ప్రభుత్వ నిర్వాకాన్ని ప్రజలకు వివరించామన్నారు. ఆర్‌బిఐ నివేదిక ప్రకారం నెలకు రూ.2వేల కోట్లే అప్పులు చెల్లిన్నారని కెటిఆర్ చేసిన వ్యాఖ్యలకు స్పందిస్తూ, అవి బడ్జెట్ అప్పులు మాత్రమేనని, మరి మిగతా బకాయిలు, బడ్జెటేతర అప్పుల సంగతేమిటని ప్రశ్నించారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎసిబి దాడుల్లో పట్టుబడ్డ సూపరింటెండెంట్



**ప్రజాపక్షం/ములుగు ప్రతినిధి :** ములుగు జిల్లా కేంద్రంలో అవినీతి అధికారులపై ఏసీబీ అధికారులు దాడులు చేసి పట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం జిల్లా కార్యాలయంలో రైడ్ నిర్వహించిన ఏసీబీ అధికారులు సూపరింటెండెంట్ సుధాకర్‌ను రూ.25వేల లంచం తీసుకుంటుండగా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అవినీతి లావాదేవీతో సంబంధం ఉందన్న అనుమానంతో జూనియర్ అసిస్టెంట్ సౌమ్యను కూడా అదుపులోకి తీసుకున్నారు. తోటి ఉద్యోగి ద్వారా లంచం తీసుకుంటున్న సమయం లో అధికారులు సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈ దాడితో జిల్లా వర్గాలలో ఆందోళన మొదలయ్యింది.

# వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరా

### కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణలో వ్యవసాయ రంగానికి నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు, భవిష్యత్ అవసరాల దృష్ట్యా పునరుత్పాదక ఇంధన రంగాన్ని బలోపేతం చేసేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పటిష్ట కార్యాచరణను అమలు చేస్తున్నదని, తగిన సహాయ, సహకారాలు అందించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు న్యూఢిల్లీలో మంగళవారం ఆయన కేంద్ర మంత్రిని కలిసి విజ్ఞాపన పత్రాలు అందజేశారు. ఎంఎన్ఆర్ఈ మంజూరు చేసిన పిఎం కుసుమ్ కంపోనెంట్–సి కింద 500 కెపాసిటీ 2 డబ్ల్యు సామర్థ్యం కలిగిన మొత్తం 4 వేల మెగావాట్ల సోలార్ పవర్ ప్లాంట్లను తెలంగాణ రాష్ట్రానికి కేటాయించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి విజ్ఞప్తి చేశారు. ఎంఎన్ఆర్ఈ ఈఓఐ పీరియడ్ ప్రకారం పునఃసమీక్ష అనంతరం కేటాయింపులను 4000 మెగావాట్ల నుండి 1000 మెగావాట్లకు తగ్గించి ఇవ్వాలని సమాచారం అందించిది, అలా తగ్గించి ఇస్తే రాష్ట్రం నిర్ధారించుకున్న లక్ష్యాలపై తీవ్ర ప్రభావం పడే పరిస్థితులున్నందున కేంద్రం ఆచి తూచి వ్యవహరించాలని ఆయన కోరారు. పునరుత్పాదక ఇంధన రంగంలో తెలంగాణ రాష్ట్రం సాధిస్తున్న ఫలితాలను దృష్టిలో పెట్టుకుని కేటాయింపులు చేయాలని డిప్యూటీ సిఎం కేంద్రమంత్రిని కోరారు. రాష్ట్రంలోని వ్యవసాయరంగానికి సాగు నీటి కల్పనకు శాశ్వత పరిష్కారంగా సౌర పంప్ సెట్ల ఏర్పాటు చేయాలని రాష్ట్రం భావిస్తున్నదని, ఈ నేపథ్యంలో పిఎం కుసుమ్ కంపోనెంట్–బి కింద ఒక లక్ష సౌర పంపు సెట్లను స్థాపించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషిని కోరారు. ఇప్పటికే ఈ ప్రాజెక్టుకు సంబంధించిన డిపిఆర్‌ను టిజిరెడ్‌కో ద్వారా కేంద్ర ప్రభుత్వానికి సమర్పించామని తెలిపారు. రాష్ట్ర వాటా నిధులు కేటాయించడానికి సిద్ధంగా ఉన్నట్లు కేంద్రమంత్రికి ఆయన వివరించారు. గిరిజనుల సాగు భూముల్లో విద్యుత్ లైన్ల స్థానంలో అటవీ చట్టాలు ఆటంకంగా ఉన్నందున ఈ దిశగా కేంద్రం సహకరించాలని ఉప ముఖ్యమంత్రి కోరారు. పిఎం కుసుమ కంపోనెంట్–సి కింద తెలంగాణ రాష్ట్రానికి 2 లక్షల పంపు సెట్లను కేటాయించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర మంత్రి జోషిని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో 28 వ్యవసాయరంగ సాగునీటి అవసరాల కోసం లక్షల పంపు సెట్లు వినియోగంలో ఉన్నందున సాంప్రదాయ విద్యుత్ రంగంపై భారాన్ని నివారించేందుకు వీటి అవసరాన్ని కేంద్ర మంత్రికి ఆయన వివరించారు.

# కూడు, గూడు, బాధ్యత పాలకులదే



### భారత కమ్యూనిస్టు పార్టీ సిరిసిల్ల పట్టణ మహాసభలో సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి
### సిపిఐ(ఎం) నుండి సిపిఐలోకి చేరికలు

**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల ప్రతినిధి :** ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న కూడు, గూడు, నీడ, విద్య, వైద్యం సదుపాయాలు కల్పించాల్సిన బాధ్యత పాలకులదే అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వాలు మారుతున్న ప్రజల బతుకులు మారుతలేవని, కష్టాలు తీరుతలేవని అన్నారు. సిపిఐ కార్మిక భవనంలో సిపిఐ పట్టణ మహాసభలు మంగళవారం సిరిసిల్ల సుభాష్ నగర్ నిర్వహించారు. ఈ సభలకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. పార్టీ జెండాను సిపిఐ మహిళా సీనియర్ నాయకురాలు సుంకరపెల్లి శాంతాభాయి చేతుల మీదుగా ఆవిష్కరించి మహాసభలో ఆయన మాట్లాడారు. 1925 లో మన పరిపాలన వలస వాదులైన నైజాం పాలకుల చేతిలో ఉండేదని, అప్పుడు ప్రజలకు మాట్లాడే స్వేచ్ఛ హక్కులు ఏమి లేవని, ఎస్సీలు, బీసిలు, బడుగు బలహీన వర్గాలు, సన్న చిన్న కారు రైతులు అణగారి ఉండి అయ్యా బాంచెన్ కాల్లు మొక్కుతా అనే పరిస్థితులు ఉండేవని అన్నారు. ఆనాటి దుస్థితి నుండి మన తెలంగాణలో రావి నారాయణ రెడ్డి, బద్దం ఎల్లారెడ్డి, ముగ్దుం మోయిన్, తెలంగాణ సాయుధ పోరాటం చేసి నైజాం పాలకులను గద్దె దించిన చరిత్ర అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం లేకపోతే నైజాం గద్దె దిగే వాడే కాదని ఇది ముమ్మాటికి వాస్తవం అన్నారు. అలాంటి పోరాటంలో సిరిసిల్ల ప్రాంతానికి చెందిన బద్దం ఎల్లారెడ్డి ఉండడం గర్వకారణం అన్నారు. ఇప్పటికి పేదరికం పోలేదని, 11 సంవత్సరాల క్రితం కేంద్రంలో మోదీ అధికారంలోకి వచ్చిన తరువాత అనేక హామీలు ఇచ్చాడని ఏ హామీ నెరవేర్చలేదని అన్నారు. కార్మికుల పోరాటాలు, ఆవేదన, కష్టాల నుండి పుట్టిందే జెండా ఎర్ర జెండా అని అన్నారు. నల్లధనం దోచుకుని విదేశాలలో ధనం దాచారన్నారు. విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌ధళ్ ఆగడాలని పెంచి పోషిస్తూ హిందూ దేశమని ముద్ర వేయడానికి ప్రయత్నం చేస్తున్నాడని మండిపడ్డారు. భారత దేశంలో విభిన్న మతాలు సంస్కృతులు సాంప్రదాయాలు, భాషలు భావాలు నిలయంగా ఉన్న దేశం అన్నారు. ఈ దేశంలో భిన్నత్వంలో ఏకత్వం ఉందన్నారు. పాలకులు దీనిని తుంగలో తొక్కే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. బీడి కార్మికులు హామాలీ కార్మికులు, పవర్‌లూం కార్మికులు తలలో నాలికలాగా ఉంటూ కార్మికుల హక్కులను సాధించడానికి విశ్రమించని పోరాటం జరపాలని అన్నారు. సిరిసిల్లలో బద్దం ఎల్లారెడ్డి, సింగిరెడ్డి భూపతి రెడ్డి విగ్రహాలను ఆవిష్కరించేందుకు సిరిసిల్ల పార్టీ కంకణ బద్దులు కావాలని, దానికి రాష్ట్ర పార్టీ సహకరిస్తుందని భరోసినిచ్చారు. అనంతరం సిపిఎం నుండి ఎలిగేటి రాజశేఖర్ 8 మంది నాయకులను కండువా కప్పి సిపిఐ పార్టీ లోకి చాడ వెంకట్ రెడ్డి ఆహ్వానించారు. ఈ మహాసభలలో సిపిఐ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుంటి వేణు, పట్టణ కార్యదర్శి పంతం రవి, కార్యవర్గ సభ్యులు కడారి రాములు, మీసం లక్ష్మణ్, అనసూర్య, కుర్ర రాకేష్, కేవి అనసూయ, అజ్జ వేణు, మంద అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆస్పత్రులపైన విశ్వాసం పెరిగేలా మెరుగైన సేవలను అందించండి



మంత్రి దామోదర రాజనర్సింహ

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజల్లో ప్రభుత్వ ఆసుపత్రులపైన నమ్మకం, విశ్వాసం పెరిగేలా మరింత మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ ఆసుపత్రులను బ్రాండింగ్ చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ వైద్య, ఆరోగ్య శాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. హైదరాబాద్‌లోని రాజీవ్ ఆరోగ్య శ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ కార్యాలయంలో మంత్రి దామోదర్ రాజనర్సింహ అధ్యక్షతన మంగళవారం ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ఆసుపత్రుల బ్రాండింగ్‌పై ఆ శాఖ కార్యదర్శి డాక్టర్ జడ్ చోంగ్తూ 'పవర్ పాయింట్' ద్వారా పలు అంశాలను వివరించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదార రాజనర్సింహ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్య సేవల బలోపేతానికి నిర్దిష్టమైన విధానాలను రూపొందించి, వాటిని అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో టిజిఎంఎస్ఐడిసి ఎండి ఫణీంద్ర రెడ్డి, డిఎంఇ డాక్టర్ నరేంద్ర కుమార్, టివివిపి కమిషనర్ డాక్టర్ అజయ్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ డిఎంఇ డాక్టర్ విమల థామస్, టిజిఎంఎస్ఐడిసి సిఇ దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ సిబ్బందికి నిధుల విడుదల



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం నాలుగు నెలలకు సంబంధించిన వేతనాలను విడుదల చేసింది. ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఎపిఒలతో సహ మొత్తం 3200 మందికి పైగా సిబ్బందికి రూ.62 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నిధులు కూడా ఇప్పటికే పలువురు ఖతాల్లో జమ అయినట్టు అధికారులు తెలిపారు. మహాత్మా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగుల జీతాలు విడుదల చేసినందుకు తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ సంఘాల నాయకులు మ్యదరి మోహన్‌రావు, ఎలబద్ది లింగయ్య ప్రతినిధుల బృందం మంత్రి సీతక్కను కలిసి ధన్యవాదాలు తెలిపారు. గత నాలుగు నెలల నుండి 12,500 మంది ఉద్యోగులకు జీతలు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తాము మంత్రి దృష్టికి తీసుకెళ్లగా వెంటనే స్పందించారని వారు పేర్కొన్నారు. నిధులు విడుదల చేసినందుకు డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్కకు ధన్యవాదాలు తెలిపారు. పే స్కేల్‌ను కూడా ఇప్పించాలని వారు కోరారు. గతంలో ఎప్పుడు లేని విధంగా రాష్ట్ర బడ్జెట్ నుంచి రూ.144 కోట్లను విడుదల చేశారన్నారు.

## 20న సమ్మెలో మహిళా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలి

### పి.ప్రేమ్‌పావని, కరుణ కుమారి పిలుపు

**ప్రజాపక్షం/ హైదరాబాద్:** ఈ నెల 20న జరగనున్న జాతీయ కార్మిక సార్వత్రిక సమ్మెలో ప్రభుత్వ స్కీమ్‌లలో పని చేస్తున్న మహిళా కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ శ్రామిక మహిళా ఫోరం (ఎఐటియుసి) అధ్యక్షురాలు పి.ప్రేమ్‌పావని, కన్వీనర్లు నందూరి కరుణ కుమారి, సిహెచ్.సీతామహాలక్ష్మి, డి.కమలారెడ్డి కోరారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 చట్టాలలో 29 చట్టాలను 4 కోడ్‌లుగా రూపొందించి కార్మిక హక్కులను హరించేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం చేస్తున్న కుట్రను వ్యతిరేకిస్తూ, తక్షణం 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, 29 కార్మిక చట్టాలను పునరుద్దరించాలని డిమాండ్ చేస్తూ దేశంలో కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర సంఘాలు, అసోసియేషన్లు ఈనెల 20వ తేదీన సమ్మెకు పిలుపునిచ్చాయని తెలిపారు. అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన, కస్తుర్భా బాలికల విద్యాలయం, సర్వశిక్షాభియాన్, గ్రామీణ ఉపాధి హామీ తదితర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పనిచేస్తున్న లక్షలాది మంది మహిళా కార్మికులు తక్కువ వేతనాలతో ఎక్కువ పనిచేస్తూ శ్రమ దోపిడీకి గురవుతున్నారన్నారు. తమ శ్రమను వెచ్చిస్తూ ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధంగా పనిచేస్తున్న వీరికి కనీస వేతనాలు, గ్రాట్యుటీ, సామాజిక భద్రతా చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వం వీరి చట్ట భద్రతను హరించే విధంగా చేపట్టిన ఈ కార్మిక వ్యతిరేక విధానాలను ముక్తకంఠంతో శ్రామిక మహిళలంతా నిరసిస్తూ 20వ తేదీన జరిగే సమ్మెలో వేలాదిగా పాల్గొని సమ్మెను జయప్రదం చేయడం ప్రభుత్వానికి ఒక హెచ్చరిక కావాలన్నారు.

# 'ఈ కుబేర్' పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'ఈకుబేర్' పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, పెండింగ్ డిఎలను విడుదల చేయాలని ఎస్‌టియు టిఎస్ అధ్యక్షులు,ప్రధాన కార్యదర్శి పర్వత్ రెడ్డి, సదానందం గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు కూడా ప్రభుత్వంలో భాగామేనని, వారి సమస్యలు తీర్చాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదన్నారు. ఆర్థిక, సంక్షేమ సంబంధిత సమస్యల పరిష్కారానికి జిల్లా కేంద్రాల్లో సదస్సులను నిర్వహించామని, ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలను సమర్పించామని, నిరసన కార్యక్రమాలు చేపట్టినా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడంతోనే 'రాష్ట్ర స్థాయి ఉద్యోగ సదస్సు' విజయవంతంగా నిర్వహించామని వారు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సంక్షేమ పథకాల అమలుకు తాము వ్యతిరేకం కాదని, తాము వాటిలో భాగస్వాములమేనని గుర్తు చేశారు. ఉద్యోగ వర్గాల హక్కుల పరిరక్షణ కోసం చట్టబద్ధంగా మాట్లాడే హక్కు తమకు ఉన్నదన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలపై గతంలో అనేక మార్లు ప్రభుత్వానికి విజ్ఞాపన పత్రాలు సమర్పించిన విషయాన్ని వారు గుర్తుచేశారు. పాఠశాల విద్యలో కొంత మేరకు సమస్యలను పరిష్కరించడం హర్షణీయమని, ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, నూతన ఉపాధ్యాయ నియామకాలు చేపట్టిన ప్రభుత్వం,పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, ఉచిత విద్యుత్ పంపిణీ వంటి చర్యలతో పాఠశాల విద్యాభివృద్ధికి చేసిన కృషికి ఉపాధ్యాయుల తరపున వారు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, పిఆర్‌సి నివేదికను రూపొందించి 51 శాతం ఫిట్‌మెంట్‌ను అమలు చేయాలని, ఉద్యోగ ఆరోగ్య పథకాన్ని (ఇహెచ్‌ఎస్) సమర్థవంతంగా అమలు చేయాలని వారు కోరారు. సమస్యల పరిష్కారానికి చర్చల ప్రక్రియ ప్రారంభించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని, మానవీయ కోణంలో న్యాయబద్ధతతో కూడిన నిర్ణయాలను తీసుకుని, ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లలో విశ్వాసాన్ని కల్పించాలని పర్వత్ రెడ్డి, సదానందం గౌడ్ ముఖ్యమంత్రి, మంత్రివర్గాన్ని, ఉన్నతాధికారులను వారు కోరారు.

# కాళేశ్వరం సరస్వతీ పుష్కరాలకు పటిష్ఠ ఏర్పాట్లు చేయండి

### సమీక్షా సమావేశంలో అధికార యంత్రాంగానికి మంత్రులు కొండా సురేఖ, శ్రీధర్‌బాబు ఆదేశాలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రవహించే 'అంతర్వాహిని' సరస్వతీ నదీ పుష్కరాలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా అధికార యంత్రాంగానికి రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఐటి, పరిశ్రమలు, చేనేత శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆదేశించారు. కాళేశ్వరం సరస్వతీ పుష్కరాల సమీక్షా సమావేశం రాష్ట్ర సచివాలయంలో మంగళవారం మంత్రి సురేఖ అధ్యక్షతన జరిగింది. ఈ నెల 14న రాత్రి నుంచి ప్రారంభం కానున్న అత్యంత పవిత్రమైన ఈ త్రివేణి సంగమ స్నానానికి లక్షలాది భక్తులు రాష్ట్రం నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి కూడా వస్తారని అప్పటికే ఏర్పాట్లన్నీ పూర్తి కావాలని చెప్పారు. ఈ పుష్కరాల కోసం ప్రభుత్వం చేపట్టిన ఏర్పాట్ల వివరాలు భక్తులకు సమగ్రంగా తెలిపేందుకు కాళేశ్వరం సరస్వతి పుష్కరాల వెబ్ పోర్టల్, మొబైల్ యాప్‌ను రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మంత్రి శ్రీధర్‌బాబు ఇటీవల ప్రారంభించారు. కొన్ని చిన్న చిన్న పనులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి కూడా పుష్కరాలు ప్రారంభమయ్యేలోగా పూర్తవుతాయని మంత్రులకు అధికారులు నివేదించారు. కాళేశ్వరంకు సంబంధించిన వివరాలన్నీ ఆయా వెబ్ సైట్, యాప్ ద్వారా తెలియజేయాలన్నారు. ఆర్‌టిసి బస్సులను అవసరానికి అనుగుణంగా నడపాలని ఆర్‌టిసి అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చాక అమలు చేసిన ఉచిత బస్సు పథకం ద్వారా దేవాదాయ శాఖకు లాభం చేకూరినట్టు మంత్రి కొండా తెలిపారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని మంత్రి సురేఖ తెలిపారు. సరస్వతి పుష్కరాల సందర్భంగా ప్రతి రోజు ఒక పీఠాధిపతి ఈ పుష్కర స్నానం చేయనున్నట్టు మంత్రి కొండా చెప్పారు. పుష్కర ప్రారంభం మే 15, 16వ తేదీన శ్రీ గురుమదనానంద సరస్వతి పీఠం, రంగంపేట, మెదక్ నుంచి మాధవానంద సరస్వతి స్వామిలు పాల్గొని సరస్వతి పుష్కరాలను ప్రారంభిస్తారన్నారు. ఈ సమావేశంలో సిఎస్ రామకృష్ణరావు, డిజిపి జితేందర్, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, ఆర్అండ్‌బి ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్‌రాజ్, సెర్ఫ్ సిఈఓ దివ్యా దేవరాజన్, దేవాదాయ కమిషనర్ వెంకటరావు, అడిషనల్ కమిషనర్ కృష్ణవేణి, భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పాల్గొన్నారు.

## 9న జర్నలిస్టుల కుటుంబాలకు ఆర్థికసాయం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు, అనారోగ్యం, ప్రమాదాల బారినపడి పని చేయలేక నిస్సహాయ స్థితిలో ఉన్న జర్నలిస్టులకు ఆర్థిక సహాయానికి సంబంధించిన చెక్కులను ఈ నెల 9 మీడియా అకాడమీ ఆడిటోరియంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అందచేస్తారు. ఇటీవల మరణించిన 38 మంది జర్నలిస్టుల కుటుంబాలకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల ఆర్థిక సాయంతో పాటు ఐదు సంవత్సరాల వరకు, ప్రతి కుటుంబానికి నెలకు రూ.3 వేల పెన్షన్, ఎల్‌కెజి నుండి పదవ తరగతి వరకు చదివే ఇద్దరు పిల్లలకు నెలకు రూ.2000 ట్యూషన్ ఫీజు జర్నలిస్టుల సంక్షేమ నిధి నుండి మంజూరు చేసినట్లు తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాణాంతక వ్యాధులతో బాధపడుతున్న, ప్రమాదానికి గురై భృతిని కోల్పోయిన జర్నలిస్టులు, ఇతర వ్యాధులకు గురైన వారికి లక్ష రూపాయల చొప్పున మొత్తం ఎనిమిది మందికి ఆర్థిక సాయం మంజూరు చేశామని చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. ఈ సందర్భంగా మీడియా అకాడమీ వెబ్‌సైట్ https://media academy.telangana. gov.inను, జర్నలిస్ట్‌ల పునశ్చరణ తరగతుల నిర్వహణకు అకాడమీ ప్రచురించిన వివిధ అంశాలతో కూడిన చిరు పుస్తకాలను మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆవిష్కరిస్తారని శ్రీనివాస్‌రెడ్డి తెలియజేశారు.

# మత విద్వేషాలను రెచ్చగొట్టే మతోన్మాదులను ప్రతిఘటించండి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మత విద్వేషాలు రెచ్చగొడుతున్న మతోన్మాదుల దౌర్జన్యాలను యువతరం ప్రతిఘటించాలని, డాక్టర్ అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ రక్షణ ఉద్యమాలు చేపట్టాలని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ అన్నారు. డిహెచ్‌పిఎస్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం అధ్యక్షులు కె.ఏసురత్నం అధ్యక్షతన మంగళవారం హైదరాబాద్‌లోని రాజ్‌బహదూర్‌గౌర్ హాల్‌లో జరిగింది. సమావేశంలో అనిల్ కుమార్ మాట్లాడుతూ పూలే అంబేద్కర్‌లు తుది శ్వాస వరకు మనువాదానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష ప్రతిఘటన ఉద్యమాలు నిర్మించారని, వారే ఆధునిక భారతావని నిర్మాతలని, వారు చూపిన మార్గంలో నేటితరం మనువాదంపై మహోద్యమమం చేపట్టాలన్నారు. బి.ఆర్.అంబేద్కర్‌ను కేవలం భారత రాజ్యాంగ నిర్మాతగా మాత్రమే కొలుస్తూ ఆయన అధ్యయన లోతులను విస్మరిస్తున్నారన్నారు.

**కార్మిక సంఘాల సమ్మెకు డిహెచ్‌పిఎస్ మద్దతు**

ఈ నెల 20న జరిగే దేశవ్యాప్త కార్మిక సంఘాల సమ్మెకు డిహెచ్‌పిఎస్ సంపూర్ణ మద్దతును తెలియజేస్తూ కార్మిక పిలుపులో భాగస్వామ్యం కావాలని సమాఏవశం తీర్మానించింది. ఆపరేషన్ కగార్‌ను తక్షణమే నిలిపివేసి మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని సమావేశంలో తీర్మానించింది. జూన్ చివరి వారంలో డిహెచ్‌పిఎస్ రాష్ట్ర రెండవ మహాసభలు వరంగల్‌లో నిర్వహించాలని సమావేశాల్లో నిర్ణయించింది. ఈ నెల 12న రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు, డబల్ బెడ్ రూమ్, రాజీవ్ యువ వికాసం పథకంలో లోపాలపై రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహించాలని పిలుపునిచ్చింది. ఈ సమావేశంలో అఖిలభారత దళిత హక్కుల పోరాట సమితి సభ్యులు బోయిని అశోక్, పొన్నగంటి లావణ్య, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**
ఇఇ, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.

NIT No.03/EE-Div.29/SBZ/GHMC/2025-26 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ నోటీసు తేది: 05.05.2025

**పని పేరు:** జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్, డివిజన్-29లో (1) జోనల్ కార్యాలయ భవనం వద్ద సిస్టమ్స్, ప్రింటర్ల వార్షిక నిర్వహణ మరియు క్యాట్రిడ్జ్‌ల సరఫరా. (2) జోనల్ కమిషనర్ కార్యాలయ భవనం వద్ద క్రెచ్ కోసం సౌకర్యాలు కల్పించడం. (3) జోనల్ కార్యాలయ భవనం వద్ద ప్రింటర్, టేబుల్, కుర్చీ, ర్యాక్స్‌ల సరఫరా. **అంచనా విలువ / ఇసివి:** రూ.19.88లక్షలు, **బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం:** 07.05.2025న సా.4.00గం.ల నుండి, 13.05.2025న మ.2.00గం.ల వరకు. **అధికారి పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-19, జిహెచ్‌ఎంసి, సికింద్రాబాద్. సెల్ నెం. 7995468066. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా https://www.tender.eprocurement.gov.inలో చూడవచ్చు.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్-29, సికింద్రాబాద్, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 1387-PP/CL/ADVT/1/2025-26, Date: 06-05-2025

**మణికొండ మున్సిపాలిటీ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా.**

No: E1/SSBM/490/2025-26, ఆసక్తి వ్యక్తీకరణ (EOI) తేది: 06.05.2025

కమిషనర్, మణికొండ మున్సిపాలిటీ క్రింద అంశాలు / పనుల కోసం కొటేషన్ అభ్యర్థనను ఆహ్వానించడమైనది: **1.** మణికొండ మునిసిపాలిటీలో రోటరీలు / మీడియన్లు మొదలైన వాటిలో ఆర్కిటెక్చరల్ / మ్యూజికల్ / ఇల్యూమినేటెడ్ వాటర్ ఫౌంటెన్లు / విగ్రహాలు మొదలైన వాటి సరఫరా, డెలివరీ మరియు సంస్థాపన. **2.** మణికొండ మున్సిపాలిటీలోని పార్కుల కోసం పిల్లలకు అనుకూలమైన / పెంపుడు జంతువులకు అనుకూలమైన / సీనియర్ సిటిజన్ ఫ్రెండ్లీ వాకింగ్ ట్రాక్లు / అడ్వెంచర్ ట్రాక్లు / ప్లే ట్రాక్ల సరఫరా, డెలివరీ మరియు సంస్థాపన. **3.** మణికొండ మునిసిపాలిటీలో సూక్ష్మ ట్రాఫిక్ అవగాహన / భద్రత అవగాహన / విద్యకు సంబంధించిన వస్తువుల సరఫరా, డెలివరీ మరియు సంస్థాపన. ఆసక్తిగల సంస్థ / ఏజెన్సీలు / సంస్థలు / కాంట్రాక్టర్లు / వారి ఆసక్తి వ్యక్తీకరణను పంపమని అభ్యర్థించడమైనది. **EOI సమర్పించడానికి చివరి తేదీ:** 17.05.2025న ఉ.11.00 గం.ల వరకు. మరిన్ని వివరాలు మరియు వివరణాత్మక స్పెసిఫికేషన్ల కోసం కార్యాలయ వేళల్లో మున్సిపల్ కమిషనర్ / మున్సిపల్ ఇంజనీర్ (8008040891)ని సంప్రదించవచ్చు.

సం/- కమిషనర్ మణికొండ మున్సిపాలిటీ

DIPR R.O. No. : 1410-PP/CL/ADVT/1/2025-26, Date: 06-05-2025

**మున్సిపల్ కౌన్సిల్ :: భూపాలపల్లి**

No: E1/CT. No:01/MCBHPL/e-procurement/2024, షార్ట్ టెండర్ నోటీసు తేది: 06.05.2025

కమిషనర్ సూచనల మేరకు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ కింద ఆన్‌లైన్ టెండర్ వ్యవస్థ ద్వారా వివిధ పనులకు టెండర్ పిలవాలని ప్రతిపాదించడమైనది.

వివిధ గ్రాంట్స్ క్రింద వివిధ పనులు:

**బిడ్స్‌ఆన్‌లైన్ దాఖలుకు ఆఖరి తేది / సమయం:** 16.05.2025న సా.4.00గం.ల వరకు, **బిడ్స్ ప్రారంభ తేది:** 16.05.2025న సా.5.00గం.ల నుండి, **సంప్రదించవలసిన కమిషనర్ పేరు మరియు చిరునామా:** శ్రీ బి.శ్రీనివాస్, కమిషనర్, మున్సిపల్ కౌన్సిల్, భూపాలపల్లి. ఫోన్ నెం. 8978180029. మరిన్ని వివరాల కొరకు 'ఇ' ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు. 08.05.2025న సా.05.00గం.ల నుండి, I&PR, విభాగం ద్వారా పనిని డౌన్‌లోడ్ చేసుకోవడం ప్రారంభమవుతుంది.

సం/- మున్సిపల్ కమిషనర్, భూపాలపల్లి.

DIPR R.O. No. : 1424-PP/CL/ADVT/1/2025-26, Date: 06-05-2025

**తెలంగాణ ప్రభుత్వము**
**రెవెన్యూ (భూసేకరణ) శాఖ**
**సూర్యాపేట జిల్లా**
**ఫారం - 6**
**(ప్రాథమిక ప్రకటన)**

(కేంద్ర చట్టము 30/2013 యొక్క సెక్షన్ 11(1) రూల్ 19 (1) ననుసరించి కలెక్టర్ / అదనపు కలెక్టర్ / రాజస్వ మండలాధికారి హుజూర్‌నగర్

జిల్లా కలెక్టర్ సూర్యాపేట ఫైల్ నం. జి/372/2025 తేది: 25.04.2025
రెవెన్యూ డివిజినల్ అధికారి ఫైల్ నం. ఇ/211/2025 తేది: 20.03.2025
కోదాడ
గెజిట్ నెంబర్: 06/2025 తేది: 25.04.2025

తెలంగాణ ప్రభుత్వం /జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారు రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ & సి.ఏ డిఇరిగేషన్ డివిజన్ నెం.4, కోదాడ గారు కోదాడ మండలం చిమిర్యాల గ్రామములో ఇచ్చిన రిక్విజేషన్ లెటర్ నెం ఇ.ఇ /ఐ యస్ డి 4 కోదాడ / డి బి 46/25-2024/(టి) ఈఈఏ/యం తేది 17.20.2025: ప్రకారం ఈ దిగువ షెడ్యూల్ లో నిర్దిష్ట పరచిన సూర్యాపేట జిల్లా, కోదాడ మండలం, చిమిర్యాల గ్రామ శివారు లోని సర్వే నెంబర్ 361, 362, 367, 368 & 374 లలో విస్తీర్ణం **ఏ.గుంటలు 3.3950** పట్టా భూములు ప్రజా ప్రయోజన నిమిత్తము అనగా కోదాడ మండలము చిమిర్యాల గ్రామము నందు పాలేరు నదినుండి రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయుట లో బాగముగా అవసరమైనదని భావించినందున, భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పన లో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం 2013లోని సెక్షన్ (1)11అనుసరించి భూసేకరణ నిమిత్తము ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

ఇట్టి భూసేకరణ భూములకు భూసేకరణ పునరుపాధి పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం) 2013 తెలంగాణా సవరణ చట్టం 2016 చట్టం 21ఆఫ్ ( 2017 ననుసరించి సదరు చూసేకరణ చట్టం 2013/30(చాప్టర్ 2) లోని సామాజిక ప్రభావం అధ్యయన నివేదిక మరియు చాప్టర్ 3 ప్రకారం సెక్షన్ 10-A ఆహారభద్రత పరిరక్షణ మినహాయింపు ఇవ్వనైనది.

కావున సూర్యాపేట జిల్లా, కోదాడ మండలం చిమిర్యాల గ్రామ రెవెన్యూ పరిధిలో ఉన్న సర్వే నెంబర్ 361, 362, 367, 368 & 374 లలో విస్తీర్ణం **ఏ.గుంటలు** గల భూమి **3.3950** రెడ్లకుంట లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటుకు అవసరమైనదని ఈ క్రింద చూపిన విధముగా భూ సేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీ చేయనైనది.

గ్రామం: చిమిర్యాల మండలం : కోదాడ జిల్లా: సూర్యాపేట

| క్రమ సంఖ్య | సర్వే నెంబర్ | భూమి స్వభావము | భూమి రకము | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణం | పట్టాదారు పేరు / ఆసక్తిగల వ్యక్తుల పేరు / చిరునామా | అనుభవదారు | సరిహద్దులు తూర్పు | పడమర | ఉత్తరం | దక్షిణం | చెట్లు / నిర్మాణములు |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | | | | 9 |
| 1 | 361 | పట్టా | ఖుష్కి | 0.1650 | కునుగుంట్ల రామ రావు తం. వెంకయ్య నల్లూరి దామోదర్ రావు తం. వీరయ్య | కునుగుంట్ల రామ రావు తం. వెంకయ్య (0.14) నల్లూరి దామోదర్ రావు తం.వీరయ్య(0.250) | 361 | 371 | 362 | 374 | 10 వేప చెట్లు 6 కొబ్బరి మొక్కలు |
| 2 | 362 | పట్టా | ఖుష్కి | 0.36 | చిగురుపాటి నరసింహ రావు, తం.నాగయ్య | చిగురుపాటి నరసింహ రావు తం.నాగయ్య(0.36) | 362 | 368 | 362 | 361 | |
| 3 | 367 | పట్టా | ఖుష్కి | 1.13 | మల్లెల అది నారాయణ తం. వెంకయ్య | వెల్ది నరేష్ తం. రవీంద్ర బాబు (0.05) వెల్ది నరేష్ తం.రవీంద్ర బాబు (0.14) మల్లెల అది నారాయణ తం.వెంకయ్య (0.34) | 367 | 368 | 367 | 362 | |
| 4 | 368 | పట్టా | ఖుష్కి | 1.07 | చిగురుపాటి సుబ్బ రావు తం.దశరథ రామయ్య చిగురుపాటి నారాయణ తం.దశరథ రామయ్య వెల్ది నరేష్ తం. రవీంద్ర బాబు వెల్ది నరేష్ తం.రవీంద్ర బాబు | చిగురుపాటి సుబ్బ రావు తం. దశరథ రామయ్య(0.22) చిగురుపాటి నారాయణ తం. దశరథ రామయ్య వెల్ది నరేష్ తం. రవీంద్ర బాబు (0.01) వెల్ది నరేష్ తం రవీంద్ర బాబు .(0.24) | 367 | 368 | 368 | 371 | |
| 5 | 374 | పట్టా | ఖుష్కి | 0.07 | పసుల ప్రదీప్ తం. శివ ప్రసాద్ | పసుల శివ ప్రసాద్ .తం నారాయణ (0.04) MPL కంపెనీ ప్రొ. వినోద్ కుమార్ అగర్వాల్ తం.మోహన్ లాల్ అగర్వాల్ (0.03) | 374 | 374 | 361 | 374 | |
| మొత్తం : 3.3950 | | | | | | | | | | | |

ఇట్టి ప్రకటన భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం ) 2013నెం2013/30.) లోని నియమం లోని సెక్షన్ (1)11 ప్రకారం సంబంధిత భూ యజమానులకు సరియైన భూనష్ట పరిహారం చెల్లించుటకు గాను నోటిఫికేషన్ జారీ చేయనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు భూసేకరణ అధికారి మరియు రాజస్వ మండల అధికారి, కోదాడ గారి కార్యాలయంలో ఉంచనైనది సంబంధిత వ్యక్తులు ఏదైనా పనిదినములలో కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకొనవచ్చును. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వము /జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు రాజస్వ మండల అధికారి, కోదాడ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబంధించి సెక్షన్ 12 ప్రకారము పై తెలిపిన భూములలో ఏదైనా ప్రదేశంలోకి ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టడానికి అనుమతించనైనది.

సెక్షన్ (4) 11 ప్రకారం భూ సేకరణకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, సూర్యాపేట గారి అనుమతి లేకుండా ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబంధించి ఎటువంటి కొనుగోలు, అమ్మకము, తనఖా మొదలగు చర్యలు చేపట్టరాదు.

భూ సేకరణ విషయంలో సంబంధించిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల చట్టంలోని 15 విభాగం ప్రకారం జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు రాజస్వ మండల అధికారి, కోదాడ గార్లకు లిఖిత పూర్వకముగా తెలియజేయవలసి యున్నది. ఇట్టి ప్రకటన జారీ చేసిన (60) దినముల లోపల ఏమైన అభ్యంతరములున్న యెడల వారి అభ్యంతరములు జిల్లా కలెక్టర్, సూర్యాపేట మరియు రాజస్వ మండల అధికారి, కోదాడ గార్లకు లిఖిత పూర్వకంగా తెలియజేయవలసియున్నది.

సం/- భూసేకరణ అధికారి & రెవెన్యూ డివిజనల్ అధికారి కోదాడ | సం/- అదనపు కలెక్టర్ సూర్యాపేట | సం/- జిల్లా కలెక్టర్, సూర్యాపేట

DIPR RO NO. 65/LA/PP/Advt/Pub/2025-26

ప్రజాపక్షం
బుధవారం, మే 07

# వేడెక్కిన బిహార్ ఎన్నికల క్షేత్రం

బిహార్ అసెంబ్లీ ఎన్నికలకు కనీసం ఆరు మాసాల వ్యవధి ఉంది. అయినా ప్రధాన ప్రత్యర్థులు – బిజెపి, జెడియు, లోక్‌జనశక్తి (పాశ్వాన్)లతో కూడిన ఎన్‌డిఎ, ఆరు ప్రతిపక్షపార్టీలతో కూడిన మహాగట్బంధన్(ఇండియా కూటమి) అప్పుడే ఎన్నికల క్షేత్రాన్ని వేడెక్కిస్తున్నారు. హిందీ రాష్ట్రాల్లో ఇప్పటివరకు తమ సంపూర్ణ అధికారం కిందకురాని బిహార్‌లో అధికారం చేజిక్కించుకోవటం బిజెపి ధ్యేయం. కాగా పచ్చి అవకాశవాది, అధికార వ్యామోహి నితీశ్‌కుమార్ నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వాన్ని ప్రతిపక్షంలో కూర్చోబెట్టటం ఇండియా కూటమి లక్ష్యం. బూత్‌స్థాయిలో స్వయం సేవక్‌లను నియమించి, ప్రతి ఒక్క హిందూత్వవాది ఓటరునూ కలుసుకుని నచ్చజెప్పి పోలింగ్ కేంద్రానికి తీసుకువచ్చే ఆర్‌ఎస్‌ఎస్ వ్యూహం హర్యానాలో, మహారాష్ట్రలో విజయవంతమైనందున అదే వ్యూహాన్ని బిహార్‌లో అమలు జరిపే పనిలో ఉంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇప్పటికే నాలుగుసార్లు బిహార్‌లో పర్యటించటాన్నిబట్టి బిహార్ ఎన్నికలకు ఆయన ఇస్తున్న ప్రాధాన్యతను అర్థం చేసుకోవచ్చు. టెర్రరిస్టు దాడి జరిగిన పహల్గాంకు ఆయన వెళ్లలేదు. ఢిల్లీలో తాను పిలిచిన అఖిలపక్ష సమావేశానికి హాజరు కాలేదు. అదే రోజున బిహార్‌లో ఎన్నికల ప్రచార సభలో పాల్గొని టెర్రరిస్టులను భూగోళం అంచువరకు తరుముతామని హెచ్చరిక చేశారు. ఎన్నికల వైతరిణి నది దాటేందుకు ప్రజల సానుభూతి పొందేందుకు ఇదే రాచబాట అని ఆయన భావించి ఉండవచ్చు. ఖేల్ ఇండియా యువజన క్రీడల ప్రారంభోత్సవానికి మే 4న ఆయన బిహార్ రావలసి ఉంది. అయితే విమర్శల దృష్ట్యా ఢిల్లీనుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. బిహార్‌ను గెలుచుకునే వ్యూహంగా ఆర్‌ఎస్‌ఎస్ ఛీఫ్ మోహన్ భాగవత్ సలహాపై ప్రధాని మోదీ జనగణనలో భాగంగా కులగణన చేబడతామని ప్రకటించారు. ఆర్‌ఎస్‌ఎస్ చాలాకాలంగా ఒబిసి ఆదివాసీలు, దళితుల్లో పనిచేస్తున్నది. కాంగ్రెస్ ప్రభావం నుంచి వారిని తమ పలుకుబడి కిందకు తెచ్చుకోవటానికి కులగణన అస్త్రాన్ని ప్రయోగింపజేసింది. కులగణనను విభజనవాదంగా ఖండిస్తూ వచ్చిన నరేంద్రమోదీ, ఒకవైపు దేశం యుద్ధ సన్నద్ధతలో ఉండగా కులగణనను చేబడతామని ప్రకటించటంలోని అంతరార్థమేమిటో అధికారికంగా స్పష్టత ఇవ్వలేదు. గణన ప్రారంభం–పూర్తికి కాలనిర్ణయం లేదు. అసలు సెన్సెస్‌పై నిరవధికంగా అనిశ్చితి కొనసాగుతున్నప్పుడు కులగణనను సత్వరం పూర్తిచేసేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధి ప్రశ్నించబడుతున్నది. కులగణన లక్ష్యాలనూ ప్రభుత్వం వెల్లడించకపోవ టం అనేక సందేహాలకు తావిస్తున్నది. ఇది ఎన్నికల పాచిక కావచ్చునని బిహార్ ప్రతిపక్ష పార్టీల్లో అనుమానాలున్నాయి.

ఈ కదలికలు, వ్యూహాలు మహాగట్బంధన్‌ను అప్రమత్తం చేశాయి. సమన్వయ కమిటీ ఏర్పాటు చేసుకున్నాయి. మాజీ ఉపముఖ్యమంత్రి, ఆర్‌జెడి నేత యశస్వియాదవ్‌ను సమన్వయ కర్తగా నియమించాయి. అతనే కూటమి ముఖ్యమంత్రి ఫేస్ అయినప్పటికీ సరైన సమయంలో ప్రకటించాలని నిర్ణయించాయి. ఆదివారం జరిగిన సమన్వయ కమిటీ మూడవ సమావేశం, ఎన్‌డిఎ వ్యాప్తి చేస్తున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, తమ కూటమి ఐక్యంగా మొత్తం 243 సీట్లకు పోటీ చేస్తుందని, క్షేత్రస్థాయిలో కమిటీలను ఏర్పాటు చేస్తామని ప్రకటించింది. ఈ సమావేశానికి తేజస్వీ యాదవ్, బిహార్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజేశ్‌కుమార్, ఎఐసిసి ఇన్‌ఛార్జి కృష్ణ ఆళ్లవారు, సిపిఐ(ఎంఎల్) ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రాంనరేశ్ పాండే, సిపిఐ(ఎం) ప్రతినిధి, విఐపి అధ్యక్షుడు ముకేశ్ సహానీ హాజరైనారు. ఆరు పార్టీల జిల్లా అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు కూడా హాజరైనారు. ఈ సమావేశం ప్రయోజనం, ప్రకటన స్పష్టం: ''మహాగట్బంధన్ ఐక్యంగా ఉంది. ఎన్‌డిఎ వ్యాప్తి చేస్తున్న వదంతులు నమ్మకండి. ప్రతిస్థాయిలో ఉపసంఘాలు ఏర్పాటు చేస్తాం. జిల్లా నుంచి పంచాయతీవరకు సమష్టిగా ప్రచారం చేస్తాం. నితీశ్ ఊసరవెల్లి రాజకీయాలను, మహాగట్బంధన్ 17 మాసాల పాలనలో ప్రజలకు చేసిన మేళ్లను ప్రజలకు వివరిస్తాం. ప్రజల ఆశీస్సులు కోరతాం. బిజెపి, ఎన్‌డిఎలను ఓడిస్తాం.''

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కార్మిక, ఉద్యోగ సంఘాలు మే 20న పిలుపు ఇచ్చిన దేశవ్యాప్త బంద్/సమ్మె సందర్భంలో ఇండియా కూటమి ఐక్యతను ప్రజలు చూస్తారని ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝా చెప్పారు. మహాగట్బంధన్ పార్టీలు సామరస్యంగా సీట్లు సర్దుబాటు చేసుకోవటం, ఆర్‌జెడి పెద్దన్న పాత్ర వహించకుండా నిజమైన సమన్వయకర్తగా వ్యవహరించటంపై దాని విజయం ఆధారపడి ఉంటుంది.

# నిజాయితీకి నిలువెత్తు రూపం.. దామోదరం సంజీవయ్య

దామోదరం సంజీవయ్య (ఫిబ్రవరి 14, 1921 – మే 7, 1972) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఒక అమూల్యమైన నక్షత్రం. దేశంలోనే తొలి దళిత ముఖ్యమంత్రిగా, నిజాయితీ, నిరాడంబరత్వం, మరియు విలువలకు నిలువెత్తు రూపంగా నిలిచిన వ్యక్తి. తన స్వల్పకాల పాలనలోనూ అనేక విప్లవాత్మక సంస్కరణలతో ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయాడు.



ఆయన జీవితం ఒక స్ఫూర్తిదాయక గాథ, ఆదర్శనీయమైన ప్రస్థానం. కర్నూలు జిల్లా కల్లూరు మండలంలోని పెద్దపాడు గ్రామంలో 1921, ఫిబ్రవరి 14న మాలదాసు కుటుంబంలో జన్మించిన సంజీవయ్య, చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయారు. ఆర్థిక ఇబ్బందులతో కూడిన జీవితంలోనూ విద్యపై ఆసక్తి చూపి, స్థానిక మున్సిపల్ స్కూల్‌లో ప్రాథమిక విద్యను పూర్తి చేశారు. తర్వాత మద్రాసు లా కాలేజీలో చట్ట శాస్త్రంలో బ్యాచిలర్ డిగ్రీ పొందారు. విద్యార్థిగా ఉండగానే భారత స్వాతంత్ర్య ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నారు, ఇది ఆయనలో సామాజిక న్యాయం పట్ల బలమైన నిబద్ధతను నాటింది.

**రాజకీయ ప్రస్థానం**

సంజీవయ్య రాజకీయ జీవితం సామాజిక సమానత్వం, పేదల ఉద్ధరణ కోసం అంకితమైంది. సంయుక్త మద్రాసు రాష్ట్రంలో టంగుటూరి ప్రకాశం పంతులు మంత్రివర్గంలో ఆరోగ్య శాఖ మంత్రిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. 1956 నుండి 1960 వరకు నీలం సంజీవరెడ్డి మంత్రివర్గంలో కార్మిక, స్థానిక స్వయంపరిపాలన శాఖ మంత్రిగా పనిచేశారు. 1960 జనవరి 11 నుండి 1962 మార్చి 29 వరకు ఆంధ్రప్రదేశ్ రెండవ ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహించారు.

సంజీవయ్య ముఖ్యమంత్రిగా నియమితులైనప్పుడు కేవలం 38సంవత్సరాల వయస్సు, ఇది ఆయన రాజకీయ ప్రతిభకు నిదర్శనం. అయితే, ఆయన అధికారంలోకి శాసనసభలో అధిక సంఖ్యాకుల బలంతో కాకుండా రాజీ అభ్యర్థిగా కాంగ్రెస్ అధిష్ఠానవర్గంచే నియమితులయ్యారు, ఇది ఆయన రాజకీయ జీవితంలో సవాళ్లను తెచ్చిపెట్టింది. కుల, ముఠా రాజకీయాల మధ్య సతమతమైనప్పటికీ, ఆయన తన నిజాయితీ, ప్రజాకల్యాణ దృష్టితో ప్రజల గౌరవాన్ని చూరగొన్నారు. సంజీవయ్య పాలనలో భూమిలేని నిరుపేదలకు 6 లక్షల ఎకరాల బంజరు భూములను పంపిణీ చేశారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతిని అరికట్టడానికి అవినీతి నిరోధక శాఖను ఏర్పాటు చేశారు, ఇది ఆయన నిజాయితీకి నిదర్శనం. ప్రభుత్వంలో తెలుగు భాష వాడకాన్ని పెంచి, పరిపాలనను ప్రజలకు సమీపం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక అభివృద్ధికి ప్రాధాన్యత ఇచ్చి, ఆర్థిక స్థిరత్వానికి బాటలు వేశారు. ఈ సంస్కరణలు సంజీవయ్యను ఒక దూరదృష్టి గల నాయకుడిగా నిలబెట్టాయి.

**కేంద్ర స్థాయిలో సేవలు**

ముఖ్యమంత్రి పదవి నుండి దిగిపోయిన తర్వాత, సంజీవయ్య కేంద్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషించారు. 1962 నుండి 1964 వరకు అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా రెండుసార్లు సేవలందించారు, ఇది ఒక దళిత నాయకుడిగా ఆయన సాధించిన అరుదైన ఘనత. జవహర్‌లాల్ నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రి ప్రభుత్వాల్లో కేంద్ర కార్మిక, ఉద్యోగ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ పదవుల్లోనూ ఆయన కార్మికుల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం కృషి చేశారు.

**వ్యక్తిగత జీవితం**

సంజీవయ్య 1954లో సికింద్రాబాద్‌లో ఉపాధ్యాయినిగా పనిచేస్తున్న కృష్ణవేణిని వివాహం చేసుకున్నారు. వీరికి సంతానం లేనందున, సుజాత అనే బాలికను దత్తత తీసుకున్నారు. ఆయన వ్యక్తిగత జీవితం కూడా ఆయన నిరాడంబరత్వానికి అద్దం పట్టింది.

సంజీవయ్య కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదు, సాహిత్యం, కళల పట్ల ఆసక్తి గల వ్యక్తి. చట్ట శాస్త్రం చదువుతున్న రోజుల్లో రోమన్ న్యాయానికి సంబంధించిన లాటిన్ పదాలను గుర్తుంచుకోవడానికి తెలుగు పాటలుగా మలచిన సంఘటన ఆయన సృజనాత్మకతను తెలియజేస్తుంది. ఆయన 'చంద్రగుప్త' నాటకంలో పాత్ర పోషించడంతో పాటు, 'శివాజీ' అనే నాటకాన్ని రచించి రంగస్థలంపై ప్రదర్శించారు. ఈ కళాత్మక ఆసక్తి ఆయన బహుముఖ ప్రజ్ఞను వెల్లడిస్తాయి.

**వారసత్వం**

దామోదరం సంజీవయ్య ఒక నాయకుడు మాత్రమే కాదు, ఒక సామాజిక ఉద్యమకారుడు, ఆదర్శవంతమైన రాజకీయవేత్త, మరియు నిజాయితీకి నిలువెత్తు రూపం. ఆయన జీవితం యువతరానికి, ముఖ్యంగా అణగారిన వర్గాలకు, కష్టాలను అధిగమించి ఉన్నత స్థానాలను అధిరోహించవచ్చనే స్ఫూర్తిని అందిస్తుంది.

వెంకట్ బల్లికురవ
దళిత స్టడీస్, ఆంధ్రప్రదేశ్
96526 80802

# మార్క్సిజం, మార్కెట్, జాతీయవాదం

## కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ వియత్నాం

శ్రీనివాసన్ రమణి

1975 ఏప్రిల్‌లో అమెరికా సామ్రాజ్యవాదులపై ఘన విజయం సాధించి, దేశ పునరేకీకరణ సాధించుకున్న సందర్భాన్ని స్మరించుకుంటూ ఇటీవల వియత్నాం దేశం 50వ వార్షికోత్సవ వేడుకలను నిర్వహించింది. ఈ విజయం విప్లవకర యుద్ధాల సుదీర్ఘ దశను, వియత్నాం కమ్యూనిస్టు పార్టీ (సిపివి) నేతృత్వంలో పోరాటాలు, ఫ్రెంచ్ వారి పునరాక్రమణ, 1925 నుంచి అమెరికా జోక్యం వంటి వలసవాదానికి వ్యతిరేకంగా వివిధ అవతారాలను సూచిస్తుంది.

సూటిగా చెప్పాలంటే, జాతి స్వాతంత్ర్యం, సోషలిస్టు ప్రభుత్వం ఏర్పాటు కోసం వియత్నాం కమ్యూనిసు పార్టీ (సిపివి) మహోన్నత నాయకుడు హో చి మిన్ (అప్పట్లో న్యూయెన్ అయి క్వోక్ అని పిలిచేవారు) 1925లో రివల్యూషనరీ యూత్ లీగ్ లేదా చైనాలోని గువాన్ జోలో థాన్ నైయిన్‌ను స్థాపించారు. అవి కమ్యూనిస్టు పార్టీ ఏర్పడేందుకు తొలి వ్యవస్థాపక అడుగులు.

ఉత్తర – దక్షిణ వియత్నాంల పునరేకీకరణ 50వ వార్షికోత్సవా న్ని పురస్కరించుకొని గత వారం నిర్వహించిన భారీ పరేడ్‌లో సిపివి ప్రధాన కార్యదర్శి టో లామ్ ప్రసంగిస్తూ ప్రైవేట్ రంగం ''జాతీయ ఆర్థికవ్యవస్థలో అత్యంత ముఖ్యమైన చోదకశక్తి'' అని ఉద్ఘాటించారు. వందేళ్ల తరువాత నేడు ఏకపార్టీ (సిపివి) రాజకీయ వ్యవస్థ బలమైన మార్కెట్ ఆధారిత వ్యవస్థపై ఆధారపడి దేశాన్ని పరిపాలిస్తున్నది.

తమది ఇప్పటికీ ''సోషలిస్టు ఆధారిత అభివృద్ధివాదం'' నమూనానే అని చెబుతున్న కమ్యూనిస్టు నాయకత్వం, మార్కెట్ సంస్కరణలను తమ విధానంలో భాగం చేసుకుంది. వియత్నాం యుద్ధం ముగిసిన అనంతర దశాబ్దంలో వచ్చిన అనుభవాల పర్యవసానమే ఇది.

1986 వరకు సిపివి సాంప్రదాయ సోషలిస్టు విధానాలను అమలు చేస్తూ ఉండేది. అందులో కేంద్రీకృత ప్రణాళిక ఆర్థికవ్యవస్థ, గెలుచుకున్న దక్షిణాదిలో సహా పరిశ్రమల జాతీయాకరణ, సహకారసంఘాలుగా సమిష్టి వ్యవసాయం, ఉత్పత్తి లక్ష్యాలు, వనరుల కేటాయింపు, భారీ పరిశ్రమల ఏర్పాటుతో కూడిన పంచవర్ష ప్రణాళికల అమలు వంటివి ఉండేవి.

యుద్ధం ఫలితంగా వినాశనమైన ఆర్థిక వ్యవస్థ, నిరంతర అమెరికా ఆంక్షలు, ఖ్మేర్ రోజ్ పాలనలో దోపిడీ ఫలితంగా పొరుగుదేశం కంపోడియాపై వియత్నాం దండయాత్ర, 1970 చివర్లో వియత్నాంపై చైనా దండయాత్ర, వీటన్నిటి ఫలితంగా ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో పడిపోయింది. ఈ పరిస్థితులు ప్రణాళిక నమూనాలో లోపాలతో మరింత క్షీణించి, సమిష్టీకరణతో ఉత్పత్తి తగ్గిపోయి, ఆహార, సరుకుల కొరత ఏర్పడి అధిక ద్రవ్యోల్బణానికి దారి తీసింది.

### ఆర్థిక రూపాంతరం

ఇదంతా చివరకు ఆర్థిక సంస్కరణలను చేపట్టాల్సిన బలమైన పరిస్థితులకు సిపివి నెట్టబడింది. 'డొయ్ మొయ్' లేదా నవీకరణ (రినోవేషన్), ఇందులో సామూహిక వ్యవసాయం నుంచి ఉపసంహరించుకోవటం, ధరల సరళీకరణ, తొలి దశలో చిన్న తరహా ప్రైవేటు వ్యాపారులను అనుమతించటం, దానిని అనుసరిస్తూ స్థూల ఆర్థిక స్థిరీకరణ(మాక్రో ఎకనామిక్ స్టెబిలైజేషన్)కు చర్యలు, విదేశీ పెట్టుబడుల అనుమతి, అంతర్జాతీయ సమన్వయం (ఏసియాన్‌లో చేరిక వంటి చర్యలు), రెండవ దశలో ప్రభుత్వ యాజమాన్య సంస్థ(స్టేట్ ఓన్డ్ ఎంటర్‌ప్రైస్–ఎస్‌ఒఇ)సంస్కరణ ఉన్నాయి. 1990ల చివరి నాటికి సిపివి వాణిజ్య ఒప్పందాలకు ప్రోత్సాహం, ప్రపంచ వాణిజ్య సంస్థలో చేరిక, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ నిర్వహణకు సహకరించే వ్యవస్థల అభివృద్ధి, ఆర్థికవృద్ధికి నేతృత్వం వహించేందుకు ప్రైవేటురంగానికి అనుమతించటం, ప్రభుత్వరంగ సంస్థల్లో లోతైన సంస్కరణల ద్వారా ''ఈక్విటైజేషన్'' లేదా ''పాక్షిక ప్రైవేటీకరణ''ను తీసుకురావటం జరిగింది.

ఈ చర్యలు ఒకదాని వెంబడి ఒకటి జరిగాయి. 1980వ దశకం చివర్లో, 1990 దశకం తొలినాళ్ళలో వియత్నాం పేదరిక రేటు 60 శాతానికి సమీపంలో ఉండగా, సగటు తలసరి జిడిపి సుమారు 430 డాలర్లు, మానవ అభివృద్ధి సూచీ విలువ 0.492గా ఉండేవి. ఇవన్నీ కూడా తక్కువ మానవాభివృద్ధి కలిగిన పేద దేశంగా సూచిస్తున్నాయి. 2023లో వియత్నాం సగటు తలసరి జిడిపి 4,347 డాలర్లు, 2024 చివరి నాటికి బహుళకోణీయ పేదరికం కేవలం 1.9 శాతంగా, 2022లో మానవాభివృద్ధి సూచిలో 0.726గా నమోదై వియత్నాం ''అధిక మానవాభివృద్ధి'' కేటగిరిలో చేర్చబడి, మధ్య ఆదాయ దేశంగా నమోదైంది.

వియత్నాంలో గూగుల్, ఫేస్‌బుక్‌లు ప్రవేశించేందుకు సహాయపడిన డిజిటల్ కామర్స్ నిపుణుడు టువోక్ హుయ్న్ ఇటీవల హో చి మిన్ నగరంలో వ్యాసరచయితతో మాట్లాడిన సందర్భంలో సంస్కరణల ఫలితంగా దేశ వృద్ధి రేఖ ''ఐస్ హాకీ స్టిక్'' మాదిరిగా పెరిగిందనే విషయాన్నివివరించారు. అమెరికాకు వలస వెళ్ళిన వియత్నామీల కుటుంబంలో జన్మించిన టువోక్, ఆర్థిక వృద్ధి ప్రక్రియలో భాగమయ్యేందుకు తన దేశానికి తిరిగి వచ్చారు.

కానీ శీఘ్ర ఆర్థిక వృద్ధి అంటే అది పూర్తిగా అసమానతలతో కూడినదని అర్థం కాదు. జిని కోఎఫిషియెంట్ (అసమానతలను 0 నుంచి 100 వరకు నమోదు చేసే స్కేల్)లో వియత్నాం 36 పాయింట్లతో దక్షిణాసియాలోనే తక్కువగా అసమానతలు కలిగిన దేశాల్లో ఒకటిగా నిలిచింది.

1986 నుంచి దేశంలోని కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో పరివర్తన సైతం ఆర్థిక, రాజకీయ ధోరణులను సంకేతప్రాయంగా తెలియజేస్తుంది. 1969లో హోచిమిన్ మరణించిన తరువాత యుద్ధ సమయంలో పార్టీని నడిపించిన లీ డ్యువాన్ 1986 వరకు కొనసాగారు. ట్రువాంగ్ చిన్ పగ్గాలు స్వీకరించకముందు, పార్టీలో సంస్కరణల పక్షానికి మద్దతిచ్చి 'డొయ్ మొయ్'కు బాటలు వేసారు. సంస్కరణ, వాస్తవికవాదంతో అనుబంధం ఉన్న దక్షిణాది నాయకుడు గుయెన్ వాన్ లిన్ 1986 డిసెంబర్‌లో బాధ్యతలు చేపట్టి, మార్కెట్ ఆర్థిక వ్యవస్థ దిశగా నిర్ణయాత్మక మార్పుకు నేతృత్వం వహించారు.


గుయెన్ వాన్ లిన్ ప్రవేశపెట్టిన సంస్కరణల శకం సిపివిలో ఒక ప్రమాణంగా మారిపోయింది. కానీ, గుయెన్ ఫూ ట్రంగ్ హయాంలో 2011 నుంచి 2024 వరకు సీనియర్ పార్టీ నాయకులు, ప్రభుత్వ అధికారులకు వ్యతిరేకంగా 'బ్లేజింగ్ ఫర్నేస్ (మండుతున్న కొలిమి)' పేరుతో విస్తృతంగా చేపట్టిన అవినీతి వ్యతిరేక కార్యక్రమం కూడా ప్రస్ఫుటమైంది. ఆయన తరువాత 2024లో పగ్గాలు చేపట్టిన లామ్ కూడా గతంలో ప్రజా భద్రత మంత్రిత్వ శాఖలో అవినీతి వ్యతిరేక డ్రైవ్‌తో ప్రత్యేక సంబంధం కలిగిన వ్యక్తి. ఆయన తన ప్రసంగంలో డొయ్ మొయ్ పథానికి దృఢంగా కట్టుబడినట్లు ఉద్ఘాటిస్తూనే, 2030 నాటికి ఎగువ మధ్య ఆదాయ దేశంగా మారాలనే దిశగా వియత్నాం పయనిస్తుందని నొక్కి చెప్పారు.

ఏక పార్టీ రాజ్యమైన వియత్నాంలో సంఘాలు, పౌర స్వేచ్ఛలకు సంబంధించిన రాజకీయ స్వేచ్ఛలు గట్టిగా నియంత్రించబడ్డాయి. ఆర్థిక విధానాల ఫలితాలకోసం ఇవన్నీ తప్పనిసరి అని పాలక పార్టీగా సిపివి, దాని నాయకత్వం భావిస్తుంది.

### సమష్టి నాయకత్వం

వియత్నాం కమ్యూనిస్టు పార్టీ నేటి చైనా కమ్యూనిస్టు పార్టీకి భిన్నంగా సమష్టి నాయకత్వం, ఏకాభిప్రాయం ద్వారా నిర్ణయాలు తీసుకునేందుకు కట్టుబడి ఉండటం, ప్రత్యేకించి వ్యక్తి ఆరాధన లేకపోవడం ద్వారా వైవిధ్యాన్ని ప్రదర్శిస్తున్నది. ఏప్రిల్ 30న జరిగిన పరేడ్‌లో సైనిక బలగాలలోని వివిధ విభాగాలు, పార్టీ, వియత్నాం ప్రభుత్వం అంశాలు ప్రదర్శించబడ్డాయి. నాయకుల ఫోటోల మధ్య కేవలం హో చి మిన్ ముఖం మాత్రమే ఎల్లవేళలా కనపడుతుంది.



దేశంలో కమ్యూనిస్టు ఉద్యమంలోని మంచి చెడులు హో చి మిన్‌తో ముడిపడి ఉండడం ఆశ్చర్యమేమి కాదు. ఆయన సోషలిస్టుగా ఉంటూనే వలసవాదం నుంచి స్వాతంత్ర్యం కోరిన జాతీయవాది. వలసవాద వ్యతిరేక పోరాటంలో, సమసమాజ నిర్మాణంలో మార్క్సిజం–లెనినిజం కచ్చితమైన మార్గాలను అందిస్తుందని ఆయన విశ్వసించారు. వియత్నాం, లావోస్, కాంబోడియాల వ్యాప్తంగా ఇండోచైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ(ఐసిపి)ని ఏర్పాటు చేయటంలో ఆయన కీలక పాత్ర పోషించారు.

ఫ్రెంచ్‌కు వ్యతిరేకంగా వలసవాద వ్యతిరేక పోరాటానికి నేతృత్వం వహించి, విజయం సాధించిన వీత్ మిన్‌ను శాసించిన ఐసిపి కమ్యూనిస్టులు, ఆ తరువాత విడిపోయి, ఐసిపిలోని భాగస్వాములైన మూడు దేశాలలో పార్టీలను ఏర్పాటు చేశారు. వారు ఏర్పాటు చేసిన వర్కర్స్ పార్టీ ఆఫ్ వియత్నాం(డబ్ల్యుపివి) (పునరేకీకరణకు పూర్వం) ఉత్తర వియత్నాంను పరిపాలించింది. డబ్ల్యుపివి దక్షిణ విభాగమైన పీపుల్స్ రివల్యూషనరీ పార్టీ ఆఫ్ సౌత్ వియత్నాం ఆ తరువాత వీత్ కాంగ్‌గా ప్రజాదరణ పొందిన నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ ఆఫ్ సౌత్ వియత్నాంకు నేతృత్వం వహించింది. ఇది దక్షిణ వియత్నాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేయడంతో పాటు, యుద్ధంలో అమెరికా సైన్యానికి వ్యతిరేకంగా పోరాటం చేసింది. సంస్కరణలు చేపట్టి సుమారు 40 సంవత్సరాలు గడిచిన తరువాత, సోషలిస్టు కూటమి లేని ప్రపంచంలో, ఇప్పటికీ హో చి మిన్‌కు తమ నిజమైన సైద్ధాంతిక స్ఫూర్తి ప్రదాతగా వియత్నాం నివాళులర్పించటాన్ని కొనసాగిస్తున్నది. ప్రధానంగా మార్క్సిజం–లెనినిజం, వియత్నామీ జాతీయవాదాన్ని జతచేయడంలో ఆయన నిర్వర్తించిన వ్యవస్థాపక పాత్రనే ఇందుకు కారణం.

(ది హిందూ సౌజన్యంతో...)

# సంస్కరణలతో మెరుగవుతున్న ప్రభుత్వ ఇంటర్ విద్య



డా.షేక్ జాన్ పాషా
7386847203

కొఠారి కమిషన్ (1964–66) సిఫార్సులను అనుసరించి ఉన్నత విద్య దేశమంతటకు ఒకే రీతిలో ఉండే విధంగా నూతన విద్యా పథకం 10+2+3 (10 సంవత్సరాలు పాఠశాల విద్య, 2 సంవత్సరాలు ఇంటర్ విద్య/ప్రీ డిగ్రీ విద్య, 3 సంవత్సరాలు డిగ్రీ విద్య) అమలులోకి వచ్చింది. దీనిని గత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు పరిచింది.1969–70 విద్యా సంవత్సరం నుండి 2 సంవత్సరాల ఇంటర్మీడియట్ కోర్సును ప్రారంభించింది. ఈ కోర్సును కొన్ని డిగ్రీ కళాశాలలలోనూ, మరికొన్నింటిని ప్రభుత్వ జూనియర్ కళాశాలలలోనూ, మరికొన్ని అభివృద్ధి చేయబడిన బహుళార్థ పాఠశాలల( మల్టీపర్పస్ స్కూల్స్) లోనూ ప్రవేశ పెట్టడం జరిగింది. ఇటు ఉన్నత పాఠశాలలకు అటు డిగ్రీ కళాశాలలకు ఈ ఇంటర్మీడియట్ విద్య వారధిగా ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. 1970 సంవత్సరంలో ఇంటర్మీడియట్ విద్యను విశ్వవిద్యాలయ పరిధి నుంచి తప్పించి ప్రభుత్వ చట్ట ప్రకారం ఇంటర్మీడియట్ విద్యా మండలి 'ఇంటర్మీడియట్ బోర్డు' ను 1971సంవత్సరంలో నెలకొల్పారు. ఈ మండలికి 'స్టాట్యుటరీ బాడీ' అధికారాన్ని ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గతంలో ప్రీ యూనివర్సిటీ కోర్స్‌గా ఉన్న దీనిని 1969వ సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ విద్యగా మార్చారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో 428 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు కొనసాగుతున్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాలలలో ఈ విద్యా సంవత్సరం(2024–25) లో 1.80లక్షలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసించారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రభుత్వరంగ మరియు ప్రైవేటు కళాశాలల్లో సుమారు 9.97లక్షలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసించారు.

**గత 4 సం.లుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ఫలితాలు (ఉత్తీర్ణతా శాతం)**

| విద్యా.సంవత్సరం | ప్రథమ | ద్వితీయ సంవత్సరం |
|---|---|---|
| 2021–22 | 47.70 | 63.56 |
| 2022–23 | 40.00 | 54.00 |
| 2023–24 | 38.21 | 49.13 |
| 2024–25 | 42.49 | 53.44 |

పై ఉత్తీర్ణతా శాతాలను పరిశీలిస్తే.. గత 3 సంవత్సరాలుగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం క్రమక్రమంగా తగ్గుతున్నట్టుగా మనకు స్పష్టంగా తెలుస్తున్నప్పటికీ... ఈ విద్యా సంవత్సరం (2024–25) ఫలితాలలో మాత్రం పెరుగుదల నమోదయింది....గత సంవత్సర ఉత్తీర్ణత శాతం కంటే ఈ సంవత్సరపు ఫలితాలలో ప్రథమ సంవత్సరంలో 4.28% మరియు ద్వితీయ సంవత్సరంలో 4.31% పెరుగుదల కనిపించింది.

ఫలితాలు మెరుగవడానికి 2024.నవంబర్ లో టిజిబిఐఇ కు నూతన డైరెక్టర్ గా నియామకం కాబడిన కృష్ణఆదిత్యా ఇంటర్ విద్యలో చేపట్టిన అకాడమిక్ పరీక్షలనిర్వహణలో తీసుకువచ్చిన వినూత్న సంస్కరణలే ప్రధాన భూమికను పోషించాయని చెప్పకతప్పదు.

**అకడమిక్,పరీక్షల నిర్వహణలో నూతన సంస్కరణలు :** గత విద్యాసంవత్సరం(2024–25) నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు సంవత్సరం పొడుగునా రెగ్యులర్ తరగతులతో పాటు ఎప్‌సెట్, నీట్, జెఇఇ పోటీ పరీక్షలకు ఉచిత కోచింగ్ సదుపాయం కల్పించడం,పేరెంట్ – టీచర్స్ మీటింగ్ నిర్వహణ, వార్షిక పరీక్షలకై 90 రోజుల కార్యాచరణ (యాక్షన్ ప్లాన్)అమలు. ప్రత్యేకంగాప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచుటకు క్షేత్రస్థాయి పరిశీలకులను (ఫీల్డ్ ఆఫీసర్స్) నియమించడం, అదేవిధంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు బోర్డు జిల్లాఇంటర్మీడియట్ అధికారులతో తరుచూ పర్యవేక్షణ నిర్వహించటం. హార్ట్ ఫుల్ నెస్ ప్రోగ్రాం అమలు, విద్యార్థులలో పరీక్షల పట్ల భయం, ఒత్తిడిని తగ్గించుటకు ప్రతి ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలలో ఒక మహిళ, ఒక పురుష అధ్యాపకులను కౌన్సెలర్లుగా నియమించడం, ప్రతి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు శాశ్వత ప్రాతిపదికన 4/5 సిసి కెమెరాల ఏర్పాటు, అగ్నిమాపక పరికరాలు, మంటలు ఆర్పే సిలిండర్లు అమర్చడం జరిగింది. ఇంటర్ థియరీ పరీక్షల హాల్ టికెట్లపై క్యూ.ఆర్ కోడ్‌ను ముద్రించడం,విద్యార్థుల మొబైల్ కి హాల్ టికెట్ల లింకు పంపడం, ఐ.వి.ఆర్ నెంబర్ ను సహితం ముద్రించడం జరిగింది. ప్రశ్నపత్రాలపై క్యూ.ఆర్ కోడ్ తో పాటు సీరియల్ నంబర్ ముద్రించుట.ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలన్నీ సిసిటివి, కెమెరాల పర్యవేక్షణలో నిర్వహించి పరీక్షల నిర్వహణ తీరును పర్యవేక్షించుటకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్(సిసిసి) ను ఏర్పాటు చేయడం.వివిధ కారణాలతో ప్రాక్టికల్ పరీక్షలకు గైర్హాజరైన విద్యార్థులకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ప్రతి జిల్లా కేంద్రంలో మరోసారి ప్రాక్టికల్ పరీక్షలు రాసేలా అవకాశం కల్పించడం, పబ్లిక్ పరీక్షల ప్రశ్నాపత్రాల భద్రత కోసం అన్ని జిల్లా కేంద్రాలలో బల్క్ స్ట్రాంగ్ రూంల ఏర్పాటు, పరీక్ష కేంద్రానికి ఐదు నిమిషాలు ఆలస్యమైనా, పరీక్షలు రాసుకునే వెసులుబాటు కల్పించారు.ప్రతి పరీక్ష హాలులో సమయ పాలనకోసం గోడ గడియారాల ఏర్పాటు, ఇంటర్ మూల్యాంకన కేంద్రాలలో సి.సి.కెమెరాల ఏర్పాటు, రాష్ట్ర ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్ (సిసిపి)కి అనుసంధానించి, ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టారు. ఇంటర్ మూల్యాంకనంలో పాల్గొనే ప్రతిఒక్కరి హాజరును టిఎస్‌ఎబిఎఎస్ ఆప్ ద్వారా నమోదు చేశారు. ఇంటర్ జవాబు పత్రాల ముందస్తు పున: పరిశీలన చేపట్టడం/ర్యాండం రీవాల్యుయేషన్ ప్రక్రియ చేపట్టడం. అంతేకాకుండా పలుసహ పాఠ్యఅంశాలైన యువ టూరిజం క్లబ్స్ ఏర్పాటు, స్టూడెంట్ కేరీర్ కౌన్సెలర్ల నియామకం, డ్రగ్స్ నిర్మూలన కమిటీల ఏర్పాటు, పబ్లిక్ సర్వీస్ కమీషన్ ద్వారా1286 మంది నూతన అధ్యాపకుల నియామకాలు,గ్రూప్ 4 నియామకాలు, 30 మంది నూతన లైబ్రేరియన్ల నియామకాలు జరిగాయి, కళాశాలల సీనియర్ ప్రిన్సిపాల్స్, లెక్చరర్లను... డిప్యూటీసెక్రటరీలుగా, జాయింట్ సెక్రటరీలుగా మరియు ఈ.ఆర్.టి.డబ్ల్యూలో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ గా టిజిబిఐఈలో ఆన్ డ్యూటీ/డిప్యూటేషన్ ప్రాతిపదికన పని చేయుటకు నియామకాలు జరిగాయి. రాష్ట్రస్థాయిలో స్టేట్ మానిటరింగ్ సెల్ (అకాడమిక్ గైడెన్స్, ట్రైనింగ్ & ప్లేస్మెంట్ సెల్ జిల్లాస్థాయిలో డిస్ట్రిక్ట్ అకాడమిక్ మానిటరింగ్ సెల్ ఆఫీసర్స్‌ను నియమించి నిరంతరం అకడమిక్ విషయాలను పర్యవేక్షించడం జరుగుతుంది.




**నూతన సంస్కరణలతో ప్రయోజనాలెన్నో:** పరీక్షల ఒత్తిడిని, భయాన్ని జయించేలా హెచ్.ఈ.ఎల్.పి (హెల్ప్)ప్రోగ్రాం, టె మానస్ కౌన్సెలర్ల 14416 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా విద్యార్థులకు ఎంతో మేలు జరిగిందని చెప్పవచ్చు. రాష్ట్రస్థాయిలో స్టేట్ మానిటరింగ్ సెల్ ఎజిటిపిసి, జిల్లాస్థాయిలో డిస్ట్రిక్ట్ అకాడమిక్ మానిటరింగ్ సెల్ ఆఫీసర్స్ ను నియమించి నిరంతరం అకడమిక్ విషయాలను పర్యవేక్షించడం ద్వారా ఈ విద్యా సంవత్సరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలు మెరుగైన ఫలితాలు పొందాయి. పలు అకాడమిక్ సంస్కరణలలో వార్షిక పరీక్షలకై 90,30,10 రోజుల కార్యచరణ(యాక్షన్ ప్లాన్)అమలు తీరు, ఉత్తీర్ణత శాతం పెరుగుటకు తోడ్పడింది. నూతన నియామకాల ద్వారా ఇంటర్ బోర్డ్‌లో ఏర్పాటు చేసిన రాష్ట్ర ప్రత్యేక కమాండ్ కంట్రోల్ సెంటర్(సిసిసి)లో పర్యవేక్షణకు ఎటువంటి ఔట్ సోర్సింగ్ నియామకాలు చేపట్టాల్సిన అవసరం లేకుండా పూర్తిస్థాయిలో బాధ్యతగా పరీక్షల నిర్వహణలో పాల్గొన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షలు రాయబోతున్న విద్యార్థులు పరీక్షా సెంటర్ అడ్రస్ తెలియక దారితప్పడం లాంటివి జరగకుండా హాల్ టికెట్లపై క్యూ.ఆర్ కోడ్‌ను ముద్రించడం ద్వారా విద్యార్థులు సకాలంలో పరీక్షాసెంటర్‌కు చేరుకుని ఆనందంగా పరీక్షలు రాయడానికి వీలు కలిగింది. గతంలో ఉమ్మడి జిల్లా కేంద్రంలోని స్ట్రాంగ్ రూములకు.. అక్కడి నుండి పరీక్షలకు ఐదు రోజుల ముందు ఆయా పోలీస్ స్టేషన్లకు ప్రశ్న పత్రాల బండిళ్లను పంపేవారు. అలా కాకుండా ఈసారి అన్ని జిల్లా కేంద్రాలలో జిల్లా బల్క్ స్ట్రాంగ్ రూంలను ఏర్పాటు చేయటంతో పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు చవిచూడలేదు. క్రీడలపై మక్కువ ఉన్న విద్యార్థులకు ఈ స్పోర్ట్స్ కాలెండర్ ఎంతో మేలు జరుగుతుందని చెప్పవచ్చు.

**చేయాల్సిన పనులు మరికొన్ని..** యూనివర్సిటీలు చేపట్టే విధంగా పరీక్షా కేంద్రంలోనే ఆన్లైన్ ద్వారా ప్రశ్నాపత్రాల ముద్రణ, పరీక్షల నిర్వహణచేపట్టి, ఆన్లైన్ మూల్యాంకనం ప్రారంభించినట్లయితే. బోర్డుకు ఆర్థిక భారం తగ్గటంతో పాటు, విద్యార్థులకు పరీక్ష ఫీజు కొంతమేరకు తగ్గించే అవకాశం కలుగుతుంది. ప్రతీ నెల విద్యార్థులకు ఉపకారవేతనములు(స్కాలర్షిప్) ఇచ్చినట్లైతే అడ్మిషన్లు పెరగడంతో పాటు డ్రాపవుట్స్ ను తగ్గించవచ్చు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో వెంటనే మధ్యాహ్న భోజన ఏర్పాట్లు, ఏకరూప దుస్తుల పంపిణీ చేపట్టాలి. గురుకులాల మాదిరి ప్రతిభగల విద్యార్థుల కొరకు ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్(సిఒఇ)కళాశాలలను ప్రారంభించాలి. ఐపిఇ2025లో అత్యంత ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రతియేటా ఇచ్చే ప్రతిభా పురస్కారాల నగదు పారితోషికాన్ని రెట్టింపు చేయాలి. బాలురకు, బాలికలకు వేరువేరుగా వసతిగృహాలను ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం మన రాష్ట్రంలో 972 సర్కార్ స్కూళ్లలో డిజిటల్ విద్యను అందించేందుకు విద్యాశాఖ చర్యలు తీసుకుంది. అలాగే రాష్ట్రంలో 428 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో కూడా డిజిటల్ క్లాసుల నిర్వహణకు చర్యలు చేపట్టినట్లైతే విద్యార్థులకు మేలు జరుగుతుంది. దీనితో ప్రపంచ విజ్ఞానాన్ని, వర్తమాన విషయాలతో సరిపోల్చుకుని భవిష్యత్తుకు బంగారు బాటలు నిర్మించుకోవటానికి వీలుకలుగుతుందని ఆశిద్దాం.

రచయిత: రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## బస్సు లోయలో పడి సైనికుడు సహా నలుగురు మృతి

**మెంధర్ :** జమ్మూ కశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో మంగళవారం ఒక ప్రైవేట్ బస్సు రోడ్డు పక్కన లోతైన లోయలో పడిపోవడంతో ఒక సైనికుడు సహా నలుగురు ప్రయాణికులు మృతి చెందగా, 44 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ఘని గ్రామం నుండి మెంధర్‌కు బస్సు వెళుతుండగా ఉదయం 9.20 గంటల ప్రాంతంలో అదుపు తప్పి వాహనం లోయలో పడిపోయిందని అధికారులు తెలిపారు. స్థానికులు వెంటనే సహాయక చర్యలు ప్రారంభించారు. పోలీసులు, సైన్యం, సిఆర్‌పిఎఫ్ సిబ్బంది కూడా వారితో చేరారు. మృతులను ఘని గ్రామానికి చెందిన మహ్మద్ మజీద్ (45), షకీలా బేగం (55), మహ్మద్ హనీఫ్ (50), కస్బారీకి చెందిన నూర్ హుస్సేన్(60)గా అధికారులు గుర్తించారు. అస్సాంలో విధులు నిర్వహిస్తున్న సైనికుడు మజీద్ సెలవుపై తన గ్రామానికి వచ్చారు. హుస్సేన్, మజీద్ అక్కడికక్కడే మృతి చెందారని, సహాయక సిబ్బంది రాజౌరిలోని జిఎంసి ఆసుపత్రికి తరలిస్తుండగా బేగం మరణించగా, జిఎంసి రాజౌరిలో చికిత్స పొందుతూ హనీఫ్ మరణించారని, మరో ఏడుగురు గాయపడిన వారి పరిస్థితి క్లిష్టంగా ఉందని వారు తెలిపారు. ప్రమాదంపై లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా విచారం వ్యక్తం చేశారు.

### ఎన్‌సిఆర్ పరిధిలో బాణాసంచా నిషేధించాలి..

# లేదంటే కోర్టు ధిక్కారమే

**ఉత్తర్‌ప్రదేశ్ , రాజస్థాన్, హర్యానా ప్రభుత్వాలకు 'సుప్రీం' ఆదేశం**

**న్యూఢిల్లీ :** ఎన్‌సిఆర్ రీజియన్ (దేశ రాజధాని ఢిల్లీ మెట్రోపాలిటన్ చుట్టుపక్కల పరిధి)లోకి వచ్చే ఉత్తర్ ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా ప్రభుత్వాలు బాణసంచాలను కాల్చడంపై పూర్తి నిషేధం విధించాలని సుప్రీంకోర్టు మంగళవారం ఆదేశించింది. సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అభయ్ ఓకా, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం మాట్లాడుతూ ఎన్‌సిఆర్ రీజియన్ కిందకు వచ్చే అన్ని ప్రాంతాలలో అన్నిరకాల బాణసంచాలపై మ్యానుఫాక్చరింగ్, అమ్మకాలు, స్టోరేజీ సహా ఆన్‌లైన్ డెలివరీపై పర్యావరణ పరిరక్షణ చట్టం (ఇపిఎ) కింద పూర్తి నిషేధం విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. పర్యావరణ పరిరక్షణ చట్టంలోని సెక్షన్ 5 కింద జారీచేసిన కోర్టు ఉత్తర్వులు మాత్రమే కాకుండా మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. రాష్ట్రాలకు చెందిన చట్ట అమలు సంస్థలన్నీ కోర్టు ఉత్తర్వులను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించింది. బాణసంచాపై పూర్తి నిషేధాన్ని సమర్థవంతంగా అమలుచేసేందుకు ఒక యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని అత్యున్నత న్యాయస్థానం చెప్పింది. 'కోర్టు జారీచేసిన ఆదేశాలను ఎన్‌సిఆర్ పరిధి ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, హర్యానా ప్రభుత్వాలు కానీ, చట్టాల అమలు సంస్థలు కానీ అమలు చేయడంలో ఒకవేళ వైఫల్యం చెందిన పక్షంలో దానిని కోర్టు ధిక్కరణ చట్టం 1971కింద పరిగణించి వారిపై చర్య తీసుకుంటామని సర్వోన్నత న్యాయస్థానంహెచ్చరించింది. ఎన్‌సిఆర్‌లో భాగస్వామ్యమైన అన్ని రాష్ట్రాలు సమగ్ర సమ్మతి అఫిడవిట్‌ను దాఖలు చేయాలి. బాణసంచా కాల్చడంపై నిషేధం విధించిన విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వాలు విస్తృత ప్రచారం నిర్వహించాలని,నిషేధపుఆజ్ఞలనుఉల్లంఘించినవారిపైజరిమానావిధించబడుతుందనిప్రచారంద్వారా ప్రజలకుతెలియజేయాలి' అని ధర్మాసనం తెలియజేసింది. ఢిల్లీ ఎన్‌సిఆర్ పరిధిలో బాణసంచా తయారీ, నిల్వ, అమ్మకాలపై విధించిన నిషేధాన్ని సడలించాని చేసిన విజ్ఞప్తిని ఏప్రిల్ 3న సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. ఎన్‌సిఆర్ పరిధిలో అధిక సంఖ్యలో ప్రజలు వీధులలో పనిచేస్తూ కాలుష్యం బారినపడుతున్నారని, ప్రతీ ఒక్కరూ తమ ఇళ్లల్లో ఎయిర్ ప్యూరిఫైర్‌లను వినియోగించే స్తోమత ఏమీ కలిగిఉండరని, కాలుష్యంపై పోరాటం చేసే శక్తిని కూడా కలిగి ఉండరని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. 'గ్రీన్ క్రాకర్స్' మూలంగా కాలుష్యం తక్కువగా ఉందని కోర్టు భావిస్తే తప్ప మునుపటి ఆదేశాలను పున:పరిశీలించే అవకాశం లేదని జస్టిస్ అభయ్ ఓకా, ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ స్పష్టంచేసింది. 2024 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు తదుపరి ఉత్తర్వులు వచ్చేంతవరకూ బాణసంచా కాల్చడంపై పూర్తి నిషేధాన్ని విధించాలని బెంచ్ ఉత్తర్‌ప్రదేశ్, హర్యాలనా ప్రభుత్వాలను ఆదేశించింది. తక్షణ ప్రభావంతో ఏడాది పొడవునా ఆన్‌లైన్ మార్కెటింగ్ ద్వారాడెలివరీ సహా తయారీ, నిల్వ, అమ్మకాలపై పూర్తి నిషేధం అమలుచేయాలని కోర్టు ఢిల్లీ ప్రభుత్వానికి సూచించింది.



# నర్వాల్ కుటుంబానికి రాహుల్‌గాంధీ పరామర్శ

**హర్యానా కర్నాల్‌లోని నావికాదళ అధికారి నివాసంలో నివాళి**



**చండీగఢ్ :** పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మరణించిన నేవీ అధికారి లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ కుటుంబ సభ్యులను లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ మంగళవారం పరామర్శించారు. కాంగ్రెస్ పార్టీ హర్యానా వ్యవహారాల ఇన్‌ఛార్జ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బికె హరిప్రసాద్‌తో కలిసి రాహుల్ మధ్యాహ్నం హర్యానాలోని కర్నాల్‌కు చేరుకున్నారు. నావికాదళ అధికారి నివాసానికి వెళ్లి నర్వాల్‌కు నివాళి అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. దాదాపు గంటన్నరసేపు వారితో గడిపారు. అయితే అక్కడ మీడియాతో మాట్లాడలేదు. అనంతరం తన పర్యటన వివరాలను ఎక్స్‌లో పోస్ట్ చేశారు. పహల్గామ్ దాడిలో అమరవీరుడైన లెఫ్టినెంట్ వినయ్ నర్వాల్ జీ కుటుంబాన్ని పరామర్శించానని, వారి బాధను పంచుకున్నానన్నారు. అపారమైన దుఃఖంతో ఉన్నప్పటికీ వారి ధైర్యం దేశానికి ఒక సందేశం అని, మనం ఐక్యంగా ఉండాలన్నారు. 'దేశం మొత్తం అమరవీరుల కుటుంబాలకు అండగా నిలుస్తుంది. ప్రభుత్వానికి ప్రతిపక్షాల పూర్తి మద్దతు ఉంది ఎవరూ భారతదేశం వైపు కన్ను ఎత్తడానికి సాహసించని విధంగా దోషులను శిక్షించాలి. బాధిత కుటుంబాలతో పాటు, దేశం మొత్తం న్యాయం కోసం ఎదురు చూస్తోంది' అన్నారు. కాగా, హర్యానా కాంగ్రెస్ చీఫ్ భన్ పిటితో మాట్లాడుతూ న ర్వాల్ కుటుంబాన్ని కుటుంబాన్ని కలిసిన తర్వాత, రాహుల్‌గాంధీ ఢిల్లీకి బయలుదేరారన్నారు. కాగా, మూడు వా రాల క్రితం వివాహం చేసుకున్న 26 ఏళ్ల లెఫ్టినెంట్ నర్వాల్ తన భార్య హిమాన్షితో కలిసి పహల్గామ్‌కు హనీమూన్ ట్రిప్‌లో ఉన్నప్పుడు, ఏప్రిల్ 22న ఉగ్రవాదులు అతనిని పా యింట్ బ్లాంక్‌లో కాల్చి చంపారు. పహల్గామ్ ఉగ్రవాద దాడిలో మరణించిన 26 మందిలో ఒకరైన శుభం ద్వివేది కుటుంబ సభ్యులను కూడా రాహుల్‌గాంధీ పరామర్శించారు.

## రోడ్డు ప్రమాద బాధితులకు నగదు రహిత చికిత్స

**రూ.1.5 లక్షల వరకూ**
**ఉచిత వైద్యం కొత్త పథకం**
**ప్రకటించిన కేంద్రం**

**న్యూఢిల్లీ :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు రూ.1.5 లక్షల వరకూ ఉచిత వైద్యం అందించడానికి వీలు కల్పిస్తూ కేంద్ర రహదారుల రవాణాశాఖ సోమవారం రాత్రి నోటిఫికేషన్ జారీ చేసింది. సోమవారం నుంచే ఇది అమల్లోకి వచ్చినట్లు అందులో ప్రకటించింది. రోడ్డు ప్రమాద బాధితులకు గోల్డెన్ అవర్‌లో ఉచిత వైద్యం అందించాలని సుప్రీంకోర్టు గత జనవరిలో తీర్పు వెలువరించిన నేపథ్యంలో కేంద్రం ఇప్పుడు నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకు క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ ఆఫ్ రోడ్ యాక్సిడెంట్ విక్టిమ్స్ స్కీమ్ – 2025గా నామకరణం చేసింది. మోటారు వాహనం కారణంగా ఏ రహదారిలో ప్రమాదానికి గురైనా ఈ పథకం కింద ఆసుపత్రుల్లో రూ.1.50 లక్షల వరకూ నగదు రహిత వైద్య సేవలు పొందడానికి అర్హులవుతారు. ప్రమాదం జరిగిన నాటి నుంచి ఏడు రోజులదాకా ఈ సేవలు పొందవచ్చు. రోగులకు ట్రామా, పాలీట్రామా సేవలు అందించగల సామర్థ్యం ఉన్న అన్ని ఆసుపత్రులనూ ఈ పథకం కిందికి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఈ నోటిఫికేషన్‌లో సూచించింది. రోడ్డు ప్రమాద బాధితుడిని ఆసుపత్రికి తెచ్చిన వెంటనే వైద్య సేవలు ప్రారంభించాల్సి ఉంటుంది. ఒకవేళ తమవద్ద సౌకర్యాలు లేకపోతే వెంటనే మరో ఆసుపత్రికి పంపాల్సి ఉంటుంది. అందుకోసం సదరు ఆసుపత్రివారే రవాణా సౌకర్యాలు కల్పించాలి. బాధితుడు డిశ్చార్జి అయిన తర్వాత వైద్య సేవలు అందించిన ఆసుపత్రి అందుకు సంబంధించిన బిల్లును ప్యాకేజీకి అనుగుణంగా పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.



# కులగణనపై చర్చలు జరపాలి

**తెలంగాణ నమూనాను అనుసరించాలి**
**ప్రధాని మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే లేఖ**

**న్యూఢిల్లీ :** కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వంపై నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీకి కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే లేఖ రాశారు. కులగణన చేయడంలో తెలంగాణ నమూనాను అనుసరించాలని, ఈ అంశంపై అతి త్వరలో అన్ని రాజకీయ పార్టీలతో చర్చలు జరపాలని విజ్ఞప్తి చేశారు. రాజ్యాంగ సవరణ ద్వారా రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని తొలగించాలని, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసిలకు రిజర్వేషన్లు కల్పించే ఆర్టికల్ 15(5)ను వెంటనే అమలు చేయాలని ఆ లేఖలో ఖర్గే పేర్కొన్నారు. సమాజంలో వెనుకబడిన, అణగారిన వర్గాలకు వారికి హక్కులను కల్పించే కుల గణన వంటి ఏదైనా ప్రక్రియను నిర్వహిస్తున్నప్పుడు విభజన ప్రక్రియగా పరిగణనించవద్దన్నారు. మనది గొప్ప దేశమని, పహల్గామ్ ఉగ్రదాడి తరువాత తాము చెప్పిన విధంగానే విశాల హృదయంగల మన ప్రజలు ఏకతాటిపై నిలిచారని ఈనెల 5వ తేదీన మోదీకి రాసిన లేఖలో ఖర్గే పేర్కొన్నారు. మన రాజ్యాంగం ప్రవేశికలో ప్రతిజ్ఞ చేసినట్లుగా సామాజిక, ఆర్థిక న్యాయంతో పాటు హోదా, అవకాశాల సమానత్వాన్ని నిర్ధారించడానికి సమగ్ర పద్ధతిలో కుల గణనను నిర్వహించడం చాలా అవసరమని కాంగ్రెస్ విశ్వసిస్తున్నట్లు ఖర్గే అన్నారు. కుల కణన చేయాలని ఏప్రిల్ 16, 2023న ప్రధానమంత్రికి లేక రాసినట్లు కాంగ్రెస్ అధ్యక్షుడు గుర్తు చేశారు. అయితే తన లేఖకు ఇప్పటి వరకు సమాధానం రాలేదన్నారు. లోతైన సామాజిక న్యాయం, సాధికారత ప్రయోజనాల కోసం ఇప్పుడు చేస్తామంటున్న కుల గణనను డిమాండ్‌ను తాము లేవనెత్తినప్పుడు కేంద్ర పెద్దలు, బిజెపి నాయకులు కాంగ్రెస్, పారీట నాయకులపై విమర్శల దాడి చేశారని ఖర్గే ఆ లేఖలో గుర్తుచేశారు. అయితే ఇప్పుడు ఎటువంటి వివరాలు తెలియజేయకుండా జనగణనలో చేసే సమయంలో కుల గణన చేస్తామని ప్రకటించారన్నారు. తాము మూడు సూచనలు చేస్తున్నామని, అందులో మొదటిది జనాభా లెక్కల ప్రశ్నాపత్రం రూపకల్పన చేయడం అన్నారు. కుల సమాచారాన్ని సేకరించడం గణన ప్రయోజనాల కోసం కాదని, సామాజిక, ఆర్థిక లక్ష్యాలను సాధించడం కోసం అని ఖర్గే సూచించారు. ఇటీవల ముగిసిన తెలంగాణ కుల సర్వేను అటువంటి లక్ష్యాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించి అమలు చేశారని గుర్తు చేశారు. అందువల్ల తెలంగాణ నమూనాను అనుసరించాలన్నారు. 1994 ఆగస్టు నుండి మన రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో తమిళనాడు రిజర్వేషన్ల చట్టం మాత్రమే రక్షించబడిందని ఖర్గే ఎత్తి చూపారు. ఇతర రాష్ట్రాల చట్టాలను కూడా మన రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన కోరారు. అంతేకాకుండా, కుల గణన ఫలితాలు ఎలా ఉన్నా, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసిలకు రిజర్వేషన్లపై ఏకపక్షంగా విధించిన 50 శాతం పరిమితిని రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించాలని ఖర్గే నొక్కి చెప్పారు. ఆర్టికల్ 15(5)ని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు కూడా డిమాండ్ చేశారు. ఇది ప్రైవేట్ విద్యాసంస్థలలో కూడా షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, ఒబిసిలకు రిజర్వేషన్లను కల్పిస్తుందని ఖర్గే ఎత్తి చూపారు. కాంగ్రెస్ సహా ప్రతిపక్ష పార్టీలు దేశవ్యాప్తంగా కుల గణనను డిమాండ్ చేస్తూనే ఉన్నాయి. ఇది ఒక ప్రధాన ఎన్నికల అంశంగా మారింది. బీహార్, తెలంగాణ, కర్ణాటక వంటి కొన్ని రాష్ట్రాలు అలాంటి సర్వేలను నిర్వహించాయి.

## రిజర్వేషన్‌లు రైల్వేబోగీ లాంటివి

**కంపార్ట్‌మెంట్‌లోకి ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను**
**లోపలికి రానివ్వరు సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు**

**న్యూఢిల్లీ :** రిజర్వేషన్లను ఉద్దేశించి సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. దేశంలోని కుల ఆధారిత రిజర్వేషన్లు రైలు బోగీల్లాంటివని అత్యున్నత న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఆ కంపార్ట్ మెంట్‌లోకి ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను లోపలికి రానివ్వరని పేర్కొంది. మహారాష్ట్ర స్థానిక ఎన్నికల్లో ఒబిసి రిజర్వేషన్లపై వేసిన పిటిషన్ విచారణలో భాగంగా సుప్రీం న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఈ విధంగా స్పందించారు. మహారాష్ట్రలో 2016–17లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. ఒబిసి కోటా విషయంలో జరుగుతోన్న న్యాయపోరాటంలో ఎన్నికల నిర్వహణలో జాప్యం చోటుచేసుకుంటోంది. ఒబిసిలకు 27 శాతం కోటాను అమలుచేయడం కోసం మహారాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డినెన్స్‌ను 2021లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. కాగా.. ఒబిసిలకు సంబంధించిన డేటా ఉన్నప్పటికీ, దానిని ప్రభుత్వం ఉపయోగించడం లేదని తాజాగా పిటిషనర్ తరఫు న్యాయవాది కోర్టులో వాదించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసిన అధికారుల ద్వారా స్థానిక సంస్థలను ఏకపక్షంగా నడుపుతోందని ఆరోపించారు. రిజర్వేషన్ల ప్రయోజనాన్ని పొందేందుకు ఒబిసిలలోనే వెనకబడిన వారిని గుర్తించాలని మరో న్యాయవాది తన వాదనను వినిపించారు. ఈ క్రమంలోనే న్యాయమూర్తి స్పందించారు. దేశంలో రిజర్వేషన్లు రైలు కంపార్ట్‌మెంట్ల మాదిరిగా మారాయి. అందులోకి ప్రవేశించిన వ్యక్తులు ఇతరులను లోపలికి రానివ్వరు. అయితే ప్రభుత్వాలు మరిన్ని వెనకబడిన తరగతులను గుర్తించాలి. రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిన వ్యక్తులు ఉన్నారు. వారు రిజర్వేషన్ ప్రయోజనం ఎందుకు పొందకూడదు..? కొన్ని కుటుంబాలు, సమూహాలు మాత్రమే ప్రయోజనం పొందుతున్నాయి అని ఆయన అన్నారు.

# ఎన్‌కౌంటర్‌లో మహిళా మావోయిస్టు మృతి

**ముమ్మరంగా కూంబింగ్**
**పేలుడు పదార్థాలతో**
**ఆరుగురు జవాన్లకు గాయాలు**

**ప్రజాపక్షం/భద్రాచలం:** ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాలో పోలీసులకుమావోయిస్టుల నడుమ చోటు చేసుకున్న ఎదురుకాల్పుల్లో ఓ మహిళా మావోయిస్టు మృతి చెందినట్లు ఆ రాష్ట్ర పోలీస్ ఉన్నతాధితారి సుందర్ రాజన్ వెల్లడించారు. ఛత్తీస్‌గఢ్ తెలంగాణ కర్రెగుట్టల చుట్టు ఉన్న అడవిలో ఈ కాల్పులు చోటు చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. గత నెల 21వ తేది నుండి కర్రెగుట్టల సమీపంలో 24వేల మంది సిబ్బందితో కూంబింగ్ ఆపరేషన్ ప్రారంభించిన నాటి నుండి ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో నలుగురు మహిలా మావోయిస్టుల మృతదేహాలు స్వాదీనం చేసుకున్నట్లు ఆయన చెప్పారు. ఈ ఎన్‌కౌంటర్‌లో జరిగిన ప్రదేశం నుండి ఏ303 రైఫిల్‌తో పాటు ఇతర పేలుడు పదార్థాలు స్వాదీనం చేసుకున్నట్లు సుందరాజన్ చెప్పారు. గత నెల 24న కర్రెగుట్టలపై ముగ్గురు మహిళా మావోయిస్టుల్లు హతమైన విషయం విధితమే. ఆ సమయంలో తుపాకులు, భారీగా పేలుడు పదార్థాలతో పాటు ఇతర సామాగ్రిని కూడా స్వాదీనం చేసుకున్నారు. బస్తర్ ప్రాంతంలో ప్రారంభించిన మావోయిస్టు వ్యతిరేక చర్యల్లో కర్రెగుట్టల ఆపరేషనే అతిపెద్ద ఆపరేషన్ కావడం విశేషం. ఈ కూంబింగ్ ఆపరేషన్‌లో డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్స్, బస్తర్ ఫైటర్స్, స్పెషల్ టాస్క్ ఫోర్స్, అన్ని విభాగాలకు చెందిన ఛత్తీస్‌గఢ్ పోలీసులు పాల్గొంచుకుంటున్నారు. మావోయిస్టు సీనియర్ నాయకులు, మోస్ట్ వాంటెడ్ మావోయిస్టులు ఈ ప్రాంతంలో తలదాచుకున్నారనే పక్కా సమాచారం ఉండటంతో కట్టుదిట్టమైన ఆపరేషన్ ప్రారంభించారు. మావోయిస్టులకు అత్యంత సేఫ్ జోన్‌గా ఉన్న 90 కి.మీ వైశాల్యంలో గల కర్రెగుట్టలు ఇప్పుడు భద్రతా బలగాల ఆదీనంలో ఉన్నాయి. వందలాది మందికి మావోయిస్టులు తమకు అనుకూలంగా మలుచుకున్న ప్రాంతాలు బంకర్లను భద్రతా బలగాలు ధ్వసం చేశాయి. పేలుడు పదార్థాలు, డిటోనేటర్లు, ఆహార పదార్థాలు, నిత్యవసరాలు, ఇతర వస్తువులు కూడా స్వాదీనం చేసున్నారు. ప్రేజర్ బాంబులు, ఐఇడి బాంబులు మూలంగా ఆరుగురు భద్రతా బలగాలు గాయాలపాలయ్యారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో జరిగిన ఎదురు కాల్పుల్లో 146 మంది మావోయిస్టులు హతం కాగా, అందులో 129 మంది బీజాపూర్‌తో సహా ఏడు జిల్లాలతో కూడిన బస్తర్ డివిజన్ వ్యాప్తంగా మృతి చెందారు.




### ఛత్తీస్‌గఢ్‌లో ఉప సర్పంచ్‌ను హత్య చేసిన మావోయిస్టులు

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో ఉప సర్పంచ్‌ను మావోయిస్టులు కిరాతకంగా హత్య చేసినట్లు ఆరాష్ట్ర పోలీస్ ఉన్నతాధికారులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం సమయంలో జగుర్గుండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెన్‌పల్లి గ్రామంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ప్రాథమిక సమాచారం ప్రకారం, తరగూడ గ్రామ పంచాయితీ ఉప సర్పంచ్ ముచాకి రామ ఇంటికి వెళ్లిన సాయుధ మావోయిస్టులు మాట్లాడే పని ఉంది రమ్మని వారి వెంట తీసుకెళ్లారు. ఎంతకి అతను ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆ ప్రాంతంలో గాలింపుచర్యలు చేపట్టారు. ఈ క్రమంలో మృతదేహం లభ్యమైంది. ఆ మృతదేహాన్ని స్వాదీనం చేసుకున్న పోలీసులు పోస్టుమార్టం నిర్వహించారు. ఈ ఏడాది బస్తర్ డివిజన్‌లోని వేర్వేరు ప్రాంతాల్లో తొమ్మిది మంది పౌరులను మావోయిస్టులు హత్య చేశారు. గత ఏడాది నుండి ఇప్పటి వరకు వివిధ హింసాత్మక సఘటనల మూలంగా బస్తర్ ప్రాంతంలో 68 మంది పౌరులు మృత్యువాత పడ్డట్లు పోలీసుల రికార్డుల్లో ఉంది.

### లొంగిపోయిన 14 మంది మావోయిస్టులు

ఎస్‌పి రోహిత్ రాజ్ ఎదుట 14 మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ మేరకు ఆయన మంగళవారం పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారిని ప్రవేశ పెట్టి వివరాలు వెల్లడించారు. వివిధ క్యాడర్ల మావోయిస్టులు స్వచ్ఛందంగా లొంగిపోయారు. మావోయిస్టు పార్టీలో కాలం చెల్లిన సిద్ధాంతాలు ఉండటం వల్ల వీటిని గమనించి కొందరు సభ్యులు లొంగిపోయేందుకు వచ్చినట్లు ఆయన చెప్పారు. లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరుపున ఉపాధి అవకాశాలు, సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఉపాధి కోసం దశలవారీగా కూడా ఆర్థిక సహాయం అందించనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది జనవరి నుండి ఇప్పటి వరకు 257 మంది వివిధ హోదాల్లో ఉన్న మావోయిస్టు సభ్యులు లొంగిపోయారని, గత కొంత కాలంగా సిపిఐ మావోయిస్టు పర్టీ ఆదివాసీ ప్రజల్లో ఆదరణ,నమ్మకం కోల్పోయిందని చెప్పారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందితో తమతో పాటు తమ క్రింది తరం వారికి కూడా మనుగడ ఉందని వారు బలంగా నమ్మడం మూలంగానే లొంగుబాట పట్టినట్లు ఎస్పి వెల్లడించారు. మావోయిస్టు నాయకుల దశ్చర్యలతో ఆదివాసీ ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారని, పోలీస్ ఇన్‌ఫార్మర్లతో పేరుతో కొందరు అమాయక ఆదివాసీలను మావోయిస్టు చంపుతున్నారని చెప్పారు. ఇప్పటికైనా అడవిలో ఉన్న మావోయిస్టులు జన జీవన స్రవంతి లోనికి రావాలని, లొంగిపోయిన వారికి ప్రభుత్వం తరుపు నుండి పునరావాసం కల్పిస్తామని చెప్పారు. ఈ విలేకరుల సమావేశంలో పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సిజెఐ సంజీవ్ ఖన్నాకు రూ.55.75 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్లు

**జడ్జీల ఆస్తుల వివరాలు**
**సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో**

**న్యూఢిల్లీ :** న్యాయవ్యవస్థలో పారదర్శకతను పెంపొందించే చర్యల్లో భాగంగా.. జడ్జీల ఆస్తుల వివరాలను సుప్రీంకోర్టు వెల్లడించింది. న్యాయమూర్తులు స్వయంగా అందజేసిన ఆస్తుల వివరాలను సర్వోన్నత న్యాయస్థానం తన వెబ్‌సైట్;లో ఉంచినట్లు వెల్లడించింది. దీని ప్రకారం.. వారి ఆస్తుల వివరాలు చూస్తే... సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నాకు రూ.55.75 లక్షల ఫిక్స్‌డ్ డిపాజిట్, రూ.14,000 విలువైన షేర్లు, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్‌లో రూ.1.06 కోట్లు, రూ.1.2 కోట్ల జనరల్ ప్రావిడెంట్‌ఫండ్, రూ.29,625 ఎల్‌ఐసి మనీ బ్యాక్ పాలసీ వార్షిక ప్రీమియం, దక్షిణ ఢిల్లీలో ఫ్లాట్, కామన్వెల్త్ గేమ్స్ విలేజ్‌లో 2,446 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఓ అపార్ట్‌మెంట్, హిమాచల్ ప్రదేశ్‌లోని డల్హౌసీలో ఇల్లు ఉన్నాయి. చరాస్తుల్లో 250 గ్రాముల బంగారం, 2 కిలోల వెండి, మారుతి స్విఫ్ట్ కారు ఉన్నాయి. తదుపరి సిజెఐగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ బి.ఆర్. గవాయ్‌కి బ్యాంకులో రూ.19.63 లక్షల నగదు, రూ.5.25 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, మహారాష్ట్రలోని అమరావతిలో తన తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన ఇల్లు, ముంబయిలోని బాంద్రా, ఢిల్లీలోని డిఫెన్స్ కాలనీల్లో అపార్ట్‌మెంట్‌లు, వ్యవసాయ భూములు ఉన్నాయి. ఆయన సతీమణి వద్ద రూ.29.70 లక్షల విలువైన ఆభరణాలు, రూ.61,320 నగదు డిపాజిట్ ఉన్నాయి. ఈ ఏడాది నవంబర్ 24న భారత ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించనున్న జస్టిస్ సూర్యకాంత్‌కు చండీగఢ్‌లో ఒక ఇల్లు, పంచకులలో 13 ఎకరాల వ్యవసాయ భూమి, గురుగ్రామ్‌లో ఇంటిస్థలం, రూ.4.11 కోట్ల విలువైన స్థిర డిపాజిట్లు, 100 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలు, మూడు విలువైన గడియారాలు ఉన్నాయి. జస్టిస్ కేవీ విశ్వనాథన్‌కు రూ.120 కోట్లకు పైగా పెట్టుబడులు, ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ డెవలప్‌మెంట్ ఏరియా, గుల్ మోహర్ పార్క్‌లో పలు ఆస్తులు, తమిళనాడులోని కోయంబత్తూరులో ఒక అపార్ట్‌మెంట్ ఉన్నాయి. 2010–11 నుంచి 2024 25 వరకు ఉన్న రూ.91.47 కోట్లకు పైగా ఆదాయపు పన్ను వివరాలను ప్రకటించారు. వెబ్‌సైట్‌లో న్యాయమూర్తుల ఆస్తుల ప్రకటనే కాకుండా హైకోర్టులు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల ఎంపిక ప్రక్రియ, హైకోర్టు కొలీజియానికి అప్పగించిన బాధ్యతల వివరాలు సహా ఇతర సమాచారాన్ని ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది. ఢిల్లీ హైకోర్టు జడ్జిగా విధులు నిర్వహించిన జస్టిస్ యశ్వంత్ వర్మ అధికారిక నివాసంలో ఇటీవల భారీ మొత్తంలో నగదు లభ్యమైందన్న ఆరోపణలు న్యాయవ్యవస్థ విశ్వసనీయతపై అనుమానాలు రేపిన నేపథ్యంలో న్యాయమూర్తులు ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.


**BEFORE THE CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS,**
**AT: KARIMNAGAR**
**A.R.B. NO. 865 OF 2024**
Between
**SHRIRAM CHITS INDIA PVT. LTD, Branch: JAMMIKUNTA.** ....Disputant
AND
**M.PRAVEEN & OTHERS** ...Opponents
TO
3. Palapu Sravankumar, S/o, Rajesham Age: 30 yrs, Occu: Trackman/SCR/, R/o: H.No: 2-168, Kothapalli, Jammikunta.
Take notice that the above Dispute is filed against you and others, for recovery of money, summon were issued an you, but you failed to receive the same, The above dispute is posted on **27.05.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 A.M.** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR DEPUTY REGISTRAR OF CHITS KARIMNAGAR**

**BEFORE THE CHIT ARBITRATOR/DEPUTY REGISTRAR OF CHITS,**
**AT:: KARIMNAGAR**
**A.R.B. NO. 861 OF 2024**
Between :
**SHRIRAM CHITS INDIA PVT. LTD, Branch JAMMIKUNTA** ....Disputant
AND
**M.SHIVAKUMAR & OTHERS** ...Opponents
TO,
3. Thippani Ramakrishna, S/o, Mondaiah Age: 36 yrs, Occu: General Mazdur/SCCI/Srirampur R/o: Q.No: KD-579, Krishna Colony, Sriampur Colony, Mdl: Naspur, Manicherial.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **27.05.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 A.M**. before the Deputy Registrar referred above other wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR DEPUTY REGISTRAR OF CHITS KARIMNAGAR**

**BEFORE THE CHIT ARBITRATOR/DEPUTY REGISTRAR OF CHITS,**
**AT:: KARIMNAGAR**
**A.R.B. NO. 862 OF 2024**
Between ::
**SHRIRAM CHITS INDIA PVT. LTD, Branch: JAMMIKUNTA,** ....Disputant
AND
**V.SANTHOSH & OTHERS** ....Opponents
TO,
1. Vijayagiri Santhosh, S/o, Sudhakar, Age:36 yrs, Occu: Business. R/o: H.No:1-19, Kothapally, Jammikunta.
3. Muppu Rajeshkumar,S/o, Saraiah Age:31 yrs, Occu:Jr.Asst.ZPP Peddapally, R/o: H.No: 8-9, Maruthinagar, Huzurabad.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **27.05.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 A.M.** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR DEPUTY REGISTRAR OF CHITS KARIMNAGAR**

**BEFORE THE CHIT ARBITRATOR/DEPUTY REGISTRAR OF CHITS,**
**AT:: KARIMNAGAR**
**A.R.B. NO. 863 OF 2024**
Between :
**SHRIRAM CHITS INDIA PVT. LTD, Branch: JAMMIKUNTA.** ....Disputant
AND
**V.CHANDRIKA & OTHERS** ...Opponents
TO,
1. Vodnala Chandrika, W/o, Vijay, Age: 38 yrs, Occu: Business, R/o: H.No: 12-223/1, Kakathiya Colony, Huzurabad.
2. Vodnala Vijay,S/o, Ramakrishna, Age: 44 yrs, Occu: Business, R/o: H.No:: 12-12, Surper bazaar, Huzurabad.
4. Vodnala Harikrishna, S/o, Srinivas, Age:33 yrs, Occu: Police Constable R/o: H.No: 3-96, Thadikal, Shankarpatnam.
5. Ajju Venu, S/o, Rajaiah, Age:44 yrs, Occu: Jr.Asst.Addl Civil Court R/o: H.No: 21-235, Gandhinagar, Huzurabad.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **27.05.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 A.M.** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR DEPUTY REGISTRAR OF CHITS KARIMNAGAR**

**BEFORE THE CHIT ARBITRATOR / DEPUTY REGISTRAR OF CHITS,**
**AT:: KARIMNAGAR**
**A.R.B. NO. 864 OF 2024**
Between :
**SHRIRAM CHITS INDIA PVT. LTD, Branch: JAMMIKUNTA.** ...Disputant
AND
**G.NAGARAJU & OTHERS** .....Opponents
2. Uppula Rajender, S/o, Ellareddy, Age: 44 yrs, Occu: School Asst ZPHS Tharupally. R/o: H.No: 9-1-62/B, Emplyee Colony, Jammikunta.
Take notice that the above Dispute is filed against you and others for recovery of money, summon were issued on you, but you failed to receive the same, The above dispute is posted on **27.05.2025** for your appearance. On that day you have you appear in person at **11-00 A.M.** before the Deputy Registrar referred above other-wise the case will be decided ex-parte.
**CHIT ARBITRATOR DEPUTY REGISTRAR OF CHITS KARIMNAGAR**



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వ కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20న ఇందిరా పార్క్ వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నా కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐటియుసి అనుబంధం) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా కోరారు. ఈ సందర్భంగా మంగళవారం జరిగిన సమావేశంలో రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో వివిధ భాగాల్లో 78 క్యాడర్స్‌లో పనిచేస్తున్న 17,541 ఉద్యోగులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జాతీయ ఆరోగ్య మిషన్ ఆల్ క్యాడర్స్ ఉద్యోగుల సమస్యల శాశ్వత పరిష్కారం కోసం హాజరుకావాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఎస్.ఆర్.ఆర్.తోట నర్సింగ్ ఆఫీసర్లు మంజుల, గుడికందుల వాణి ,ల్యాబ్ టెక్నీషియన్ మౌనిక , ఎఎన్ఎంలు నర్మదా, అనిత రాజేశ్వరి, సపోర్టింగ్ స్టాఫ్ కృష్ణవేణి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## రాష్ట్రవ్యాప్తంగా పలు మార్కెట్లలో ఆకస్మిక తనిఖీలు

### ఎఫ్‌ఎస్‌ఎస్‌ఐ, మార్కెటింగ్ శాఖ అధికారుల నేతృత్వంలో జరిగిన ఆకస్మిక తనిఖీలు

ప్రజాపక్షం/హైదరాబాద్: మామిడి పండ్లలో రసాయనాల వినియోగాన్ని నిరోధించేందుకు వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా అకస్మాత్తు తనిఖీలు నిర్వహించారు. ఫలాల పక్వానికి కార్బైడ్ వంటివి ఉపయోగిస్తే ప్రజలకు ఆరోగ్యపరమైన ప్రమాదాలు ఏర్పడతాయని, ఎలాంటి నిబంధనల ఉల్లంఘనైనా ప్రభుత్వం తీవ్రంగా తీసుకుంటుందని, భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా నిరంతర తనిఖీలు కొనసాగుతాయని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాల మేరకు వరంగల్‌లో 5 చోట్ల, బాటసింగారం (గడ్డిఅన్నారం)లో 7 చోట్ల, జగిత్యాలలో 10 చోట్ల, హైదరాబాద్ (జాంబాగ్)లో పలు చోట్ల అధికారులు ఈ తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో కార్బైడ్ వంటివి వాడకపోయినా, పలు చోట్ల ఎథిలిన్ సాచెట్లను మోతాదుకు మించి వాడుతున్నట్లు గుర్తించారు. ఎథిలిన్ సాచెట్లు నేరుగా పండ్లకు తగిలే విధంగా ఉంచడం గుర్తించి, అలాంటి పండ్లను సీజ్ చేసి ప్రివెంటివ్ మెడిసిన్ సంస్థ (ఐపిఎం)కు పరీక్ష కోసం పంపించారు. ఆ సంస్థ పంపించే రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోనున్నట్లు మంత్రి తెలిపారు. ఇలాంటి ఆకస్మిక తనిఖీలు ప్రతి వారం ఉంటాయని ఆయన పేర్కొన్నారు. కేవలం మార్కెట్లలో మాత్రమే కాకుండా పండ్లను అమ్మే చోట్ల కూడా ఈ తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు. ట్రేడర్లందరూ ఎఫ్‌ఎస్‌ఎస్‌ఎఐ లైసెన్స్ పొంది, ప్రమాణాలు పాటించాలని మంత్రి సూచించారు. హానికరమైన రసాయనాలు వాడకుండా ఉండాలని, ఎవరైనా కార్బైడ్ వంటి హానికరమైన రసాయనాలు వాడినట్టు తేలితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని మంత్రి హెచ్చరించారు.

## వెంకటేశ్ ప్రసాద్ నియామకం చెల్లదు

### హైకోర్టు ఉత్తర్వులు

ప్రజాపక్షం/హైదరాబాద్: క్రికెట్ ఆపరేషన్స్ అండ్ గేమ్ డెవలప్‌మెంట్ కన్సల్టెంట్‌గా భారత మాజీ క్రికెటర్ బీకే వెంకటేశ్ ప్రసాద్, కోచ్, స్టాఫ్ నియామకం చెల్లదని హైకోర్టు ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. మొత్తం 10 మంది నియామకాలను పక్కకు పెట్టింది. హైదరాబాద్ క్రికెట్ అకాడమీ ఆఫ్ ఎక్సలెన్స్(హెచ్‌సీఏఈ) రూల్స్‌కు వ్యతిరేకంగా హెచ్‌సీఏ నియామకాలు చేసిందంటూ హెచ్‌సీఏ ఉపాధ్యక్షుడు సర్దార్ దల్జీత్‌సింగ్, జాయింట్ సెక్రటరీ టి.బసవరాజు ఇతరులు హైకోర్టులో సవాల్ చేశారు. హెచ్‌సీఏ చట్టాలు, నిబంధనలకు విరుద్ధంగా నియామకాలు జరిగాయని, వీటిని నిలిపివేయాలని కోరారు. అపెక్స్ కౌన్సిల్ ఆమోదం లేకుండానే పలువురితో ఒప్పందం కుదుర్చుకున్నారని, ప్రసాద్‌కు ఏటా రూ.75 లక్షల వేతనం ఇచ్చేలా అగ్రిమెంట్ చేసుకున్నారన్నారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ నగేశ్ భీమపాక విచారణ పూర్తి చేసి, వెంకటేశ్‌ప్రసాద్, హిమానీ యాదవ్, మమత, అర్జున్, రాజశేఖర్ తదితరుల నియామకాలు చెల్లవని ఉత్తర్వులు జారీ చేశారు. వారికి హెచ్‌సీఏ నుంచి చెల్లించిన గౌరవ వేతనాన్ని నియామకానికి బాధ్యులైన హెచ్‌సీఏ ప్రసిడెంట్, సెక్రటరీ, ట్రెజరర్, ఈసీవోల వ్యక్తిగత ఖాతాల నుంచి రికవరీ చేయాలని హెచ్‌సీఏను ఆదేశించారు.

## ఆర్‌టిసికి ‘బస్సు సర్వీసు’ డబ్బులను అందజేసిన బిఆర్‌ఎస్



ప్రజాపక్షం/హైదరాబాద్: ‘బిఆర్‌ఎస్ రజతోత్సవ సభ’కు బస్సు సర్వీసులను అందించినందుకు తెలంగాణ ఆర్‌టిసికి చెల్లించాల్సిన మొత్తం రూ.9.55కోట్లను బిఆర్‌ఎస్ మంగళవారం చెల్లించింది. ఇది వరకే బిఆర్‌ఎస్ అడ్వాన్స్‌గా రూ.8కోట్లను చెల్లించగా, మిగిలిన రూ.1,55,46,570లను ఆర్‌టిసి భవన్‌లో టిఎస్‌ఆర్‌టిసి ఇడికి చెల్లించారు. ఈ మేరకు బిఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి రావుల చంద్రశేఖర్ రెడ్డి ,బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర అధ్యక్షులు గెల్లు శ్రీనివాస్ యాదవ్,బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు కురువ విజయ్ కుమార్, విద్యాసాగర్, కిషోర్ గౌడ్, బిఆర్‌ఎస్‌వి రాష్ట్ర ఉపాధ్యక్షులు తుంగ బాలు చెక్‌ను మంగళవారం అందజేశారు.

## కాలేజీలకు సెలవు అమలు చేయాలి

ప్రజాపక్షం/హైదరాబాద్: స్టేట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ విడుదల చేసిన వార్షిక క్యాలెండ్‌లో పేర్కొన్న విధంగా ప్రైవేట్ కాలేజీల్లో సెలవు దినాలు అమలు చేసేలా ఆఫీసర్లకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. హైదరాబాద్‌కు చెందిన బందెల క్రాంతికుమార్ అనే వ్యక్తి వేసిన పిల్‌ను బుధవారం హైకోర్టు విచారణ చేసే అవకాశముంది. ఆదివారాలు, ఫెస్టివల్స్ వంటి హాలిడేస్‌లో ఫిజికల్, వర్చువల్ విధానంలో ప్రై వేట్ కాలేజీలు తరగతులను నిర్వహిస్తున్నాయని, ఒత్తిడికి గురైన విద్యార్థుల ఆరోగ్యం దెబ్బతింటోందని, ఆత్మహత్యలు చేసుకునే ప్రమాదం ఉందని పిల్‌లో పేర్కొన్నారు. తనిఖీలు చేయాల్సిన సంబంధిత ఆఫీసర్లు చర్యలు తీసుకోవడం లేదని, కొందరు ఆఫీసర్లు ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలకు మద్దతుగా ఉంటున్నారని పేర్కొన్నారు.

## మిస్ వరల్డ్ కేవలం అందాల పోటీ కాదు...
# సానుభూతి, సంస్కృతి, సాధికారతకు వేదిక

### మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్ పర్సన్, సిఈఓ జూలియా మోర్లీ



ప్రజాపక్షం/హైదరాబాద్: ‘‘మిస్ వరల్డ్ అనేది కేవలం అందాల పోటీ కాదు. ఇది ప్రపంచవ్యాప్తంగా సానుభూతి, సంస్కృతి, సాధికారతకు వేదిక’’ అని మిస్ వరల్డ్ లిమిటెడ్ చైర్ పర్సన్, సిఈఓ జూలియా మోర్లీ అన్నారు. తెలంగాణలోని అద్భుతమైన ప్రకృతి దృశ్యాలు, సంస్కృతి, సంప్రదాయాలు, ఆధునిక దృక్పథం ఈ గ్లోబల్ యూనిటీ వేడుకలకు సరైన వేదికని ఆమె పేర్కొన్నారు. హైదరాబాద్‌లో నెల 10వ తేదీ నుంచి 72వ మిస్ వరల్డ్ పోటీలు జరగనున్న నేపథ్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జూలియా మోర్లీ, తెలంగాణ రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, టిజిటిడిసి చైర్మన్ పటేల్ రమేశ్ రెడ్డి, మిస్ ఇండియా నందిని గుప్తా, సినీ నటుడు సోనూ సూద్ తదితరులు ప్రసంగించారు. జూలియా మోర్లీ మాట్లాడుతూ తాము ప్రపంచాన్ని తెలంగాణకు తీసుకురావడం ద్వారా దీర్ఘకాలిక ప్రభావాన్ని సృష్టించడానికి ఉత్సాహంగా ఉన్నామన్నారు. తెలంగాణ అనేది పురాతన సంప్రదాయాలు, ఆధునిక ఆకాంక్షలు సమ్మిళితమైన ప్రదేశమన్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీలు మహిళల సౌందర్యాన్ని సెలబ్రేట్ చేయడమే కాకుండా, మహిళా సాధికారతకు ప్రతీకగా నిలుస్తాయన్నారు. ఈ పోటీల ద్వారా ప్రపంచ పర్యాటకులను ఆకర్షించగలమని, రాష్ట్రానికి నిరంతరంగా పర్యాటక రంగంలో ఆదాయం పెరుగుతుందని తెలిపారు. మిస్ వరల్డ్ పోటీల నిర్వహణకు రూ.54 కోట్లు పెట్టుబడి పెట్టామని, ఇందులో సగం ప్రభుత్వ నిధులు, మిగిలిన సగం ప్రైవేట్ ప్రమోటర్ల నుంచి సేకరిస్తామని తెలిపారు. ఈ పోటీల ద్వారా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, పర్యాటక ప్రదేశాలు ప్రపంచానికి పరిచయం అవుతాయని, రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌ను పెంచుతుందని మంత్రి అభిప్రాయపడ్డారు. ఈ ఈవెంట్ ద్వారా నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు, ప్రపంచ స్థాయి పెట్టుబడులు ఆకర్షించేందుకు అవకాశం ఉందని తెలిపారు. మిస్ వరల్డ్–2025 పోటీలలో సుమారు 140 దేశాలకు చెందిన అందాల భామలు పాల్గొననున్నారని వివరించారు. జయేష్ రంజన్ మాట్లాడుతూ మిస్ వరల్డ్ పోటీలు వివిఐపిల కోసం మాత్రమే కాదు, సామాన్యులు కూడా రావొచ్చన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న ‘‘మిస్ వరల్డ్’’ పోటీలు ఈ నెల మే 10న ఆఫిషియల్‌గా ప్రారంభం అవుతాయని, ఆసక్తి ఉన్నవారు టూరిజం వెబ్ సైట్‌లో రిజిస్టర్ చేసుకుని పాస్ తీసుకోవాలని ఆయన సూచించారు. తెలంగాణ ఫుడ్, కల్చర్, హాస్పిటాలిటీని ప్రపంచవ్యాప్తంగా చాటి చెప్పబోతున్నామని, మన టూరిజం మరింత అభివృద్ధి చెందుతుందని జయేష్ రంజన్ వివరించారు. స్మితా సబర్వాల్ బదిలీపై ఆయన స్పందిస్తూ ‘స్మితా సబర్వాల్ బాగా పని చేశారు. కానీ ఆమె లేనంత మాత్రాన ఈవెంట్లు ఆగిపోవు. నాకు అనేక అంతర్జాతీయ ఈవెంట్లు నిర్వహించిన అనుభవం ఉంది’ అని వ్యాఖ్యానించారు.

## మిస్ వరల్డ్ పోటీ అతిథులకు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలకాలి


### శంషాబాద్ విమానాశ్రయంలో స్వాగత ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి జూపల్లి కృష్ణారావు



ప్రజాపక్షం/హైదరాబాద్: మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చే అతిథులకు విమానాశ్రయంలో తెలంగాణ సాంప్రదాయ పద్ధతిలో ఆహ్వానం పలకాలని, ఇక్కడి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధికారులను ఆదేశించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మంగళవారం శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని సందర్శించి మిస్ వరల్డ్ వేడుకలకు వచ్చే సుందరీమణులు, ప్రతినిధులు, ఇతర అతిథులకు స్వాగత, సత్కారాల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. జిఎంఆర్ ప్యాసెంజర్ ఎక్స్‌పీరియన్స్, పర్యాటక శాఖ, కస్టమ్స్, ఇమ్మిగ్రేషన్, సిఐఎస్‌ఎఫ్ అధికారులతో సమీక్షించారు. విమానాశ్రయాన్ని మరింత అందంగా ముస్తాబు చేయాలని, పూలు, మామిడి, అరటి తోరణాలతో సుందరంగా అలంకరించాలని సూచించారు. ఇమ్మిగ్రేషన్, కస్టమ్స్ క్లియరెన్స్‌ను త్వరగా పూర్తి చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. స్వాగత బృందాల సంఖ్యను పెంచాలని, అడుగడుగునా తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని తెలిపారు. అదే సమయంలో ఎయిర్‌పోర్ట్‌కు విచ్చేసిన మిస్ ఇండియా నందిని గుప్తా, మిస్ మెక్సికో మార్లే లీల్ సర్వాంతేస్ తో భేటీ అయ్యారు. తెలంగాణలోని వారసత్వ, చారిత్రక కట్టడాలను సందర్శించాలని వారిని కోరారు.

# ప్రజలకు సిఎం క్షమాపణలు చెప్పాలి

### బిజెపి ఎంపి ఈటల రాజేందర్



ప్రజాపక్షం/హైదరాబాద్ : పరిపాలన చేతకాకపోతే ముక్కు నెలకు రాసి, తెలంగాణ ప్రజలకు క్షమాపణలు చెప్పి ముఖ్యమంత్రి పదవికి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణ దివాలా తిసిన రాష్ట్రమని, ప్రజల ఆత్మస్థైయిర్యాన్ని దెబ్బతియొద్దన్నారు. హైదరాబాద్ నాంపల్లి బీజెపి రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ ఎన్నడూ పేద రాష్ట్రం కాదని, నాయకులు వెనుకబడేసిన ప్రాంతమని అన్నారు. స్వాతంత్ర్యానికి పూర్వమే ఈ ప్రాంతంలో రైల్వే, విద్యుత్, టెలిఫోన్ సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ఒక వ్యక్తిని, ఒక పార్టీని దోషిగా నిలబెట్టేందుకు తెలంగాణను దివాలా రాష్ట్రంగా చూపొద్దన్నారు. తెలంగాణ దివాలా తిసిన రాష్ట్రమని సిఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం సరికాదన్నారు. ధాన్యం దిగుబడది, జిఎస్‌గడిపి, వృద్ధిరేటు, అత్యధిక బడ్జెట్‌లలో అగ్రస్థానంలో ఉన్న రాష్ట్రం తెలంగాణ అన్నారు. కొత్త రాష్ట్రమే అయినా తడబాటు లేకుండా గొప్పగా పురోగమిస్తుందన్నారు. 2014లోనే తెలంగాణ సొంత పన్నుల ఆదాయం రూ.29 వేల కోట్లు అని, ఏటా రూ.5 వేల కోట్ల నుంచి రూ.10 వేల కోట్ల ఆదాయం పెరుగుతు వచ్చిందన్నారు. 2023–24లో రూ.1.19 లక్షల కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. పన్నేతర ఆదాయం కూడా 2014లో రూ.6 వేల కోట్లు, 2023–24లో రూ.20 వేల కోట్లు ఉందన్నారు. కేంద్రం పంపిణి చేసే పన్నుల ఆదాయం కూడా క్రమంగా పెరుగుతోందన్నారు. పాలనలో విఫలమైనందున సిఎం పదవికి రాజీనామా చేయాలని, లేదు సిగ్గుమాలిన పద్ధతిలో కొనసాగుతా అంటే సందర్భం వచ్చినప్పుడు ప్రజలు కర్రుకాల్చి వాతపెడతారన్నారు. ఈ సమావేశంలో బిజెపి అధికార ప్రతినిధులు గంగపురం వెంకట్ రెడ్డి, కట్ట సుధాకర్ రెడ్డి, ఎస్‌సి మోర్చా అధ్యక్షులు కొండేటి శ్రీధర్, నాయకులు ఆలే భాస్కర్, జన్నపురెడ్డి సురేందర్ రెడ్డి పాల్గొన్నారు.

## తెలంగాణను దోచుకున్న దొంగలు
# బిఆర్‌ఎస్ నేతలు: అద్దంకి



హైదరాబాద్: తెలంగాణ ఆర్థిక పరిస్థితిని నిజాయితీగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరించారని ఎమ్ఎల్‌సి అద్దంకి దయాకర్ తెలిపారు. ఈటల హాఫ్ బిజెపి.. హాఫ్ బిఆర్‌ఎస్ అని దయాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్ చేసిన అప్పులకు నెలకు రూ.7 వేల కోట్లు కట్టాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. తెలంగాణను దోచుకున్న దొంగలు బిఆర్‌ఎస్ నాయకులని, ఉద్యమం చేస్తున్నట్లు నటించి పార్టీ నిర్మించుకున్నారని అన్నారు. కెసిఆర్ గుణం ఇంకా మారలేదని విమర్శించారు. కెటిఆర్ కాలు విరిగినా ఆయనే ప్రెస్‌మీట్ పెట్టాలా? అని అద్దంకి ప్రశ్నించారు. కెటిఆర్‌ను పైకి తేవడానికి పద్ధతి ప్రకారం కెసిఆర్ ప్లాన్ చేస్తున్నారని, బిఆర్‌ఎస్ రజతోత్సవ సభలో హరీష్ రావు ఫొటో కూడా లేదని ఎద్దేవా చేశారు. హరీష్ రావును కరివేపాకులా పక్కన పెట్టారని అద్దంకి దయాకర్ పేర్కొన్నారు.

## సిమెంట్, స్టీల్‌తో నిర్మించే కట్టడాలను తప్పనిసరిగా..
# ఇంజనీర్లు స్వయంగా పర్యవేక్షించాలి

### ఎస్కి డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్ రావు



ప్రజాపక్షం/హైదరాబాద్ : సిమెంట్, స్టీల్‌తో నిర్మించే గృహ నిర్మాణాలు, అపార్ట్‌మెంట్‌లు కనీసం 30 నుండి 40 ఏళ్ల వరకు ఉండే విధంగా డిజైన్ చేస్తారని, ఇక ఎయిర్ పోర్టులు, సాగునీటి ప్రాజెక్టులు ఓడ రేవులు, రైల్వే నిర్మాణాలు పెద్ద పెద్ద వంతెనలు వందేండ్లకు పైగా ఉండే విధంగా డిజైన్ చేస్తారని, మధ్యలో వీటి నిర్వహణ కోసం మాత్రమే కొంత ఖర్చు చేస్తే అవి శాశ్వతంగా ఉంటాయని ఎస్కి డైరెక్టర్ డాక్టర్ జి. రామేశ్వర్‌రావు అన్నారు. ఎఫెకట్స్ అఫ్ కరోజన్ ఆన్ టిఎంటి బార్స్ అండ్ బిల్డింగ్ స్టక్చర్స్ విషయమై గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ అఫ్ ఇండియాలో మంగళవారం జరిగిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఎస్కి సివిల్ అండ్ ట్రాన్స్ పోర్టేషన్ విభాగం ఏర్పాటు ఈ సెమినార్‌లో నగరంలోని వివిధ కన్‌స్ట్రక్షన్స్ కంపనీలలో పనిచేస్తున్న సుమారు 54 మంది ఇంజనీర్లు పాల్గొన్నారు. రామేశ్వర్ రావు మాట్లాడుతూ దేశంలోని అన్ని ప్రాంతాల్లో పనిచేస్తున్న ఇంజనీర్లకు ఎప్పటికపుడు అప్ డేషన్ శిక్షణ కార్యక్రమాలను తమ శిక్షణ సంస్థ ద్వారా అందిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్కి ఆవిర్భావం నుండి ప్రస్తుతం పనిచేస్తున్న వివిధ డివిజన్లకు సంబంధించి ప్రెసెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా దేవిశ్రీ ఇస్పాత్ లిమిటెడ్ చీఫ్ రాజీవ్ బిష్త్ మాట్లాడుతూ సిమెంట్‌తో నిర్మించే ప్రతి కట్టడం కూడా నమ్మకంగా దృఢంగా ఉంటేగానీ ఎక్కువకాలం పనిచేస్తుంటుందని, ఆయా నిర్మాణాల్లో వాడుతుండే మెటీరియల్‌ని ఇంజనీర్లు స్వయంగా పరిశీలించాలని, లేదంటే జరిగే నష్టానికి వారే బాధ్యులవుతారన్నారు. సమేవేశంలో ప్రొఫెసర్ కె.గణేష్ బాబు, డాక్టర్ వెంకట్ దిలీప్ లు ఫ్యాకల్టీగా వ్యవహరించారు. కార్యక్రమం సిటి విభాగం హెడ్ డాక్టర్ ఆర్.వెంకట్ రెడ్డి, సి.హెచ్. తిలక్, సునీత పర్యవేక్షణలో జరిగింది.

## ఐఐటి ఖరగ్‌పూర్, నీట్ ఔత్సాహిక విద్యార్థుల ఆత్మహత్యలపై...
# ఎఫ్‌ఐఆర్ నమోదయ్యాయా? లేదా?

### సుప్రీంకోర్టు ధర్మాసనం సీరియస్
### తదుపరి విచారణ మే 13కు వాయిదా



న్యూఢిల్లీ : రాజస్థాన్‌లోని కోటాలో ఐఐటి ఖరగ్‌పూర్ విద్యార్థి, కోటాలో నీట్ ఔత్సాహికుడు ఆత్మహత్యలు చేసుకోవడం వెలుగు చూసిన అనంతరం ఎఫ్‌ఐఆర్‌లు నమోదు అయ్యాయా లేదా తెలుసుకోవాలని కోవాలన్న పిటిషన్‌పై మంగళవారం సుప్రీం కోర్టు విచారణ చేపట్టింది. న్యాయమూర్తులు జస్టిస్ జెబి.పార్థివాలా, ఆర్.మహదేవన్‌లతోకూడిన డివిజన్ బెంచ్ తన రిజిస్ట్రీని రెండు ప్రాంతాల నుంచి త్వరగా నివేదికను కోరింది. ఖరగ్‌పూర్‌లో చదువుతున్న 22ఏళ్ల ఐఐటి విద్యార్థి 2025మే 4న తన హాస్టల్ రూమ్‌లో ఉరేసుకుని చనిపోయాడన్న విషయాన్ని సుప్రీం కోర్ట్ ప్రస్తావించింది.మృతుడు మూడేళ్ల సివిల్ ఇంజినీరింగ్ స్టూడెంట్. మదన్‌మోహన్ మాలవ్య హాల్‌లోని ఆయన రూమ్‌లో ఉరేసుకుని చనిపోయిన మృతదేహంకనుగొనబడింది.ఆ విద్యార్థి బిహార్ రాష్ట్రం షియోహర్ జిల్లాకు చెందిన వాడని గుర్తించబడింది’ అని ధర్మాసనం తెలియజేసింది.విద్యార్థి ఆయన మరణానికి ముందు ఢిల్లీలో ఉన్న అతడి స్నేహితుడికి వీడియో కాల్‌చేశాడు. విద్యార్థుల దురదృష్టకరమైన ఆత్మహత్యలలో ఇది ఒకటి.పలు సమస్యలకు సంబంధించి విద్యార్థుల ఆత్మహత్యలపై పనిచేసేందుకు మనం టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేశాం.అత్యున్నత విద్యాసంస్థలలో విద్యార్థులమానసిక ఆరోగ్యం సమస్యలను పరిష్కరించే విషయమై అత్యున్నత న్యాయస్థానం మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.రవీంద్ర భట్ అధ్యక్షతన ఒక జాతీయ స్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని గతంలో ఆదేశాలు జారీ చేసింది. ఖరగ్‌పూర్ ఐఐటి మేనేజ్‌మెంట్ లేదా పరిపాలనా యంత్రాంగం మునుపటి ఆదేశాల మేరకు ఆ విద్యార్థి ఆత్మహత్య విషయమై స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారా? లేదా అనే విషయాన్ని నిర్ధారించడానికి ఈ విషయాన్ని పరిగణనలోనికి తీసుకుంటున్నట్లు ధర్మాసనం తెలిపింది. అలాగే మరో ఆత్మహత్య కేసును ప్రస్తావిస్తూ... నగరంలోని పర్వవనాథ్ ఏరియాలోని తన గదిలో నీట్ (ఎన్ఇఇటి) ఔత్సాహికుడు మే 11న నేషనల్ మెడికల్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్ షెడ్యూల్‌కు ముందు ఆత్మహత్య చేసుకోవడాన్ని కూడా పరిగణనలోనికి తీసుకుంది. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని షియోపూర్‌కు చెందిన 18 ఏళ్ల విద్యార్థిని గత కొన్ని సంవత్సరాలుగా తన కుటుంబ సభ్యులతో రాజస్థాన్ రాష్ట్రం కోటాలో నివసిస్తోంది. అక్కడ ఒక కోచింగ్ సెంటర్‌లో ఆ విద్యార్థిని నీట్‌కు కోచింగ్ తీసుకుంటూ ప్రిపేర్ అవుతోంది’ అని కోర్టు తెలిపింది. 2025లో రాజస్థాన్‌లోని కోటాలో కోచింగ్ స్టూడెంట్ ఆత్మహత్య చేసుకున్న కేసుల్లో ఇది 18వ కేసుగా నమోదై ఉన్న విషయాన్ని ధర్మాసనం గమనించింది.‘2025 జనవరి నుండి కోటాలో కోచింగ్ విద్యార్థుల ఆత్మహత్యలకు సంబంధించి 17 కేసులు గత ఏడాది నమోదు అయ్యాయి. ఈ ఆత్మహత్యకు సంబంధించి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయబడిందా లేదా’ అని బెంచ్ ప్రశ్నించింది. అనంతరం ఈ కేసు విచారణను ధర్మాసనం మే 13కు వాయిదా వేసింది.

## నాలుగురెట్లు పెరిగిన భారత్ తలసరి ఆదాయం!

### మానవాభివృద్ధిలో ర్యాంకు పెంచుకున్న భారత్

న్యూఢిల్లీ: ప్రపంచ మానవాభివృద్ధి సూచిక (హెచ్‌డిఐ)లో భారతదేశం తన ర్యాంకును గతంకంటే పెంచుకుంది. మొత్తం 193 దేశాలలో 2022, 2023 సంవత్సరాలలో 133వ ర్యాంకులో ఉన్న భారతదేశం 130వ ర్యాంకుకు ఎదిగింది. 2022లో 0.676 గా ఉన్న హెచ్‌డిఐ విలువ 2023 నాటికి 0.685 స్థాయికి చేరింది. భారతదేశం మానవ అభివృద్ధి కేటగిరీలో మధ్యస్థస్థాయి నుండి ఉన్నతస్థాయి మానవ అభివృద్ధి (హెచ్‌డిఐ=0.700)కు సన్నిహితంగా వెళుతున్నదని నివేదిక పేర్కొంది. ఆర్థికరంగంలో చూసినప్పుడు తలసరి జాతీయ ఆదాయం నాలుగు రెట్లు పెరిగిందని, 1990లో 2167.22 డాలర్ల నుండి 2023 నాటికి 9046.76 డాలర్లకు తలసరి ఆదాయం పెరిగిందని నివేదిక తెలిపింది. 2015–16, 2019–2021 సంవత్సరాల మధ్యకాలంలో 13.5. కోట్లమంది భారతీయులు బహుముఖ పేదరికం నుండి బయటపడ్డారని నివేదిక పేర్కొంది.

అదేవిధంగా భారతదేశ హెచ్‌డిఐలో అసమానతలు 30.7 శాతానికి తగ్గినప్పటికీ, ఈ ప్రాంతంలో నష్టం చాలా అధికంగా ఉందని నివేదిక పేర్కొంది. ఆరోగ్యం, విద్య వంటి విషయాలలో అసమానతలు తగ్గి మెరుగుదల ఏర్పడిందని, ఆదాయాలు, స్త్రీపురుష అసమానతలు గణనీయంగా పెరిగాయని, మహిళా కార్మికశక్తి భాగస్వామ్యం, రాజకీయ ప్రాతినిధ్యంలో కూడా వెనకబాటుతనం కొనసాగుతున్నదని పేర్కొంది. ఇటీవల పార్లమెంటులో మహిళలకు రిజర్వేషన్లు ఇస్తూ చట్టాన్ని సవరించినప్పటికీ కూడా ఈ అసమానతలు కొనసాగుతున్నాయని నివేదిక పేర్కొంది. అదేవిధంగా భారతదేశంలో జీవన ప్రమాణాలు కూడా కొంతమేరకు పెరిగాయని, 71.7 సంవత్సరాల నుండి 72.0 సంవత్సరాలకు ఈ జీవనం పెరిగిందని పేర్కొంది. పాఠశాలవిద్యలో ప్రత్యేకించి 1990వ దశకం నుండి భారత్‌లో గణనీయమైన ప్రగతి వచ్చిందని నివేదిక ప్రశంసించింది. విద్యాహక్కుచట్టం, సమగ్ర శిక్షా అభియాన్, జాతీయ విద్యావిధానం వంటివి అమలు చేస్తున్నారని పేర్కొంది. ఐతే విద్య నాణ్యత, చదువునేర్చుకునే జ్ఞాన ఫలితాలపై ఇంకా ఎక్కువ దృష్టి కేంద్రీకరించాల్సి ఉందని నివేదిక పేర్కొంది. అదనంగా భారతదేశ స్థూల జాతీయ ఆదాయం తలసరి 2021లో కొనుగోలు శక్తి సమానత్వం 8,475.68 డాలర్ల నుండి 9,046.76 డాలర్లకు పెరిగిందని పేర్కొంది. భారతదేశం తన హెచ్‌డిఐ విలువను 1990 దశంలో ఉన్న 58.6 సంవత్సరాల నుండి 2023 నాటికి 72 సంవత్సరాలకు పెంచుకుందని పేర్కొంది. జాతీయ గ్రామీణ ఆరోగ్య పథకం, ఆయుష్మాన్ భారత్, జననీ సురక్ష యోజన, పోషణ్ అభియాన్ వంటి పథకాల ద్వారా దేశంలో ప్రభుత్వాలు జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను బాగా అమలు చేస్తున్నాయని నివేదిక పేర్కొంది.

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, జనధన్ యోజన, డిజిటల్ ఇన్‌క్లూజన్ వంటి కార్యక్రమాలు భారత్ ఆర్థిక వృద్ధికి, పెట్టుబడుల కార్యక్రమాలకు దోహదం చేస్తున్నాయని పేర్కొంది. పేదరికాన్ని తగ్గించడానికి ఈ పథకాలు దోహదం చేస్తున్నాయని పేర్కొంది.

## జడ్జి పదవి నియామకాలకు ‘కొలీజియం’ ఆమోదించినా...
# వారి సంబంధాల పేరుతో ‘కేంద్రం’ బ్రేక్

### తొలిసారిగా సిఫారసు గణాంకాలు
### ‘సుప్రీం’ డేటా విడుదలలో పెండింగ్ బహిర్గతం

న్యూఢిల్లీ : కొలీజియం సిఫారసు చేసిన న్యాయమూర్తుల పేర్లను, హైకోర్టు లేదా సుప్రీంకోర్టు ప్రస్తుత లేదా విశ్రాంత జడ్జిలతో వారికున్న సంబంధాలను, ప్రభుత్వం ధృవీకరించిన తీర్మానాల సంఖ్యను తొలిసారిగా సుప్రీంకోర్టు ధృవీకరించింది. నవంబరు 9, 2022 నుండి నవంబరు 10, 2024వరకు అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు వెల్లడించిన డేటా ప్రకారం...పూర్వ భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) డివై.చంద్రచూడ్ హయాంలో హైకోర్టు జడ్జిలుగా నియమించేందుకు 303 మంది అభ్యర్థులను సుప్రీంకోర్టు కోలీజియం ఆమోదించినప్పటికీ 170మంది ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించింది. అయితే ఇంకా ప్రభుత్వం వద్ద ఆమోదం కోసం 17 పేర్లు పెండింగ్‌లో ఉన్నాయని డేటా తెలిపింది. సిఫారసు చేసిన 303మంది పేర్లలో 12మంది హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు సంబంధించిన విశ్రాంత జడ్జిలతో సంబంధం ఉన్న పేర్లు కాగా, ఒక పేరు విశ్రాంత, ప్రస్తుత సభ్యుడిగా హైకోర్టు లేదా సుప్రీంకోర్టుకు సేవలు అందిస్తున్న సభ్యుడితో సంబంధాలు కలిగిఉన్న పేరని, దానిని కేంద్రం ఇంకా క్లియర్‌చేయకుండా పెండింగ్‌లో ఉంచిందని డేటా తెలిపింది. 303మంది పేర్లలో ఏడుగురు ఎస్‌సికి చెందిన కేటగిరీ కాగా, ఐదుగురు ఎస్‌టికి చెందిన వారు, 21మంది ఓబిసికి చెందిన వారు, ఏడుగురు బిసికి చెందిన వారు, 28మంది మహిళా కేటగిరీ, 23మంది మైనారిటీ కమ్యూనిటీకి చెందిన వారని తెలిపింది. నవంబరు 11, 2024నుంచి మే 5, 2025వరకు సుప్రీంకోర్టు ప్రదాన న్యాయమూర్తిగా ఉన్నటువంటి సంజీవ్ ఖన్నా హయాంలో అత్యున్నత న్యాయస్థానం కొలీజియం మొత్తం 103మంది అభ్యర్థులను హైకోర్టు జడ్జిషిప్ కోసం సిఫారసు చేయగా అందులో 51మంది పేర్లను ఆమోదించాల్సి ఉందని డేటా తెలియజేసింది. 12పేర్లు ఇప్పటికీ పెండిగ్‌లో ఉన్నాయని డేటా చెబుతోంది. కేవలం ఇద్దరు అభ్యర్థులు మాత్రమే సుప్రీంకోర్టు, హైకోర్టు సిట్టింగ్ జడ్జి లేదా విశ్రాంత జడ్జిలతో సంబంధం ఉన్నవారని తెలిపింది. 103మంది అభ్యర్థులలో ఓబిసికి చెందిన వారు 11మంది ఉన్నారని, ఒకరు ఎస్‌సి, ఇద్దరు ఎస్‌టి, 8మంది మైనారిటీ కమ్యూనిటీ, ఆరుగురు మహిళల కేటగిరీకి చెందిన వారని వివరించింది. నవంబరు 9 2022 నుంచి మే 5,2025వరకు హైకోర్టులో హైకోర్టు న్యాయమూర్తుల కోసం కొలీజియం ఆమోదించిన 221మందిలో, 29మంది అభ్యర్థుల పేర్లు కేంద్రం వద్ద పెండింగ్‌లోనే ఉన్నాయి.ఆ 221మంది అభ్యర్థులలో కేవలం 14మంది హైకోర్టు లేదా సుప్రీంకోర్టులో విశ్రాంత లేదా సిట్టింగ్ జడ్జిలుగా ఉన్నవారితో సంబంధాలు కలిగి ఉన్న వారని డేటా తెలియజేసింది.

## పార్టీ బలోపేతానికి కృషి

**ప్రజాపక్షం/యాచారం :** మండల పరిధిలోని తక్కళ్ళపల్లి తండాకు చెందిన జరుపుల విజయ్ నాయక్ బిజెపి మండల నూతన అధ్యక్షుడిగా నియమితులయ్యారు. నియామక పత్రాన్ని బిజెపి జిల్లా అధ్యక్షులు పంతంగి రాజు భూపాల్ గౌడ్ మంగళవారం విజయ్ నాయక్‌కు అందజేశారు. ఈసందర్భంగా విజయ్‌నాయక్ మాట్లాడుతూ యాచారం మండలంలో బిజెపి బలోపేతానికి తన వంతుగా కృషి చేస్తానని అన్నారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన నాయకులను కలిసి తనకు సహకరించాలని కోరుతానని తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసినందుకు పార్టీ అధిష్టానం గుర్తించి తనకు ఈ పదవి కట్టబెట్టిందని పేర్కొన్నారు. ప్రస్తుతం న్యాయ వాద వృత్తిలో కొనసాగుతున్న తనకు ఈ అవకాశం రావడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. గిరిజన బిడ్డనైన తనకు పార్టీ సరైన గౌరవం ఇచ్చిందన్నారు. 2020 లో పార్టీలో చేరి క్రియాశీల కార్యకర్తగా గుర్తింపు తెచ్చుకున్నానని అన్నారు. జిల్లా, అసెంబ్లి స్థాయిలో లీగల్ సెల్‌లో బాధ్యతలు నిర్వహించానని అన్నారు. వివిధ స్థాయిలలో పార్టీ కోసం పనిచేస్తున్న తనకు బిజెపి మండల నూతన అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన జిల్లా బిజెపి నాయకులకు అయన కృతజ్ఞతలు తెలిపారు.

## ఆధ్యాత్మిక చిహ్నాలు.. ఉర్సుఉత్సవాలు

**ప్రజాపక్షం/షాద్‌నగర్/కొందుర్గు:** ముస్లీంల సంస్కృతి, సంప్రదాయాలతో ఆధ్యాత్మికంగా నిర్వహించే ఉత్సవాలు ఉర్సు ఉత్సవాలని బిఆర్‌ఎస్ యువ నాయకులు వై.రవీందర్ యాదవ్ అన్నారు. మంగళవారం ఫరూఖ్ నగర్ మండల పరిధిలోని ఉప్పరిగడ్డ తాండ గ్రామ పంచాయితి మక్తలో కొనసాగుతున్న ఉర్సు ఉత్సవాలకు హాజరయ్యారు. ఉర్సు ఉత్సవాలను హిందూ, ముస్లీంలు సామరస్యంగా నిర్వహించుకుంటారన్నారు. దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మ ణ్‌నాయక్, సుమిత్రా చందు



నాయక్, వీరేశం గుప్త, మోబిన్ ఘోరి, రవి గౌడ్, నగరం శ్రీను, బాలరాజు, భోజ్యా, జహంగీర్, ఖాజా, అలీం షాష, సత్తార్ షాష పాల్గొన్నారు.

## ఉద్యాన పంటల సాగుతో లాభం




**ప్రజపక్షం/షాద్‌నగర్/కొందుర్గు:** ఉద్యాన పంటల సాగుతో రైతులకు అధిక లాభాలు వస్తాయని అసిస్టెంట్ ప్రొఫెసర్ జె.శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని కిషన్ నగర్‌లోని గ్రామ పంచాయితి ఆవరణలో డాక్టర్ కొండా లక్ష్మ ణ్ ఉద్యాన విశ్వ విద్యాలయం (మోజెర్ల) 2021 బ్యాచ్ విద్యార్థుల ఆధ్వర్యంలో రైతు సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రైతులకు ఉద్యాన పంటల సాగులో మెలకువలు, పంట మార్పిడి పద్ధతులను. చీడపురుగుల నుంచి రక్షణ పొందే విదానాలను వివరించారు. సదస్సులో డాక్టర్ ప్రభావతి, హిమబిందు, పాల్గొన్నారు.

## కాలనీలకు మంచి నీటి సౌకర్యం

ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఎల్‌బి నగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం డివిజన్ పరిధిలోని రోషన్ దౌల కాలనీలకు మంచి నీరు సౌకర్యం కల్పించడానికి హెచ్‌ఎండబ్ల్యూఎస్ అధికారులు చొరవ తీసుకోవాలని ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి హెచ్‌ఎండబ్ల్యూఎస్ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డి కోరారు. మంగళవారం హెచ్‌ఎండబ్ల్యూఎస్ అశోక్‌రెడ్డి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గంలో సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ హస్తినాపురం డివిజన్‌లో చివరమూలన ఉన్న రోషన్ దౌల కాలనీ వాసులకు ఇంటి, ఇంటికి మంచినీటి పైప్ లైన్స్ వేసి వారిని తాగునీరు సౌకర్యం కల్పించాలని కోరారు. శ్రీరమణ కాలనీ, భీమా నగర్, దేవి నగర్‌లో నూతన డ్రైన్స్ నిర్మాణం చేపట్టాలని, చంపాపేట డివిజన్‌లోని కిషన్ కుమార్ ఎంక్లేవ్ నందు నూతన డ్రైన్స్ వ్యవస్థ, మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని కొలన్ శివారెడ్డి కాలనీ కొంతమేర నూతన డ్రైన్స్ వ్యవస్థ యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో మల్లోజు రవి, దొడ్ల ప్రకాశ్, కొలన్ నరేందర్‌రెడ్డి, చంద్రయ్య, తాళ్ల మహేందర్, ఆర్. డేవిడ్, పాండు నాయక్, తిరుపతయ్య, అబ్రహం, ఈశ్వరయ్య, రాధకృష్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## జయంతికుమార్ సేవలు చిరస్మరణీయం




**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ వైదేహి నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శిగా పనిచేసి కాలనీ వాసులకు సేవలు అందించిన జయంతి కుమార్ సేవలు మరువలేమని బిఎన్‌రెడ్డి నగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి తెలిపారు. మంగళవారం వైదేహి నగర్ సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్‌లో ఏర్పాటు చేసిన ఆయన సంతాప సభలో జయంతి కుమార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్. మల్లేశం, వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, యాదగిరిరెడ్డి, జయరామ శర్మ, కోఆర్డినేటర్ కాజగోపాల్, పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రసాయన ఎరువులతో కాలుష్యం



**ప్రజాపక్షం/యాచారం :** రైతులు రసాయానిక ఎరువుల వాడకాన్ని తగ్గించి కాలుష్యాన్ని తగ్గించాలని ఫ్రొఫెసర్ జయ శంకర్ విశ్వవిద్యాలయం శాస్త్ర వేత్త లు డాక్టర్ రాజేశ్వర్‌నాయక్, డాక్టర్ రామకృష్ణ బాబు అన్నారు. మంగళవారం యాచారం మండల పరిధిలోని కోత్తపల్లి గ్రామంలో రైతు మంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి వారు ముఖ్యఅతిధిగా హజరై మాట్లాడారు. తక్కువ యూరియా వాడకం సాగు ఖర్చులను తగ్గించుకొవాలన్నారు.అవసరము మేరకె రసాయనిక ఎరువులను ఉపయోగించి నేల తల్లి అరోగ్యాన్ని కాపాడాలన్నారు. విత్తన రషిదులను భద్రపర్చి కష్టకాలంలో నష్టపరిహరాన్ని పోందాలని కొరారు. సాగునిటిని అదా చేసి భావితరాలకు అందించాలన్నారు. పంట మార్పిడిని పాటించడం ద్వారా సుస్థిర అదాయాన్ని పోందవచ్చునని తెలిపారు. చెట్లను పేంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు కార్యక్రమంలో ఎఈఒ రమేశ్, విద్యార్థులు వైష్ణవి , వ్యవసాయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఎడిఎ రాజరత్నంకు ఘనంగా సన్మానం



**ప్రజాపక్షం/షాద్‌నగర్/కొందుర్గు:** షాద్‌నగర్ వ్యవసాయ శాఖలో ఏడిఏగా పనిచేసి, డిప్యూటీ ప్రాజెక్టు మేనేజర్‌గా పదోన్నతితో నారాయణపేట జిల్లాకు బదిలీపై వెళ్తున్న రాజరత్నంను డీలర్లు, వ్యవసాయాధికారులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాజరత్నం మాట్లాడుతూ తన సేవా కాలంలో సహకరించిన ప్రతిఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా వ్యవసాయాధికారి నర్సింహ్మారావు, మహబూబ్‌నగర్ జిల్లా వ్యవసాయాధికారి వెంకటేష్, మండలాల వ్యవసాయాధికారులు నిశాంత్ కుమార్, రాజేందర్‌రెడ్డి, గోపాల్, సురేష్‌రెడ్డి, శోభ పాల్గొన్నారు.

## మోడల్ రిజర్వాయర్‌గా.. ఉస్మాన్ నగర్ జంట రిజర్వాయర్లు

జలమండలి ఎండి అశోక్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మోడల్ రిజర్వాయర్‌గా ఉస్మాన్ నగర్ జంట రిజర్వాయర్లను తీర్చిదిద్దుతామని జలమండలి ఎండి అశోక్ రెడ్డి అన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో విస్తరించిన గ్రామాలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటి సరఫరా చేసేందుకు జలమండలి చేపట్టిన ఓఆర్‌ఆర్ ప్రాజెక్టు ఫేజ్2, ప్యాకేజీ 2లో ఉన్న పటాన్ చెరు నియోజకవర్గంలోని ఉస్మాన్ నగర్‌లో నిర్మిస్తున్న 4ఎంఎల్, 2ఎంఎల్ సామర్థ్యం కలిగిన జంట రిజర్వాయర్లను ఎం.డి. అశోక్ రెడ్డి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా అశోక్ రెడ్డి మాట్లాడుతూ పటాన్ చెరు నియోజకవర్గంలోని తెల్లాపూర్ మున్సిపాలిటీలో తాగునీటిని ఈ రెండు రిజర్వాయర్ల నుంచి సరఫరా చేస్తామని తెలిపారు. డిస్ట్రిబ్యూషన్ లైన్లు, రిజర్వాయర్ల నిర్మాణం పూర్తయి, ఇప్పటికే రిజర్వాయర్ల ఇన్‌లెట్, అవుట్ లెట్ నిర్మాణం పూర్తి కావడంతో విజయవంతంగా ట్రయల్ రన్ నిర్వహించామన్నారు. ఉస్మాన్ నగర్ రిజర్వాయర్ల సర్వీస్ ఏరియాకు సబంధించిన వాటర్ ఆడిట్‌ను ప్రారంభించామని, ప్రయోగాత్మకంగా ఈ రిజర్వాయర్ల నుంచి సరఫరా చేస్తున్న ప్రతి చుక్కనూ లెక్క కట్టేలాగా ఫ్లో మీటర్‌ను పెట్టి, చివరి వినియోగదారుని వద్ద కూడా మీటర్ రీడింగ్ సరిపోయేలా లెక్క కడితే ట్రాన్స్ మిషన్ లాస్ తెలుస్తాయన్నారు. దాని ద్వారా వృథాగా పోతున్న నీటిని గుర్తించి దాన్ని అరికట్టడానికి



చర్యలు తీసుకునే వేసుబాటు ఉంటుందని వివరించారు. రిజర్వాయర్ల ప్రాంగణాల్లో అహ్లాదకరమైన వాతావరణం కోసం గార్డెనింగ్, ల్యాండ్ స్కేప్ పనులు చేపట్టాలని సూచించారు. రూ.30 కోట్లతో నిర్మిస్తున్న ఈ రెండు రిజర్వాయర్లు అందుబాటులోకి వస్తే, దాదాపు లక్ష మంది జనాభాకు శుద్ధి చేసిన తాగునీరు లభిస్తుందని వివరించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టివి.శ్రీధర్ తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

### ఒఆర్‌ఆర్ ప్రాజెక్టు ఫేజ్ - 2 స్వరూపం..

– ఓఆర్ ఆర్ ఫేజ్ 2 ప్రాజెక్టును మొత్తం రూ.1200 కోట్ల వ్యయంతో చేపట్టగా, కొత్తగా 71 సర్వీసు రిజర్వాయర్లు (140.50 మిలియన్ లీటర్ల సామర్థ్యం), 2758 కిలో మీటర్ల మేర నూతన పైపు లైను నెట్ వర్క్‌ను నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయి రిజర్వాయర్లు అందుబాటులోకి వస్తే మొత్తం 3.6 లక్షల కుటుంబాలు, 25 లక్షల జనాభాకు ప్రయోజనం కలుగుతుంది. ఓవరాల్‌గా ఇందులో 7 మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, 24 గ్రామ పంచాయతీలు లబ్ది పొందుతాయి. దీన్ని రెండు ప్యాకేజీల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు.

– ప్యాకేజీ 1 : మొదటి ప్యాకేజీలో రూ. 613 కోట్లతో 33 సర్వీసు రిజర్వాయర్లు, 1522 కిలోమీటర్ల మేర పైపు లైను నెట్ వర్క్ నిర్మాణం చేపడుతున్నారు. దీని పరిధిలోకి సరూర్ నగర్, మహేశ్వరం, శంషాబాద్, హయత్ నగర్, ఇబ్రహీం పట్నం, ఘట్ కేసర్, కీసర (7 మండలాలు) వస్తాయి. మొత్తం 4.36 లక్షల మందికి ప్రయోజనం కలుగుతుంది.

– ప్యాకేజీ 2 : రెండో ప్యాకేజీలో కొత్తగా 38 సర్వీసు రిజర్వాయర్లు, 1250 కిలో మీటర్ల మేర పైపు లైను నెట్ వర్క్ నిర్మాణం చేపడుతుండగా, వీటికయ్యే ఖర్చు రూ. 587 కోట్లు. దీని పరిధిలోకి రాజేంద్రనగర్, శామీర్ పేట్, మేడ్చల్, కుత్బుల్లాపూర్, పటాన్ చెరు, ఆర్.సి. పురం, బొల్లారం (5 మండలాలు) వస్తాయి. మొత్తం 1.96 లక్షల మందికి లబ్ది కలగనుంది.




## టిజిఓ నేతలను కలిసిన మహమ్మద్ అబ్దుల్ ఖాదర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** పర్సనల్ డైరక్టర్‌గా పదోన్నతి పొందిన మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ టిజిఓ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర సంఘం అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, సంఘ రాష్ట్ర కార్యదర్శి ఎ.సత్యనారాయణలను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ప్రభుత్వ ఉద్యోగులు, సంఘాల హక్కుల విషయంలో రాజీలేని పోరాటం, ఉద్యోగులకు అన్ని విషయాల్లో టిజిఓ అసోసియేషన్ వెన్నుదన్నుగా నిలుస్తున్న తీరు హర్షనీయమని ఈ సందర్భంగా మహమ్మద్ అబ్దుల్ ఖాదర్ అన్నారు. ఈ సందర్భంగా టిజిఓ హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో రాష్ట్ర సంఘ ప్రతినిధులు పదోన్నతి పొందిన మహమ్మద్ అబ్దుల్ ఖాదర్‌ను పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా సంఘం అధ్యక్షుడు ఎంబి కృష్ణాయాదవ్ పాల్గొన్నారు.

## వర్షాకాలానికి ముందస్తు చర్యలు

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి.కర్ణన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** వర్షాకాలం దగ్గర పడినందున భూసేకరణ లేని ప్రాంతంలో నాలా పనులు ప్రారంభించాలని జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. కూకట్ పల్లి జోన్‌లోని మూసాపేట్, గాజులరామారం, కూకట్ పల్లి సర్కిళ్లలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మూసాపేట్ మెట్రో స్టేషన్ వద్ద నీరు నిలిచే ప్రాంతాన్ని పరిశీలించారు. ఐడిపిఎల్ చెరువు మిగులు జలాల నాలా, ఆర్‌టిసి డిపో వరకు ఉన్న ఎస్‌ఎన్‌డిపి నిధులతో చేపట్టిన బాక్స్ డ్రెయిన్ పనులను పరిశీలించారు. భూసేకరణతో పనులు ప్రారంభించలేక పోవడం జరిగిందని అధికారులు వివరించడంతో వర్షాకాల దగ్గర పడుతున్న నేపథ్యంలో వరదనీ



రుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని అధికారులకు సూచించారు. కైత్లాలాపూర్ రోడ్డు విస్తరణ పనులకు సంబంధించిన పరిశీలన చేసి, జాప్యానికి గల కారణాలను ఇంజనీర్‌ను వివరణ కోరగా కోర్టు కేసు ఉన్న నేపథ్యంలో పనులు ప్రారంభించలేదని తెలపడంతో కోర్టులో కౌంటర్ దఖాలు చేయాలని కమిషనర్ ఆదేశించారు. ఈ విషయంలో జోనల్ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ సందర్శనలో కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ అపూర్వ్ చౌహాన్, జోనల్ ఎస్‌ఈ చిన్నా రెడ్డి, ఈఈలు రమేష్, శ్రీనాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అన్ని రంగాలలో శేరిలింగంపల్లి సమగ్ర అభివృద్ధే ధ్యేయం

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

**ప్రజాపక్షం/శేరిలింగంపల్లి :** శేరిలింగంపల్లి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే ధ్యేయమని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఈస్ట్ సాయి నగర్, మొగులమ్మ భస్తీ, పిజెఆర్ నగర్, దత్తత్రేయ నగర్, శంషీగూడ తదితర కాలనీలలో సిసి రోడ్ల నిర్మాణం పనులకు శంకుస్థాపన నిర్వహించారు. ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శేరిలింగంపల్లి నియోజకవరన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి అదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతా



నన్నారు. నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మిక, ప్రజా సమస్యల పరిష్కారానికి జాతీయ సార్వత్రిక సమ్మె

కార్మిక సంఘాల నాయకుల పిలుపు




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న పెట్టుబడిదారీ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మె నిర్వహించి తగిన గుణపాఠం చెప్పాలని ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ, సిఐటియు నగర అధ్యక్షులు జె.కుమారస్వామి, టియుసిఐ నగర అధ్యక్షురాలు ఎస్.ఎల్. పద్మ, ఐఎఫ్‌టియు అధ్యక్షురాలు అనురాధ కార్మిక వర్గం, ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం కార్మిక సంఘాల నగర శాఖల ఆధ్వర్యంలో సికింద్రాబాద్‌లోని రెతిఫైల్ బస్ స్టాప్ నుంచి ప్రారంభించి ప్రజలకు, షాపుల యజమానులకు, కార్మికులకు కరపత్రాలు పంచుతూ దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 11 సంవత్సరాలుగా ప్రధాని మోదీ బిజెపి ప్రభుత్వం ఒకవైపు కార్మిక చట్టాలను, మరోవైపు రైతు చట్టాలను పెట్టుబడిదారులకు, బడా పారిశ్రామికవేత్తలకు లాభాలు చేకూర్చేందుకు ప్రభుత్వం అనుకూల నిర్ణయాలు తీసుకుంటూ కార్మికుల, ప్రజల శ్రమను బిజెపి ప్రభుత్వ అనుకూల పెట్టుబడిదారులకు కట్టబెట్టి తద్వారా ఎన్నికల నిధిని సమకూర్చుకునేందుకు కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు టీ కొమురెల్లి బాబు, ఎండి.ఉమర్‌ఖాన్, సిఐటియు నాయకులు ఎం.అజయ్ బాబు, పి.శివ, టియుసిఐ నాయకులు విజయ, కృష్ణ, ఐఎఫ్‌టియు నాయకులు అరుణ

## సబ్ రిజిస్ట్రార్‌పై దాడిచేసిన వారిపై చర్యలు

జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం వినతి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** పెద్దఅంబర్ పేట సబ్ రిజిస్ట్రార్‌పైన జరిగిన దాడిని రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం ప్రెసిడెంట్ డాక్టర్ కె.రామారావు,సెక్రెటరీ శ్రీనేష్ కుమార్ నోరి సోమవారం తీవ్రంగా ఖండించారు. దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. విధి నిర్వహణలో ఉన్న రంగారెడ్డి జిల్లా పెద్దఅంబర్‌పేట్ సబ్ రిజిస్ట్రార్ రవీందర్ నాయక్‌పైన రిజిస్ట్రేషన్ విషయంలో ఘర్షణ పడి జరిగిన దాడి చేయడాన్ని రంగారెడ్డి జిల్లా తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం తీవ్రంగా ఖండించింది. ఇలాంటి అమానుష చర్యలు ఇక ముందు జరగకుండా ప్రభుత్వం కఠినమైన చర్యలు తీసుకోవాలని, దాడి చేసిన వ్యక్తిని వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపి ఉద్యోగస్థులలో ఆత్మ స్థైర్యాన్ని నింపాలని రంగారెడ్డి జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధి నిర్వహణలో ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం పని చేస్తారని ఎవరైనా అధికారులు ఏదైనా తప్పు చేస్తే పై అధికారులకు ఫిర్యాదు చేసుకోవచ్చు కానీ, భౌతిక దాడులకు దిగడం హేయమైన చర్య ఖండిస్తూ సోమవారం తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జిలతో ఉద్యోగులు రంగారెడ్డి జిల్లా కలెక్టరెట్ నందు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం రాష్ట్ర స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ సబ్ రిజిస్ట్రార్స్ సంఘం బాధ్యులు సహాదేవ్,స్మిత ప్రజ్ఞ తో కలిసి కమిషనర్ అండ్ ఇన్స్పెక్టర్ జనరల్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ బుద్ధ ప్రకాష్ ను కలిసి సబ్ రిజిస్టర్ పై దాడికి పాల్పడిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు వెంకటేష్,నూతనకంటి వెంకట్,శాంతి శ్రీ, అలివేలు,లక్ష్మణ్ స్వామి,సుజాత, సైదమ్మ,నాగేశ్వరావు, కలెక్టరేట్ గజిటెడ్ నాన్ గెజిటెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## రెడీమిక్స్ వాహనం బీభత్సం : వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/గండిపేట:** శంషాబాద్ మండలంలోని నర్కుడ గ్రామ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల ముందు మంగళవారం రెడీమిక్స్ వాహనం బీభత్సం సృష్టించింది. సంఘటనకు సంబంధించి స్థానికులు పోలీసుల కథనం ప్రకారం.. మొయినాబాద్ మండలం నాగిరెడ్డి గూడ గ్రామానికి చెందిన గంగ పాక అర్జున్(50) టిఎస్ 07 ఇజడ్ 8029 మోటార్ సైకిల్‌పై కూలి పని కోసం శంషాబాద్‌కు వెళ్తుండగా శంషాబాద్ షాబాద్ రహదారిపై నర్కూడ గ్రామం వద్ద ఎదురుగా వచ్చిన ఎపి 01డిడి 7904 నెంబర్ గల రెడీమిక్స్ లారీ డ్రైవర్ అజాగ్రత్త అతి వేగంగా నడుపుతూ మోటార్ సైకిల్ పైకి దూసుకొచ్చాడు. ఈసంఘటనలో బైక్‌పై వెళ్తున్న అర్జున్ తీవ్రగాయాలతో అక్కడకక్కడే మృతి చెందారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శంషాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




## భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

కలెక్టర్ నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/కొందుర్గు:** భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు రంగారెడ్డి జిల్లాలో కొందుర్గు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా రెండో రోజు మండలంలోని శ్రీరంగాపూర్, ఉత్తరాస్‌పల్లి గ్రామాల్లో మంగళవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు కలెక్టర్ నారాయణరెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యా రు. మండల పరిధిలోని శ్రీరంగాపూర్‌లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మెన్ సయ్యద్ సాధిక్, గ్రామానికి చెందిన వినాయక గ్యాస్ ఏజెన్సి యాజమాని బి అశోక్‌రెడ్డిల ఆర్థిక సహాకారం 6లక్షల 30వేలతో నిర్మాణం చేసిన వాటర్ ఫిల్టర్‌ను కలెక్టర్, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌లు ప్రారంభించారు. అనంతరం రెవెన్యూ సదస్సులో పాల్గొని, రైతులు అందజేసిన దరఖాస్తులను తీసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ గత ప్రభుత్వం అమలు చేసిన ధరణి స్థానంలో తమ ప్రభుత్వం భూ భారతిని తీసుకువచ్చిందని, రైతుల భూసమస్యలను శాశ్వాత పరిష్కారం కోసం భూ భారతిని ప్రవేశ పెట్టడం జరిగిందని, ఇందులో భాగంగా



కొందుర్గు మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయడం జరిగిందని, మండల రైతులు రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలని కోరారు. శ్రీరంగాపూర్‌లో 19 దరఖాస్తులు, ఉత్తరాస్‌పల్లిలో 13 దరఖాస్తులను రైతులు అందజేసినట్లు తహసీల్దార్ రమేష్ కుమార్ తెలిపారు. అయా కార్యక్రమాల్లో షాద్‌నగర్ ఆర్‌డిఒ సరిత, షాద్‌నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మెన్ బాబర్‌ఖాన్, కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు బి.రోహిత్‌రెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, అంజిరెడ్డి, పురుషోత్తంరెడ్డి, బి. మల్లేష్‌గౌడ్, జాహంగీర్, గోవర్ధన్‌గౌడ్ పాల్గొన్నారు.

( ఫొటో HYDRAA 1 )

## అభివృద్ధి పనులను అనుమతించాలి : కార్పొరేటర్



**ప్రజాపక్షం/మల్కాజిగిరి:** డివిజన్‌లో అవసరం ఉన్న పలు అభివృద్ధి కార్యక్రమాలకు గాను జిహెచ్‌ఎంసి జోనల్ కమిషనర్‌కు మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ ప్రతిపాదనలు అందచేసారు. వీటిని త్వరలో అమమతించి నిధులు మంజూరు చేయాలని కోరారు. సఫిల్‌గూడ చెరువులో గుర్రపు డెక్క, ఓపెన్ జిమ్ పరికరాలు, ప్రధాన మార్గం వద్ద ఆర్చి, విమలాదేవి నగర్‌లో బాక్స్ డ్రైవ్, బాలసరస్వతినగర్, సర్దార్ పటేల్ ప్రాంతాల్లో నాలా పనులు, సిసి రోడ్డు పనులకు అనుమతించాలని ఆయన కోరారు.

## జాతీయ నృత్య పోటీలలో సెరినిటీ విద్యార్థి ప్రతిభ



**ప్రజాపక్షం/నాగారం:** కల్చరల్ ఫైన్ ఆర్ట్స్ ఫెడరేషన్ ఇండియా డార్జిలింగ్‌లో నిర్వహించిన అండర్ 20 జాతీయ ఎనిమిదవ నృత్య, సంగీత ఛాంపియన్ షిప్–2025లో నాగారం సెరినిటీ మాడల్ స్కూల్‌కు చెందిన బి.జాహ్నవి(10వ తరగతి) కూడిపూడి నృత్యంలో ద్వితీయ బహుమతి సాధించారు. ఈ సందర్భంగా స్కూల్ కరస్పాండెంట్ నోములు జంగిరెడ్డి, ప్రధాన కార్యదర్శి నోముల వసంత జాహ్నవిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



## మరోసారి యుద్ధంచేసి పాకిస్తాన్‌కు బుద్ధి చెబుతాం : మాజీ సైనికులు

**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** పాకిస్తాన్ కొనసాగిస్తున్న ఉగ్రదాడులు, అరాచకాలను ఎదుర్కొనేందుకు అవసరమైతే తాము మరోసారి యుద్ధంలో పాల్గొనేందుకు సిద్ధంగా ఉన్నామని మాజీ సైనికులు తెలిపారు. మంగళవారం నేరేడ్‌మెట్ ఆర్కేపూరం ఆఫీసర్స్ కాలనీలో బిజెపి మాజీ సైనికుల విభాగ కన్వీనర్ గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో మాజీ సైనికుల సమావేశం జరిగింది. తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల బిజెపి కో ఇన్‌చార్జి డాక్టర్ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ కార్యక్రమంలో మాతృభూమి పరిరక్షణలో భాగంగా సైనికులు దేశ సరిహద్దుల్లో కొనసాగిస్తున్న పోరాటంలో తాము సైతం పాల్గొని పాకిస్తాన్‌కు తగిన బుద్ధి చెబుతామంటూ ప్రపంచ పటంలో పాకిస్తాన్ లేకుండా చేస్తామని, పాకిస్తాన్ డౌన్‌డౌన్, టెర్రరిజం నశించాలి అంటూ నినదిస్తూ ప్రతిన పూనారు. ఈ పమావేశంలో మాజీ సైనికులు కెప్టెన్ శర్మ, రమేష్, కెప్టెన్ పెరుమాళ్, కళిందర్‌సింగ్, ధనుంజయ, రవిలతో పాటు బిజెపి నేత ఎల్లారెడ్డి, హైమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కార్మికుల సంక్షేమానికి కృషి

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కార్మికుల సంక్షేమానికి జిల్లా కార్మిక శాఖ కృషి చేస్తుంద ని మేడ్చల్ జిల్లా కార్మికశాఖ అధికారి సాయి సుమన్ పేర్కొన్నారు. చర్లపల్లి డివిజన్ పరిధిలోని పెద్ద చర్లపల్లి దుర్గామాత భవవ నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రమును ఆయన ప్రారంభించారు.జిల్లా వ్యాప్తంగా ఉన్న అసంఘటిత కార్మికుల సంక్షేమంకోసం కృషి చేస్తుందని తెలిపారు. భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు ఆయనను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో భవన కార్మిక సంఘం సభ్యులు వెంకటయ్య, మందుల మల్లేష్, నాయకులు ఆనంద్‌రాజ్, మల్లేష్,యాదగిరి, తదితరులు పాల్గొన్నారు.



## ముంపు సమస్యకు పరిష్కా రం : కార్పొరేటర్


**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** వర్షాకాలం ప్రారంభమయ్యేలోగా ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్ సత్తిరెడ్డినగర్ నుండి లాలాపేట డివిజన్ లక్ష్మి నగర్ కాలనీ వాసుల కు దీర్ఘకాలంగా ఎదురవుతున్న ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం లభించనుందని స్థానిక కార్పొరేటర్ వై.ప్రేమ్‌కుమార్ తెలిపారు. లాలాపేట కార్పొరేటర్, డిప్యూటి మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డితో సంయుక్తంగా తీసుకొన్న ప్రతిపాదనల మేరకు రూ.65లక్షల వ్యయంతో బాక్స్ నిర్మాణంకోసం నిధులు మంజూరయ్యాయని, త్వరలో ఈ పనులు పూర్తవటం వల్ల సమస్య పరిష్కారం అవుతుందన్నారు. బాక్స్ నిర్మాణ పనులను కార్పొరేటర్ జిహెచ్ఎంసి ఇఇ లక్ష్మ ణ్, డిఇ లౌక్య, సువర్ణ, ఎఇ శ్రీకాంత్‌లతో కల్సి పరిశీలించి నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలని సూచించారు.

## పెండింగ్ కేసులను రాజీ చేసుకోండి

### జూనియర్ సివిల్ న్యాయమూర్తి బి.శ్రీరాం

**ప్రజాపక్షం/కొడంగల్ :** రాజీమార్గమే రాజమార్గమని కొడంగల్ కోర్టు పరిధిలో గతంలో నమోదైన కేసులను రాజీ చేసుకోవాలని జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి బి.శ్రీరాం అన్నారు. మంగళవారం న్యాయస్థానంలోని తన చాంబర్‌లో స్థానిక విలేకరులతో మాట్లాడుతు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అదేశాల మేరకు వచ్చే నెల జూన్ 9వ తేది నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేకంగా లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో ప్రత్యేకంగా చెక్ బోన్స్ కేసులకు సంబంధించి 5 లక్షల లోపు ఇచ్చిన చెక్కులు బౌన్స్ అయిన వాటికి గతంలో కేసులు నమోదు అయినట్లు తెలిపారు. ఈ కేసులను ప్రత్యేకంగా ఇరువర్గాల అంగీకారంతో రాజీ కుదుర్చుకోవాలని ఇందుకు సంబంధించి కాంప్రమైజ్ ఫీజు తీసుకోవడం లేదన్నారు. బ్యాంకులకు సంబంధించిన చెక్ బౌన్స్ కేసుల్లో కూడా రాజీ చేసుకునే అవకాశం ఉందన్నారు. పలు కోర్టుల్లో దాదాపు 89,900 చెక్ బౌన్స్ కేసులు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. గతంలో హైద్రాబాద్ పరిధిలో నిర్వహించిన లోక్ ఆదాలత్‌లో 3107 కేసులను ఇరు వర్గాల వారు రాజీ కుదుర్చుకున్నట్లు తెలిపారు. వీటితో పాటు సివిల్, క్రిమినల్ తదితర కేసులకు సంబంధించి రాజీ చేసుకోవాలని అన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : ఎమ్మెల్యే



**ప్రజాపక్షం/అల్వాల్ :** సీఎం రిలీఫ్ ఫండ్ ఆరోగ్య సమయములో నిరుపేద ప్రజలకు ఒక వరం లాంటిదని ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకొని ఆరోగ్యపరంగా క్షేమంగా ఉండాలని మల్కాజ్గిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన ప్రజలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రభుత్వం నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు సిఎం రిలీఫ్ చేయూతనిస్తుందని వెల్లడించారు. అనంతరం వెంకటాపురం డివిజన్‌కు చెందిన రవీందర్ కుమార్ గౌడ్‌కు 10,500/– చంద్రశేఖర్‌కు రూ. 30 వేల చెక్కులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు బద్దం పరుశురాం రెడ్డి, వెంకన్న, అనిల్ కిషోర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# సంధ్యా కన్వెన్షన్ ఆక్రమణల తొలగింపు

* అక్రమ కట్టడాలను కూల్చివేసిన హైడ్రా
* శ్రీధరరావుపై వెల్లువెత్తుతున్న ఫిర్యాదులు






**ప్రజాపక్షం/హైదరాబాద్/శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి మండలం గచ్చిబౌలి ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న సంధ్యా కన్వెన్షన్ ఆక్రమణలను మంగళవారం హైడ్రా తొలగించింది. ఫెర్టిలైజర్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఎంప్లాయిస్ కోపరేటివ్ హౌసింగ్ సొసైటీ లేఔట్‌లో సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర రావు ఆక్రమణలకు పాల్పడ్డారంటూ వచ్చిన ఫిర్యాదులపై హైడ్రా చర్యలు తీసుకుంది. అనుమతి లేకుండా నిర్మించిన సంధ్యా కన్వెన్షన్ మినీహాల్‌తో పాటు, ప్రధాన కన్వెన్షన్‌ను ఆనుకుని నిర్మించిన వంట గదులను, 10 రెస్టు రూమ్‌లను హైడ్రా తొలగించింది. ఐరన్ పిల్లర్లతో జి ప్లస్ 2గా నిర్మించిన రెండు కట్టడాలను కూడా కూల్చింది. 1980 దశకంలో 20 ఎకరాల విస్తీర్ణంలో 162 ప్లాట్లతో లేఔట్ వేయగా, దాని నామ రూపాలు లేకుండా సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు చేశారంటూ హైడ్రా ప్రజావాణిలో పలువురు ప్లాట్ యజమానులు ఫిర్యాదు చేశారు. సంధ్యా కన్వెన్షన్ పేరిట అడుగుపెట్టి పక్కనే ఉన్న మా లేఔట్‌ను కబ్జా చేశారు. కష్టార్జితంతో కొనుక్కున్న ప్లాట్ల చిరునామా లేకుండా, మొత్తం హద్దులను చెరిపేశారు. లేఔట్‌లో రహదారులు, పార్కుల ఆనవాళ్లు లేకుండా ఆక్రమించేశారు. ఇదేమని అడిగితే దాడులు కూడా చేశారని, ఈ మోసాలను తట్టుకోలేక పలువురు ఆత్మహత్యలు కూడా చేసుకున్నారని బాధితులు తెలిపారు. ఒకటా రెండా 30 వరకూ కేసులు ఆయనపై పలు పోలీసు స్టేషన్‌లో నమోదయ్యాయి. తమ లేఔట్‌కు సంబంధించి కూడా 5కు పైగా కేసులు ఆయనపై నమోదయ్యాయి. హైడ్రా రావడంతో తమకు ధైర్యం వచ్చింది. మీరైనా చర్యలు తీసుకోండి అని లే ఔట్‌లోని పలువురు ప్లాట్ యజమానుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన హైడ్రాకు సంధ్యా కన్వెన్షన్ యజమాని శ్రీధర్ రావు ఆక్రమణలు ఒకదాని తర్వాత ఒకటిగా బయటపడ్డాయి. అక్కడ లేఔట్ నామరూపాలు లేకుండా కబ్జాలు జరిగాయని, పలునిర్మాణాలకు అనుమతులు లేవని అధికారులు నిర్ధారించుకున్నారు. ఇదే విషయాన్ని హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కి అధికారులు నివేదించారు. కమిషనర్ ఆదేశాల మేరకు మంగళవారం ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించారు. లేఔట్ చుట్టూ నిర్మించిన ప్రహరీతోపాటు పలు ఆర్చిలను హైడ్రా కూల్చివేసింది.

**శ్రీధరరావుపై కొనసాగుతున్న ఫిర్యాదులు..**

హైడ్రా చర్యలతో ధైర్యాన్ని కూడగట్టుకున్న బాధితులు వివిధ మార్గాల్లో ఫిర్యాదు చేస్తున్నారు. నగరంలో ఉన్నవారే కాకుండా, విదేశాల్లో ఉన్నవారు కూడా హైడ్రాను ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. తమను లేఔట్‌లోకి కూడా రానీయకుండా అడ్డుకున్నారని, తమ ప్రమేయం లేకుండా డెవలప్‌మెంట్ అగ్రిమెంట్లు రాయించుకుని, నిర్మాణాలు చేపడుతున్నారని పలువురు హైడ్రాకు ఫిర్యాదుచేశారు. విదేశాల నుంచి మెయిల్స్‌తో పాటు, వీడియోకాల్‌లో వారి గోడును వెల్లగక్కుతున్నారు. అక్కడ తాము కొనుక్కున్న ప్లాట్ లేదని శ్రీధరరావు మనుషులు చెప్పడంతో తన భర్త ఆత్మహత్య చేసుకున్నారంటూ ఢిల్లీ నుంచి ఓ మహిళ ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. త్వరలో హైదరాబాద్ వచ్చి హైడ్రా కార్యాలయంలో నేరుగా ఫిర్యాదు చేస్తానంటూ వేడుకున్నారు. ఇలా ఒకరి తర్వాత ఒకరుగా హైడ్రాను సంప్రదిస్తున్నారు. ఒక్క ఫెర్టిలైజర్స్ కార్పరేషన్ ఉద్యోగుల లేఔట్ వారే కాకుండా, వేర్వేరు ప్రాంతాల్లో శ్రీధర రావు చేసిన ఆక్రమణలపై ఫిర్యాదులందుతున్నాయి. ప్రభుత్వ భూములు, చెరువుల ఆక్రమణలకు సంబంధించి హైడ్రాకు పలువురు ఫిర్యాదు చేస్తున్నా రు.

**15 ఎకరాల ప్రభుత్వ భూమి స్వాధీనం**

**గాజులరామారంలో ఆక్రమణలను తొలగించిన హైడ్రా**

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం గాజులరామారం గ్రామంలో 15 ఎకరాల ప్రభుత్వ భూమిని హైడ్రా స్వాధీనం చేసుకుంది. సర్వే నెంబరు 354లో ఉన్న ప్రభుత్వ భూమిలో కబ్జాలను హైడ్రా మంగళవారం తొలగించింది. ఇందులో కెవెల్ వర్సిటీ వారు ఆక్రమించిన 5 ఎకరాల భూమి కూడా ఉంది. వాస్తవానికి ఈ భూమిని రాజీవ్ స్వగృహ నిర్మాణాలకు గాను రాష్ట్ర ప్రభుత్వం 2009లో కేటాయించింది. అక్కడ నిర్మాణాలు రాకపోవడంతో స్థానికంగా నాయకులుగా చెలామణి అవుతున్నవారి కన్ను ఈ భూమిపై పడింది. అంతే ఎవరికి వారు ప్రహరీలు నిర్మించుకుని, షెడ్డులు వేసి ఆక్రమణలకు పాల్పడితే, స్థానికుల నుంచి హైడ్రా ప్రజావాణికి ఫిర్యాదులందాయి. ప్రభుత్వ భూమిని ఎకరాలకొద్దీ ప్రహరీలు నిర్మించి ఆక్రమించుకుంటున్నారని, ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు విచారణ చేపట్టారు. హైడ్రా అదికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సర్వే చేసి ప్రభుత్వభూమి అని నిర్ధారించుకున్న తర్వాత నివేదికను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్‌కి అందజేశారు. క్షేత్రస్థాయిలో పరిశీలించిన రంగనాథ్ ఆక్రమణలు తొలగించి వెంటనే ప్రభుత్వభూమి పేరిట బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ నేపథ్యంలో ఆక్రమణలను కూల్చేసిన అdRకారులు అక్కడ ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. హైడ్రా కాపాడిన ప్రభుత్వ భూమిగా బోర్డులు పెట్టారు. కాటేదాన్‌లో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. ఇందిరా సొసైటీ కాలనీలోని రహదారులను ఆక్రమించిన వారి కట్టడాలను తొలగించింది. రహదారులను ఆక్రమించి, లేఔట్లలోని ప్లాట్లను కబ్జా చేసిన వారి ప్రయత్నాలను అడ్డుకుంది.

## 'రాజీవ్ యువ వికాసం' అర్హుల ఎంపికలో జాప్యం వద్దు

### కలెక్టర్ గౌతం




**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ప్రభుత్వం సదుద్దేశంతో ప్రవేశ పెట్టిన రాజీవ్ యువ వికాసం పథకంలో వచ్చిన దరఖాస్తుల్లో అర్హులను ఎంపిక చేయటంలో అధికారులు ఏ మాత్రం నిర్లక్ష్యం వహించరాదని జిల్లా కలెక్టర్ గౌతం ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు, జిల్లా సంక్షేమ శాఖాధికారులతో రాజీవ్ యువ వికాసం దరఖాస్తుల ఎంపిక ప్రక్రియ విషయమై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి వచ్చిన దరఖాస్తుల్లో అర్హత లేవని భావిస్తే వాటిని తిరస్కరించకుండా పెండింగ్‌లో పెట్టి మరేవైనా ధృవీకరణ పత్రాల అవసరం ఉంటే అభ్యర్థులకు ఫోన్‌చేసి తెప్పించుకోవాలని సూచించారు.అదే విధంగా అర్హత ఉన్న ధరఖాస్తులను బ్యాంకర్లకు లాగిన్ ద్వారా పంపించి వారి ధృవీకరణ పత్రాలన్నిటిని అప్‌లోడ్ చేయాలన్నారు. మొదటి, రెండవ క్యాటగిరీలకు సిబిల్ స్కోర్ అవసరం లేదని, మూడు, నాలుగవ క్యాటగిరీలకు మాత్రం అవసరం ఉన్న సిబిల్‌స్కోర్‌ను బ్యాంకర్లు తప్పని సరిగా పరిశీలించి నిధులు మంజూరు చేయాలన్నారు. తమ పరిధిలో కానటువంటి ధరఖాస్తులు వస్తే వాటిని సంబంధిత మున్సిపాలిటీ అధికారులకు వెంటనే పంపించాలని, ఎంపికైన దరఖాస్తు వివరాల జాబితాను వెంటవెంటనే జాప్యం లేకుండా పంపించాలని సూచించారు. అర్హులను ఎంపిక చేయటంలో ఎదురవుతున్న సమస్యలను కలెక్టర్ దృష్టికి పలువురు అధికారులు ఈ సమావేశంలో తీసుకొని రాగా వాటికి అవసరమున్న సలహాలిచ్చి అర్హులను ఎంపిక చేయటంలో పూర్తి బాధ్యత అధికారులదే అని. ఈ విషయంలో జాగ్రత్త వహించాలన్నారు. సమీక్షా సమావేశంలో జెడ్‌పిసీ సిఈఓ కాంతమ్మ, డిఆర్డీవో సాంబశివరావు, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖాధికారి వినోద్‌కుమార్, బిసి సంక్షే మ శాఖాధికారి విజయలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడి బాబు మోసిన్, ఎల్డిఎం జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖాధికారి, హైజింగ్ ఈడి రమణమూర్తి, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

## తక్షణమే వేతనాలు చెల్లించాలని వినతి



**ప్రజాపక్షం/నాగారం:** మున్సిపల్ కార్మికులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ శ్రీదేవికి నాగారం మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి వినతి పత్రం సమర్పించారు. నాగారం మున్సిపాలిటీలో విధులు నిర్వహిస్తున్న కార్మికులకు గత రెండు నెలలుగా వేతనాలు చెల్లించక పోవడంతో కార్మికులు అనేక ఇబ్బందులకు గురువుతున్నారని తక్షణమే వేతనాలు చెల్లించి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ మాజీ చైర్మన్ శ్రీదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌గౌడ్, నక్క కిషోర్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలి....**

నాగారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీలలో విద్యుత్ దీపాలు లేక చిమ్మచీకటిలో కాలనీవాసులు ఇబ్బందులకు పడుతున్నారని 3 వేల విద్యుత్ దీపాలు ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించాలని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ కమిషనర్, డైరెక్టర్ శ్రీదేవికి మున్సిపల్ మాజీ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి వినతి పత్రం సమర్పించారు.

## దాడి చేసిన వారిపై చర్యలు

**ప్రజాపక్షం/శామీర్‌పేట :** రైతుల కార్యాలయంపై కాంగ్రెస్ నాయకులు దాడి చేయడం హేయమైన చర్యగా భావిస్తున్నామని, దాడికి పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సోమవారం శామీర్‌పేట సొసైటిలో ఉన్న కెసిఆర్, కెటిఆర్‌ల ఫోటోలను ధ్వంసం చేయడంతో స్పందించిన డిసిఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ మాజి సిఎం కెసిఆర్ ప్రజల గుండెల్లో ఉంటాడని పోస్టర్లు చింపినంత మాత్రాన ఆయన పేరును చెరిపివేయలేరని అన్నారు. ఈ దాడుల వెనక ఎవరి హస్తం ఉందో అందరికి తెలుసునని రాబోయే రోజుల్లో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని అప్పుడే అందరి చిట్టాలు విప్పుతమన్నారు. సొసైటిపై జరిగిన దాడిని చీకటి రోజుగా పరిగణిస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ సర్కార్‌కు చిత్తశుద్ధి ఉంటే రైతులందరికి రైతుబంధు వేయాలని, ఈ చిల్లర పనులు చేయడం మానుకోవాలని హితవుపలికారు. అధికారంలో లేకున్న అధికారిక కార్యక్రమాల్లో ఎలా పాల్గొంటారని ఓ నియోజకవర్గ నాయకుడుని దృష్టిలో పెట్టుకుని ఆయన ప్రశ్నించారు. రైతులు, యువకులు, మేధావులు ఆలోచించాలని ఇలాంటి చర్యలపై ప్రశ్నించాలని కోరారు. పోలీసులు స్పందించకపోతే రోడ్డుపైన బైఠాయించి నిరసనలు వ్యక్తం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సొసైటి వైస్ చైర్మన్ ఐలయ్య, నాయకులు సతీష్‌రెడ్డి, నందు గౌడ్, పవన్, నోముల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


## పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలి

### కలెక్టర్ ప్రతీక్‌జైన్



**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి :** పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అన్నారు. మంగళవారం కలెక్ట ర్ కార్యాలయంలోని ఇంటర్ కంట్రి ఇటలి తల్లిదండ్రులకు, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ పరిధిలోని వికారాబాద్ శిశుగృహంలో పెరుగుతున్న ఎనిమిది సంవత్సరాల అబ్బాయిని ఇటలీకి చెందిన దంపతులకు దత్తత ఉత్తర్వులను జిల్లా కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ చట్టానికి వ్యతిరేకంగా పిల్లలను తీసుకుంటే చట్టరీత్యా నేరమని, పిల్లలను దత్తత తీసుకోవాలంటే జిల్లా సంక్షేమశాఖ పరిధిలోని శిశుగృహ వికారాబాద్‌లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. దత్తత స్వీకరణలో భాగంగా జిల్లా సంక్షేమ అధికారిణి జయసుధ, సిడబ్లుసి చైర్‌పర్సన్ వెంటటేశ, బిఆర్బి కోఆర్డినేటర్ కాంతారావు, డిసిపిఓ శ్రీకాంత్, శోభారాణి పాల్గొన్నారు.

## ఘనంగా కొలన్ హన్మంతరెడ్డి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/దుండిగల్ :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలను హన్మంతరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. 130వ డివిజన్ సుబాష్‌నగర్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికిరణ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు కరన్, డివిజన్ అధ్యక్షులు శ్రీధర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్మాన్ మానసిక వికలాంగుల గృహంలో కేక్ కట్‌చేసి పండ్ల పంపిణి చేశారు. సుభాస్‌నగర్ డివిజన్ నుంచి భారీ ఎత్తున కార్యకర్తలు తరలివెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు భాస్కర్‌రెడ్డి, నర్సంహారెడ్డి, నాగేష్‌రెడ్డి, రాజుచారి, గురువారెడ్డి, సత్తిరెడ్డి, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు

### గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పి.గౌతం

**ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి:** అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యేలా జాబితాలను రూపొందించాలని గృహ నిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ వి.పీ గౌతం అధికారులను అదేశించారు. మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ధృవీకరణ ప్రక్రియపై జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తో కలిసి ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమిషర్లు ఎంపిడిఒ, ధృవీకరణ గెజిటెడ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.

ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ గౌతం అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు అర్హులైన పేదలకు చెందాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల కమిటీ ద్వారా వచ్చిన జాబితాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి కుంటుంబాల స్థితిగతులను పరిశీలించి పారదర్శకంగా జాబితాలను రూపొందించాలని ఆయన అధికారులకు సూచించారు. దారిద్ర్యరేఖ కు దిగువన ఉన్న పేదలకు ప్రాధాన్యతా క్రమం లో ఇందిరమ్మ ఇళ్లను ఎంపిక ప్రక్రియను చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సుధీర్, హౌసింగ్ పిడి కిష్టయ్య డిఆర్‌డిఓ శ్రీనివాస్, డీఎస్ హెచ్‌ఓ సత్తార్, హౌసింగ్ డిఇ, ఎఇలు తదితరులు పాల్గొన్నారు.

**కొడంగల్‌లో :** మంగళవారం కొడంగల్ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుల వెరిఫికేషన్, నిర్మాణ పనులను ఆకస్మికంగా తనిఖీలు చేశారు. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల నమూన ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు ఇండ్ల నిర్మాణంలో 600 చదరపు అడుగుల కంటే ఎక్కువ విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించిన లబ్ధిదారులకు అనర్హులుగా ప్రకటించడం జరుగుతుందని హెచ్చరించారు.

అనంతరం పట్టణంలోని గాంధీనగర్‌లో దళిత మహిళ ఇంటిని పరిశీలించి వారితో కాసేపు ముచ్చటించారు. మండల పరిధిలోని హూసేన్ పూర్, దుద్యాల మండల పరిధిలోని సంగాయి పల్లి గ్రామంలోని లబ్దిదారులను కలిసి వారితో మాట్లాడి వివరాలను సేకరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలపై గ్రామాలలో ప్రజలకు అధికారులు ఎలాంటి అవగాహన కార్యక్రమాలు చేపట్టలేదని ఎవ్వరికి ఇండ్లు ఇస్తున్నారో ఎవ్వరికి ఇవ్వడం లేదో అవగాహన చేయాల్సిన అవసరం ఉందని అధికారులపై మండిపడ్డారు. వీరితో పాటు కడ ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, తహాశీల్దార్ విజయ్‌కుమార్, మున్సిపల్ కమిషిన ర్ బలరాం నాయక్, ఎంపిడిఒ ఉషశ్రీలతో పాటు ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గోన్నా రు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి

### ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మున్సిపల్ పరిధిలో చిలుక వాగు, గొల్ల చెరువు ప్రక్షాళనలో భాగంగా చేపడుతున్న అభివృద్ధి పనుల్లో నాణ్యతను పాటించాలని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తాండూరు మున్సిపల్ పరిధిలోని గొల్లచెరువు, చిలుక వాగు ప్రక్షాళనలో జరుగుతున్న అభివృద్ధి పనులపై క్యాంపు కార్యాలయంలో సంబంధిత ఇరిగేషన్, పంచాయతీరాజ్, మున్సిపల్ అధికారులతో ఎంఎల్ఎ సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులతో ఎంఎల్ఎ మాట్లాడుతూ నిర్మాణ పనుల్లో ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా ప్రజలు, కాంట్రాక్టర్లతో అధికారులు సమన్వయం చేసుకుంటూ త్వరిగత గతిన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక నాయకులు, మాజీ కౌన్సిలర్లు పాల్గోన్నారు.

ఫోకస్

# మహిళ

# తొలి గురువు అమ్మ



అమ్మను గురించి చెప్పడానికి ఎన్ని విశేషణాలు ఉన్నా తక్కువే. మన జీవితంలో అంతా తానై విస్తరించిన 'అమ్మ' కేవలం ఒక శబ్దం కాదు. ప్రతి ఒక్కరికీ జీవితంలో ముందుకెళ్లే వక్తినిచ్చే ఇంథనం అమ్మ. అందుక, ఆ పదం పలికిన ప్రతి క్షణం క్షణం మనలో ఓ భావోద్వేగం కలుగుతునే ఉంటుంది. 'అమ్మ' కేవలం ఒక్క పదం కాదు.. అది ఒక అనుభూతి. ఒక ఉరిమే భావజాలం. ఒక జీవన స్పర్శ. ప్రపంచంలోని ప్రతి భాషలోనూ తల్లిని సూచించే పదం ఎంతో మృదువుగా, సహజంగా ఉంటుంది. అది మానవ జీవితానికి మాత్రమే పరిమితం కాదు.. జంతు లోకంలోనూ మాతృత్వం అనే భావన గొప్పదే. ఈ ప్రపంచం మొత్తం మాతృత్వాన్ని గౌరవించడం వెనుక దాగిన శక్తి. మన జీవితం మొదలయ్యేది తల్లిలోనే. తల్లి గర్భంలో తొమ్మిది నెలలు పండు ముద్దుగా పెరిగి, చివరకు ఈ లోకాన్ని తొలిసారి చూసేది అమ్మనే. ప్రతి ఒక్కరూ తొలుత వినేది ఆమె స్వరమే. తొలిస్పర్శ కూడా అమ్మదే. పుట్టిన క్షణం నుంచే మనకు ప్రేమ, భయం, ఆశ్రయం, సానుభూతి అనే భావాలను అందించే శక్తి ఆమె. ఈ కారణంగా తల్లిని 'తొలి గురువు'గా పరిగణించడం అతిశయోక్తి ఎంతమాత్రం కాదు.. అది సత్యం.

## జీవితాన్ని నిర్వచించే పదం...



అమ్మ అనే ఒక్క పదమే జీవితాన్ని నిర్వచించగలదు. ప్రేమకు, త్యాగానికి, మమతకు, క్షమాశీలతకు ప్రత్యక్షరూపమే అమ్మ. ఒక్క సారి ఈ పదాన్ని మనం మనసులో పలకగానే హృదయం ఓ మృదుత్వంతో నిండిపోతుంది. భాష మారొచ్చు, సంస్కృతి మారొచ్చు, కానీ 'తల్లి' అనే వ్యక్తికి ఉన్న గౌరవం మాత్రం అన్ని మానవ సమాజాల్లో ఒకే విధంగా ఉంటుంది. భారతీయ సంస్కృతిలో అమ్మ స్థానాన్ని దేవత స్థాయికి చేర్చారు. 'మాతృ దేవో భవ' అనే ఉపనిషత్తుల వాక్యమే మన సంస్కృతిలో అమ్మకిచ్చే స్థాననాన్న స్పష్టం చేస్తుంది. ఒక వ్యక్తి జీవితంలో ఆద్యం తాలు అన్నీ తల్లితోనే జోడించి ఉంటాయి. అమ్మ అంటే కేవలం జన్మనిచ్చిన వ్యక్తి మాత్రమేకాదు.. జీవితం మొత్తం నడిపించే శక్తి కూడా. మొదటి బుద్ధి అమ్మ మాటల్లోనే వస్తుంది. మొదటి అడుగు అమ్మ చేయి పట్టుకున్నప్పుడే పడుతుంది. మొదటి సంతోషం, మొదటి భయం, మొదటి కన్నీరు.. ఇవన్నీ అమ్మ ఒడిలోనే మొదలవుతాయి.

గురువు అంటే ఎవరు? మనకు తెలియని విషయాన్ని నేర్పే వారు. మనలో మంచి లక్షణాలను పెంపొందించేవారు. మన బుద్ధిని జ్ఞానంతో నింపేవారు. తల్లి అదే చేస్తుంది... కానీ ఓ ప్రత్యేకమైన, అభేద్యమైన బంధంతో ఆమె సేవలు అందుతాయి. అమ్మ అనే శబ్దంభాషలకు అతీతం. మన దేశంలో ప్రపంచమంతా అమ్మను పిలిచే విధానాలు భిన్నంగా ఉన్నప్పటికీ, అందులో దాగిన ప్రేమ మాత్రం ఒకటే. ఈ మాట శబ్దంగా వినిపించినా, మానసికంగా అది మన హృదయాన్ని తాకుతుంది .ఈ ఒక్క శబ్దం మనల్ని బలహీనంగా చేస్తుంది, అదే సమయంలో అద్భుతంగా ధైర్యాన్ని నింపుతుంది. ఎందుకంటే, ఆ శబ్దంలో అనుభవాల శక్తి ఉంటుంది. మన తొలి ఏడుపుకు ఓదార్చిన చేతి స్పర్శ, తొలి నవ్వుకు కారణమైన హత్తు, జీవితంలోని ప్రతి సమస్యకు పరిష్కారమై కనిపించిన ముఖం..అన్నీ కలిసిన రూపమే 'అమ్మ'. జీవితం అనే పాఠశాలలో ప్రవేశం ఆమెతోనే.. అమ్మ చేతిలోపిల్లలు పుట్టగానే ఏ స్కూల్లోనూ చేరరు. కానీ జీవితం అనే పాఠశాలలో ఓ పాఠం మాత్రం మొదలవుతుంది. అమ్మ బోధన. పాలు తాగించే విధానం నుండి, పడిపోతే లేపే తీరు వరకు.. పిల్లలు ఊహించకుండానే శిక్షణ పొందుతారు. ఈ శిక్షణ భయంతో కాదు. బలవంతంగా కాదు. ప్రేమతో, సహనంతో, తల్లిదనంతో నిండినదిగా ఉంటుంది. అలాగే, అమ్మ చెప్పే ప్రతి మాటా చిన్నవిగా అనిపించినా, మనలో శాశ్వత విలువలను నాటతాయి. ఇవి పాఠశాలలో చదవలేం, కొనలేం, నేర్పించలేం. ఎందుకంటే, అవి అనుభవించవలసినవి. ఆమె ప్రేమలోనే మునిగిపోయి అలవడవలసినవి.అమ్మ ప్రేమ ఆత్మబలానికి మూలంచిన్నతనంలో పడిపోయినప్పుడు తల్లి ఎగిరి వచ్చి లేపే తీరు చూసి మనం భద్రత అనే భావన నేర్చుకుంటాం. ఏదైనా దొరికినప్పుడు ముందుగా అమ్మకు చూపించాలని మనసు ఎగిరిపోవడం – అది ఆనందాన్ని పంచుకోవాలనే సహజ నైతిక భావన. చిన్న చిన్న విజయం తల్లికి చెప్పాలనిపించడం గర్వాన్ని పంచుకోవాలనే సహజ తత్వం. ఈ భావాలన్నీ వ్యక్తిత్వ రూపంలో ఏర్పడతాయి. అలా చూసినపుడు, అమ్మ ఇచ్చిన బోధన మన వ్యక్తిత్వపు మూలపునాది. తల్లి వల్లే మనం ఎదుగుతాము, శారీరకంగా కాదు – మానసికంగా, భావోద్వేగంగా, ఆత్మవిశ్వాసంగా. మానవతా భావనకు పునాది అమ్మ. ప్రేమ కేవలం తన పిల్లలకే పరిమితం కాదు. అదే ప్రేమ పిల్లల్లోనూ ఇంకే వారిని ప్రేమించే సామర్థ్యాన్ని నాటుతుంది. అదే ప్రేమ సమాజాన్ని గౌరవించాలన్న భావనను సృష్టిస్తుంది. అదే ప్రేమ మానవత్వానికి మూలం. అందుకే, మాతృత్వాన్ని గౌరవించడం అనేది ఒక వ్యక్తిని గౌరవించడమే కాదు – ఒక సార్వజనీన శక్తిని గౌరవించడం. సమాజ భవిష్యత్తుకి మూలం ఒక తల్లి. జీవితం ఒక కుటుంబాన్ని ప్రభావితం చేస్తుంది. ఒక కుటుంబం సమాజాన్ని. సమాజం దేశాన్ని. దేశం ప్రపంచాన్ని. అలాంటి గొప్ప బోధనాత్మక శక్తి తల్లిలోనే ఉంది. మన తల్లి ఒక సాధారణ గృహిణి అయినా ... ఆమె చేతిలో పిల్లల భావితరాలు అందమైన రూపాలు సంతరిచుకుంటాయి. ఆమె తత్వాలు, విలువలు, నమ్మకాలు పిల్లల ద్వారా సమాజంలో వ్యాపిస్తాయి. అలాంటి శక్తిని 'తొలి గురువు"'గా గుర్తించక పోతే, మరెవరిని గురువుగా పరిగణించాలి? బోధనకు రూపమైన అమ్మ అంటే కేవలం జన్మనిచ్చే వ్యక్తి మాత్రమే కాదు... ఆమె బోధన జీవనానికే ఆధారం. పుస్తకాలలో మాత్రమే పాఠాలు ఉండవు. మాటల్లో, చూపుల్లో, చేతుల్లో, నడతలో, ఆమె జీవితశైలిలో.. ఇలా అడుగడుగునా తల్లి బోధన గుర్తుకొస్తునే ఉంటుంది. తల్లి బోధన ఒక పాఠ్యపుస్తకంలా కాదే కాని, అది జీవిత పాఠశాల కోసం అవసరమైన వ్యక్తిత్వ నిధి. తల్లి బోధన నీతి, నైతికత, సంస్కారం సమ్మేళనంపిల్లలు చిన్నప్పటి నుంచే తల్లిని గమనించటం మొదలెడతారు. తల్లి మాట్లాడే తీరు, నవ్వే శైలి, కోపపడే పద్ధతి.. ఇవన్నీ పిల్లలకు ఓ పాఠంగా మారతాయి. తల్లి ఎలా మాట్లాడాలో నేర్పదు, కానీ ఆమె మాట్లాడే తీరే ఒక ఆదర్శంగా నిలుస్తుంది. అలాగే, తల్లి తన అక్కచెల్లెమ్మలతో, అత్తగారితో, స్నేహితులతో ఎలా వ్యవహరిస్తుందో చూస్తూ పెరిగిన పిల్లలకు, తట్టుకొని ఉండటం, గౌరవంగా మాట్లాడటం, క్షమించడం లాంటి విలువలు సహజంగా నేర్చుకుపోతాయి.తల్లి సాయంకాలం దీపారాధన చేసే సంప్రదాయం ద్వారా పిల్లలు భక్తి, స్థితప్రజ్ఞత, కుటుంబ విలువల గురించి తెలుసుకుంటారు. అన్నదానంలో భాగస్వామ్యం చేస్తే దయా భావన, అవసరంలో ఉన్నవారిని గౌరవించడంలో తల్లి ప్రవర్తనను గమనించి సేవా భావన వంటి శక్తులు మన లోపల మొలకెత్తుతాయి. తల్లి చెప్పే బోధనల్లో కొన్ని మాటల్లో ఉంటాయి. కానీ చాలా వరకు అవి శబ్దరహితమైన బోధనలు. ఉదాహరణకు... తల్లి ఉదయాన్నే లేచి పనులు మొదలుపెట్టడం. అనుభవజ్ఞతతో ఇంటిని నిర్వహించడం ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవడం తినే ముందు ఇతరులకు ఇవ్వడం కష్టంలోనూ ధైర్యంగా నిలబడడం. ఈ తీరు బోధనలు పిల్లల మస్తిష్కంలో శాశ్వతంగా నిలిచి పోతాయి. వ్యక్తిత్వాన్ని నిర్మిస్తాయి. తల్లి బోధన అక్షరాలలో కాదు, అనుభవంలో నేర్పిన పాఠాల రూపంలో ఉంటుంది. పాఠశాలల్లో గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం వంటి విషయాలు నేర్పుతారేమోగానీ జీవితంలోని సమస్యలకు పరిష్కారాలను, బాధ్యతల నిర్వహణను, 'సహనశీసలతను, నైతికతను, ధైర్యాన్ని తల్లి నుంచి మాత్రమే నేర్చుకోవాల్సి ఉంటుంది. ఒక తల్లి నెలకు వచ్చే పరిమిత వనరులతో కుటుంబాన్ని ఎలా నిర్వహిస్తుందో చూస్తే, ఖర్చులకు తగిన ఆదాయాన్ని కలుపుకోవడం, పొదుపు చేయడం, అవసరాలను గుర్తించడం వంటి విషయాలపై పిల్లలు ఓ నైపుణ్యాన్ని పొందుతారు. మనలో మంచి అలవాట్లు చాలా తల్లిదండ్రుల ద్వారా వస్తాయి. ఉదయం లేవడం, మెళకువగా ఉండటం, పఠన అలవాటు, పనులు పూర్తిచేయడం మొదలైన అంశాల్లో తల్లి ప్రోత్సాహం ప్రధానంగా ఉంటుంది. ఒక తల్లి తన కుమార్తెకు ప్రతిరోజూ పాఠాలు చదవమని బలవంతంగా చెప్పదు. కానీ పక్కన కూర్చొని ఆమెను ప్రోత్సహిస్తుంటే, అదే అమ్మా బోధన. ప్రేమతో కూడిన ఒత్తిడి లేకుండా ఇచ్చే స్ఫూర్తి భావన. మంచితనం, నమ్మకమైన వ్యక్తిత్వం, ఆత్మవిశ్వాసం, పరపతి తదితరాలన్నీ తల్లి మాటల ద్వారా అభివృద్ధి చెందతాయి. సమస్యలు ఎదురైన ప్రతిసారీ, 'ధైర్యంగా ఉండు', 'ఆత్మవిశ్వాసనం పెంచుకో', 'తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దు' వంటి అమ్మ మాటలు గుర్తొస్తాయి.అమ్మచెప్పే కథల ద్వారా పిల్లల్లో భారతీయ సంస్కృతి గురించి అవగాహన పెరుగుతుంది. దేశ భక్తి కూడా తల్లి ప్రేరణతోనే కలుగుతుంది. ఒక తల్లి తన కుమారుడిని సైన్యంలోకి పంపినప్పుడు, ఆ గర్వం, బాధ్యత, త్యాగం వంటివన్నీ తల్లి బోధన వల్లే జరుగుతుంది. అమ్మ బోధన అనే మాట చెప్పగానే పాఠశాల గుర్తుకు రాకపోవచ్చు. కానీ జీవితంలో ఎదురయ్యే ప్రతి పరీక్షలో ఆమె బోధన ఒక జ్ఞాపకంలా మారుతుంది. అవి మనకు ఒత్తిడి లోపల నీవు ఎంత బలమైనవాడివో గుర్తు చేస్తుంది. కష్టసమయంలో, వెనుకడుగు వేయకుండా ముందుకు నడిపించే శక్తిని అందించే శక్తి ఆమె బోధన.ఆమె మాటలు కొన్ని పుస్తకాల్లో ఉండకపోవచ్చు. కానీ జీవితం అనే గ్రంథంలో ఆమె బోధనలు శాశ్వతంగా వుండిపోతాయి. అందుకే ఆమె తొలి గురువైంది. బతుకు తీరును తీర్చిదిద్దే మార్గదర్శకాలవుతాయి.

## వ్యక్తిత్వ వికాసంలో...

పిల్లల వ్యక్తిత్వ వికాసంలో తల్లిది కీలక పాత్ర. పిల్లలు పుట్టిన మొదటి క్షణం నుంచే తల్లి మానసిక నిర్మాణాన్ని ప్రారంభిస్తుంది. పాఠశాల అంటే ఒక నిర్ణీత ప్రదేశం, కానీ తల్లి పాఠశాల అనేది పదే పదే మారే జీవితం. రోజూ ఒక కొత్త పాఠం, ఒక కొత్త సందేశం. ఆమె మాటల్లో, చేతల్లో, నడతలో పిల్లలు ఎంతో నేర్చుకుంటారు. చిన్నచిన్న చర్యల ద్వారాతల్లి జీవన శైలి పిల్లలకు వ్యక్తిత్వ బలాన్ని అందిస్తుంది. కొన్ని ముఖ్యమైన అంశాలను ఆమె ప్రవర్తన ద్వారా పిల్లలు నేర్చుకుంటారు. అమ్మ ఇల్లు నిర్వహించే తీరును గమనిస్తే, పిల్లలకు బాధ్యతలు చేపట్టే ధైర్యం వస్తుంది. జవాబుదారీతనం అలవడుతుంది. రోజులో ఎన్నో పనులు సమయానికి ముగించే తల్లిని గమనించడమే



పిల్లలకి సమయపాలన పాఠం. తల్లి తన అవసరాలను పక్కనపెట్టి పిల్లల అవసరాలకు ప్రాధాన్యత ఇస్తుంది. ఇది నిస్వార్థతకు నిజమైన ఉదాహరణ. చిన్న పిల్లల తేడాలు, తప్పులు, అల్లరికి తల్లి చూపే ఓర్పే పిల్లలకు క్షమాభావాన్ని నేర్పుతుంది. ఆతిథ్యం, పెద్దల గౌరవం వంటి అలవాట్లు కూడా తల్లి నుంచి పిల్లలు నేర్చుకుంటారు. ఒక్కమాటలో చెప్పాలంటే, పిల్లల వ్యక్తిత్వ వికాసం తల్లి చేతుల్లోనే ఉంటుంది.

## సాహిత్యంలో అమ్మ..

తెలుగు సాహిత్యంలో అమ్మ పాత్రను ఎంతో భావోద్వేగంతో చిత్రించారు. కవి శేషేంద్ర శర్మ రచించిన 'తలి' కవితలో తల్లిని ఒక ప్రకృతి తత్త్వంగా వివరించారు. శ్రీశ్రీ, గోరటి వెంకన్న వంటి కవులు అమ్మ ప్రేమను పదాలలో మలచిన తీరే మనసును తడిపేస్తుంది. అమ్మ చేతిలో వండిన అన్నంలో ఓ ఆలింగనం ఉంటుంది. అమ్మ చూపులో ఓ ఆశీర్వాదం ఉంటుంది. ప్రపంచంలో భిన్న భాషలు, సంస్కృతులు ఉన్నా, తల్లికి ఇచ్చే గౌరవం అన్ని దేశాల్లో కూడా అత్యంత శ్రేష్ఠమైనదిగా ఉంటుంది. నేటి ఆధునిక జీవిత శైలిలో తల్లుల పాత్ర మరింత విస్తరించి పోయింది. కుటుంబానికి కేంద్ర బిందువుగా ఉన్న తల్లి, ఇప్పుడు ఉపాధ్యాయురాలు, ఉద్యోగిని, డాక్టర్, వ్యాపారవేత్త వంటి అనేక పాత్రల్లో సైతం అద్భుతంగా రాణిస్తోంది. ఈమె త్యాగం గురించి ఎంత చెప్పినా తక్కువే. ఉద్యోగానికి వెళ్లే ముందు పిల్లలకు బ్రేక్‌ఫాస్ట్ చేయడం, రాత్రి వారిని నిద్ర పెట్టే వరకు చూసుకోవడం, మధ్యలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించడం – అన్నీ సమాంతరంగా చేస్తూ వెళుతుంది. అందుకే, సాహిత్యంలోనూ అమ్మకు ప్రాధాన్యం పెరుగుతున్నదేగానీ తగ్గడం లేదు. ఒక్కో తరంలో ఒక్కో వాదం పుట్టి ఉండవచ్చు... ఒక్కో సిద్ధాంతం తెరపైకి వచ్చి ఉండవచ్చు. సైద్ధాంతికి విభేదాలు ఎన్నయినా ఉండవచ్చు. కానీ, తల్లిప్రేమ విషయంలో మాత్రం ఎలాంటి భిన్నవాదమేదీ వినిపించదు. అమ్మ వ్యతిరేక సాహిత్యం కనిపించదు. ఎంతో మంది ఎన్నో రకాలుగా తల్లిని స్తుతించారు. త్యాగాలను గుర్తుచేసుకున్నారు. కథలు.. కథానికలు.. నవలలు... నాటకాలు.. కవితలు.. పాటలు.. ఇలా అన్ని రకాల సాహితీ ప్రక్రియలు అమ్మ ఘనతను చాటుతున్నాయి. ఎన్నిసార్లు విన్నా, ఎన్ని పర్యాయాలు చదివినా, ఎప్పటికీ కొత్తగా కనిపించే ఏకైక అంశం 'అమ్మ'. ఎంతో మంది కవులు అమ్మను ప్రేమకు, కరుణకు, త్యాగానికి పర్యాయపదంగా పేర్కొన్నారు. 'అమ్మ' అనే కవిత పింగళి సూరన కాలం నాటి వాఙ్మయంలోనూ కనిపిస్తుంది. తల్లిని మహత్తుగా చిత్రించటానికి పునాదులు కనిపిస్తాయి. నన్నయ, తిక్కన, యరల చేసిన కథల్లో తల్లుల పాత్రలు ధైర్యానికి, త్యాగానికి ప్రతీకలుగా ఉండేవి. ఆధునిక తెలుగు సాహిత్యానికి వస్తేతల్లి పాత్రను 'తల్లి' కథలో రచయిత చంద్రశేఖర కమారెడ్డి గాఢమైన భావోద్వేగాలతో చిత్రించారు. బిడ్డ అభివృద్ధికి తల్లి ఎన్ని త్యాగాలు చేస్తుందో కథలో స్పష్టంగా చెబుతారు. హిందీ సాహిత్యంలో తల్లి ప్రతిష్ఠపై హరివంశ్‌రాయ్ బచ్చన్ అద్భుత రచనలు చేశారు. తల్లి ప్రేమ శాశ్వతం, అది అర్థం కానిదైనా మన హృదయానికి హత్తుకునే భావం అని పేర్కొన్నారు. భారతీయ సమాజంలో తల్లుల దుస్థితిని హృద్యంగా చిత్రించాడు. తల్లి త్యాగానికి సామాజిక గుర్తింపు అవసరమన్నదే ఇతి వృత్తం. ఎడ్గార్ అలాన్ పో రాసిన 'టు మై మదర్', లాంగ్‌స్టన్ హ్యూస్ రాసిన 'మదర్ టు సన్', ఆన్ టేలర్ రచించిన 'మై మదర్' తదితర రచనలు తల్లి ఘనతను వివరిస్తారు. తల్లి అంటే కేవలం జన్మనిచ్చిన వ్యక్తి మాత్రమే కాదు, ప్రేమను పంచే ప్రతి వ్యక్తి తల్లి అని అలాన్ పో చెప్పాడు. తల్లి తన జీవిత అనుభవాలను బిడ్డకు చెప్పే విధానం గాఢంగా, ప్రేరణాత్మకంగా ఉంటుందని లాంగ్‌స్టన్ హ్యూస్ అన్నాడు. అనేక ఆంగ్ల పాఠశాల పాఠ్యగ్రంథాల్లో ఉండే పలు కవితలు తల్లికి అంకితమిచ్చిన చిన్నతనపు మనోభావాలకు ప్రతిరూపాలు. ఇలాంటి ఎన్నో రచనలు తల్లి ఘనతను ఎలుగెత్తి చాటుతునే ఉన్నాయి. చాటుతునే ఉంటాయి కూడా.

---

## కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్స్ రద్దు చేయాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ :** కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌కోడ్స్ రద్దు చేయాలని, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని, మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సిఐటియు రాష్ట్ర నాయకుడు డబ్బికార్ మల్లేష్, బిఆర్‌టియు జిల్లా నాయకుడు అంజయ్య, ఐఎన్‌టియుసి నాయకులు చాంద్‌పాషా, టిఎన్‌టియుసి నాయకులు అంజిబాబు, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బంటు వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో ఆల్ ట్రేడ్ యూనియన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్రంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి నాయకత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం తన కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను, కార్పొరేట్ అనుకూల మతోన్మాద చర్యలను మరింత దూకుడుగా అమలు చేస్తుందని ఆరోపించారు. కార్మిక వర్గం సమరశీల పోరాటాల ద్వారా వంద సంవత్సరాల్లో సాధించుకున్న 29 కార్మిక చట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను ముందుకు తెచ్చిందని అన్నారు. వీటికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలు చేయాలన్నారు. ఈనెల 20న నిర్వహించే దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షుడు ఎండి.సయీద్, రామ్మూర్తి, గౌతం రెడ్డి, లింగనాయక్, వినోద్, గోపానాయక్ తదితరులు పాల్గొన్నారు.

## 20న చలో ఇందిరా పార్క్ మహాధర్నా

ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపు

**ప్రజాపక్షం/ వరంగల్ ప్రతినిధి:** మే 20న ఇందిరా పార్క్ వద్ద ఎఐటియుసి ఆధ్వర్యంలో ఉద్యోగుల హక్కుల సాధనకై నిర్వహించే ఇందిరా పార్క్ మహాధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని (ఎఐటియుసి అనుబంధం) ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా పిలుపునిచ్చారు. వరంగల్ ఎస్ఆర్ఆర్ తోట యూపిహెచ్‌సి డాక్టర్ అనితకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా రామ రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఎంలో వివిధ బాగాల్లో 78 క్యాడర్స్‌లో పని చేస్తున్న 17541 ఉద్యోగులను అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, జాతీయ ఆరోగ్య మిషన్ ఆల్ క్యాడర్స్ ఉద్యోగుల సమస్యల శాశ్వత పరిష్కారం కొరకు హాజరు కావాలన్నారు. ఒక్క రోజు ధర్నా ఇందిరా పార్క్ కు ఎన్‌హెచ్‌ఎం ఆల్ క్యాడర్స్ ఉద్యోగులందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఎస్ఆర్ఆర్‌తోట నర్సింగ్ ఆఫీసర్లు మంజుల, గుడికందుల వాణి, ల్యాబ్ టెక్నీషియన్ మౌనిక, ఏఎన్ఎంలు నర్మద, అనిత,రాజేశ్వరి, సపోర్టింగ్ స్టాఫ్ కృష్ణవేణి, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



## వామపక్ష పార్టీలు బిజెపి వైఖరిని ఎండగట్టాలి

- కేంద్ర ప్రభుత్వం నక్సలైట్లతో బేషరతుగా చర్చలు జరపాలి
- ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి
- ప్రజా సంఘాల నిర్మాణంతోనే సిపిఐ పార్టీ బలోపేతం
- పార్టీ సభ్యత్వ నమోదు ముమ్మరం చేయాలి : పల్లా వెంకటరెడ్డి



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు) :** బిజెపి మతోన్మాద ఎజెండాకు వ్యతిరేకంగా వామపక్ష ప్రజాస్వామ్య పార్టీలు ఉద్యమించాలని సిపిఐ జాతీయ సమితి సభ్యులు, మునుగోడు మాజీ ఎమ్మెల్యే పల్లా వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం చిలుకూరు మండలం నారాయణపురం గ్రామంలో చిలుకూరు మండల 15వ మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సిపిఐ పార్టీ 2025వ సంవత్సరాన్ని మహాసభల సంవత్సరంగా ప్రకటించిందన్నారు. మే నెల ఆఖరినాటికి మండల మహాసభలు పూర్తి కావాలని జూన్, జులై నెలలో జిల్లా మహాసభలు, ఆగస్టు నెలలో రాష్ట్ర మహాసభలు, సెప్టెంబర్ నెలలో జాతీయ మహాసభలు పూర్తి చేసేందుకు పార్టీ ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. రాష్ట్రంలో సిపిఐ పార్టీ బలోపేతమైందని గతంలో కంటే సభ్యత్వాలు ముమ్మరంగా పెరిగాయన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో లక్షా 5వేల సభ్యత్వంతో పార్టీ ముందుకు నడుస్తుందన్నారు. గ్రామ ప్రజల సమస్యలపై పోరాడేవాళ్లే కమ్యూనిస్టులని ప్రజా సంఘాలను బలోపేతం చేస్తూ పార్టీని మరింత బలోపేతం చేయాలన్నారు. కోదాడ నియోజకవర్గంలో చిలుకూరు మండలంలో పార్టీ బలంగా ఉందన్నారు. మతోన్మాద ఎజెండాతో బిజెపి పార్టీ అధికారంలోకి వస్తుందని వామపక్ష ప్రజాస్వామ్యం పార్టీలు బిజెపి వైఖరిని ఎండగట్టాలని పిలుపునిచ్చారు. విద్యా విధానంలో కాషాయ ఎజెండాను పార్టీ పూర్తిగా వ్యతిరేకిస్తున్నమన్నారు. బడ్జెట్‌లో కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇచ్చి విద్యా, వైద్యం గ్రామీణ ఉపాధి హామీ పథకానికి మోండిచేయి చూపిందని విమర్శించారు. రైతులు గిట్టుబాటు ధర కోసం ఏళ్ల తరబడి ఉద్యమిస్తున్నారని, రైతులను విస్మరించి కార్పొరేట్ శక్తులకు ప్రభుత్వం ఊడిగం చేస్తుందని ఎద్దేవా చేశారు. కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో వందలాది మంది నక్సలైట్లను ఎన్‌కౌంటర్ చేస్తుందన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే ఈ చర్యలను నిలిపివేయాలని సిపిఐ పార్టీ డిమాండ్ చేస్తుందన్నారు. నక్సలైట్ల త్యాగాలు వృథా కావని, ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలోకి రావాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్లలో అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని డిమాండ్ చేశారు. దేశ బడ్జెట్‌లో అన్ని రాష్ట్రాలకు సమానంగా ఇవ్వకుండా బిజెపి పాలిత రాష్ట్రాలకు ఎక్కువ నిధులు కేటాయిస్తూ అధికారంలో లేని రాష్ట్రాలను ఇబ్బందులు పెడుతుందని విమర్శించారు. గత బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు ఎక్కువ నిధులు ఇచ్చి, తెలంగాణకు మొండి చేయి చూపిందన్నారు. ప్రజా సమస్యలపై పోరాడమే సిపిఐ పార్టీ సిద్ధాంతమని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ మహాసభకు ముందు పార్టీ కార్యాలయ ఆవరణలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. మండవ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు మేకల శ్రీనివాసరావు, బద్దం కృష్ణారెడ్డి, యల్లావుల రాములు, దొడ్డా నారాయణరావు, కొండా కోటయ్య, కొండలు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల కార్యవర్గ సభ్యులు, గ్రామశాఖలు తదితరులు పాల్గొన్నారు.

## సామాజిక, ఆర్థిక, రాజకీయ సమానత్వానికి పోరాడుదాం

ఎన్ఎఫ్ఐడబ్ల్యు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సృజన, జ్యోతి పిలుపు




**ప్రజాపక్షం/దేవరకొండ :** కేంద్ర ప్రభుత్వం మహిళల గురించి మాట్లాడడమే తప్ప చేసిందేమి లేదని, మహిళా శక్తిని నిర్వీర్యం చేసే సనాతన ధర్మాలను పాటించాలని నిరంకుశంగా వ్యవహిరిస్తుందని, అందుకు మహిళా లోకం ఉద్యమించాలని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు సృజన పిలుపునిచ్చారు. మంగళవారం దేవరకొండలోని పల్లా పర్వత్‌రెడ్డి భవన్‌లో జరిగిన ఎన్ఎఫ్ఐడబ్ల్యు నియోజకవర్గ జనరల్ బాడీ సమావేశం సందర్భంగా ఎన్ఎఫ్ఐడబ్ల్యు జెండాను రాష్ట్ర అధ్యక్షురాలు సృజన ఆవిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశానికి లింగంపల్లి అనిత అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా హాజరైన మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఉస్తేల సృజన, నేదునూరి జ్యోతిలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం మహిళా శక్తి గురించి ఆహార నియంత్రణ గురించి మాట్లాడుతూనే వ్యవస్థీకృత హింసకు పాల్పడడం జరుగుతుందని, విద్య, ఆరోగ్యం అంగట్లో సరుకుగా మారాయని, పేదరికం ఆకలిచావులు అరికట్టడానికి 80 కోట్ల కుటుంబాలకు ఐదు కిలోల ధాన్యాన్ని కేంద్రం ఉచితంగా ఇవ్వవలసి వస్తుంది అంటే పేదరికం యొక్క తీవ్రత ఎంత ఉందో అర్థం అవుతుందన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, శాశ్వత ఉద్యోగాల్లో మహిళల యొక్క భాగస్వామ్యాన్ని తగ్గిస్తున్నారని అన్నారు. సమాన పనికి సమాన వేతనం అందని ద్రాక్షగా మిగిలిపోయిందని, గ్రామీణ ప్రాంతాల్లో 100 రోజుల పనిలో కూడా సమాన వేతనం ఇవ్వడం లేదని, రాజకీయ పార్టీలలో, సామాజిక కోణం నుండి మహిళల యొక్క భాగస్వామ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందని, చట్ట సభల్లో నామినేటెడ్ పోస్టులలో 50శాతం మహిళా రిజర్వేషన్లు కల్పించడం ద్వారా దేశ అభివృద్ధిలో మహిళా భాగస్వామ్యాన్ని సాధించడం సాధ్యమవుతుందన్నారు. ప్రజా పాలన పేరుతో నడుస్తున్న ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఆడబిడ్డ పెళ్లికి తులం బంగారం, మహిళా సాధికారతకు నెలకు రూ.2500 ఇప్పటికి అమలు కాలేదని వెంటనే వాటిని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పల్లా నర్సింహారెడ్డి, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ, మహిళా సమాఖ్య జిల్లా కన్వీనర్ గిరి రమ, నియోజకవర్గ నాయకులు అనిత, మంజుల, జ్యోతి, అలివేలు, సంగీత, సరిత, జ్యోతి, బద్రి, మమత, జహిర్‌పాషా, సుజాత, స్వాతి, గెల్వమ్మ, పార్వతమ్మ, సత్తమ్మ, సోమమ్మ, శ్వేత, ఇంద్రమ్మ, చంద్రమ్మ, లింగమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు. అనంతరం మహిళా సమాఖ్య దేవరకొండ నియోజకవర్గ నూతన కమిటిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## కమ్యూనిస్టులే దేశానికి రక్షణ

జనగామ జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి సిహెచ్ రాజారెడ్డి

**ప్రజాపక్షం/లింగాలఘణపురం :** కమ్యూనిస్టులతోనే దేశం రక్షణగా ఉంటుందని, జనగామ జిల్లా సిపిఐ పార్టీ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సిహెచ్ రాజారెడ్డి అన్నారు. మండలంలోని నెల్లుట్ల గ్రామంలో సిపిఐ 4వ మహాసభ నకిర్తి రాములు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా, జనగామ జిల్లా సిపిఐ జిల్లా కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే, సిహెచ్ రాజారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, రైతు కార్మిక ఐక్య త పోరాటాలే సిపిఐ లక్ష్యమని, శ్రమజీవుల గుండెల్లో ఎర్రజెండా నిలిచి ఉంటుందని, కమ్యూనిస్టు పార్టీతోనే, నవ సమాజ నిర్మాణానికి రక్షణ ఉంటుందని ఆయన తెలిపారు. అనంతరం, మండల కార్యదర్శిగా రావుల సదానందంలో, మండల సహాయ కార్యదర్శిగా, కులిపాక రవిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశానికి, జనగామ జిల్లా సిపిఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి ఆకుల శ్రీనివాస్ పాల్గొని మాట్లాడుతూ, కార్మికుల కర్షకుల, శ్రమజీవుల యువకులకు మహిళలకు, సిపిఐ పార్టీ ఎల్లప్పుడు అండగా ఉంటుందని, అవసరాలకు అనుగుణంగా రాష్ట్ర జాతీయ పార్టీ పింపు మేరకు పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కారే ఐలయ్య, చింతల పరుశ రాములు, ఆర్. రాజేష్, కే.భద్రయ్య, మబ్బు రవి, కొత్తపల్లి కనుక రాజ్, ఎమ్మచంద్రయ్య, కౌడె వెంకటేష్, వీరస్వామి, ఉపేందర్, గ్యార శేఖర్, గండి విజయ్, చీటూరు ఎల్లయ్య, జోగు పరశురాములు, పెండ్లి మల్లయ్య, నాకిరెడ్డి యాదగిరి రెడ్డి, బొట్ల మహేందర్, మల్లేష్, దండ్రాకుల సిద్ధులు, తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
నల్లగొండ, సూర్యాపేట యాదాద్రి, గద్వాల

## ఎల్ఆర్ఎస్ వసూలులో సూర్యాపేట మున్సిపాలిటి ముందంజ

మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాస్

**ప్రజాపక్షం/సూర్యాపేట:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేఅవుట్ రెగ్యూలరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్)లో 25 శాతం రాయితీ ఫీజు వసూలులో జిల్లాలో సూర్యాపేట మున్సిపాలిటి ముందంజలో ఉన్నదని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ తెలిపారు. సూర్యాపేట మున్సిపాలిటిలో 35,633 మంది ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేయగా 31,940 మందికి ఫీజు ఇంటిమేషన్ ఇవ్వగా 6585 మంది ఫీజు చెల్లించినట్లు, దానిలో భాగంగా ఫీజు 20కోట్ల75 లక్షలు వసూలు చేయటం జరిగిందని, జిల్లాలో మొదటి స్థానంలో ఉన్నదని తెలిపారు. ఇప్పటి వరకు ఎల్ఆర్ఎస్ నిబంధనల మేరకు 2472 మందికి ప్రొసిడింగ్‌లు జారీ చేయడం జరిగిందన్నారు. ఎల్ఆర్ఎస్ నిబంధనలు అనుసరించి అర్హత ఉన్న వారికి కూడా దశల వారిగా ప్రొసిడింగ్‌లు జారీచేయటం జరుగుతుందన్నారు. లబ్ధిదారులు తమపైల్ ప్రొసెస్ కోసం ఎల్ఆర్ఎస్ సిజిజన్ లాగిన్‌లో చూసుకొని నేరుగా ప్రొసిడింగ్ పొందవచ్చునని అన్నారు.

## వేర్వేరు కేసుల్లో ఇద్దరికి జైలుశిక్ష

**ప్రజాపక్షం/ నిడమనూరు:** రెండు వేరు వేరు కేసుల్లో నిందితులపై నేరం రుజువైనందున జైలు శిక్ష లేదా జరిమానా విధిస్తూ నిడమనూర్ సివిల్ కోర్ట్ జడ్జ్ స్వప్న తీర్పు చెప్పారు, ఆయా కేసులకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి 2018 అక్టోబర్ 15న తిరుమలగిరి మండలం తునికి నూతల గ్రామపంచాయతీ సెక్రటరీ ఉబ్బపల్లి శ్రవణ్ కుమార్ విధులకు అదే గ్రామానికి చెందిన రమావత్ దేవ్ నాయక్ ఆటంకం కల్పిస్తూ విధులను అడ్డుకోవడంతో పంచాయతీ కార్యదర్శి శ్రవణ్ కుమార్ ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై కురుమయ్య కేసు నమోదు చేసి కోర్టుకు పంపించడం జరిగింది మంగళవారం కేసు విచారించిన జడ్జి నిందితునికి నెలరోజుల జైలు శిక్ష లేదా 2000 రూపాయల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. అదేవిధంగా పెద్దవూర మండలం బోన్ తండా కు చెందిన కంచర్ల శ్రీనివాస్ కుంకుడు చెట్టు తండా వద్ద ఎలక్ట్రికల్ వస్తువుల రిపేర్ షాప్ పెట్టుకుని నడుపుతుండగా రిపేర్ కోసం ఫ్యాన్ ఇచ్చిన రమావత్ అతిరం 2016 ఆగస్టు 27న డబ్బులు ఇచ్చి ఫ్యాన్ తీసుకొని పోవలసిందిగా శ్రీనివాస్ కోరడంతో అతిరామ్ ఫ్యాన్ గడ్డతో శ్రీనివాసులు కొట్టడం జరిగింది. శ్రీనివాస్ భార్య దుర్గమ్మ ఫిర్యాదు మేరకు కేసు అప్పటి ఎస్సై ప్రసాద్ రావు కేసు నమోదు చేసుకోవడం జరిగింది. మంగళవారం కేసు విచారించిన ర్స్ జడ్జి స్వప్న నిందితునికి ఒక నెల జైలు శిక్ష లేదా 1000 జరిమానా తీర్పు చెప్పడం జరిగింది. ప్రాసిక్యూషన్ తరపున పి పి ఎం. సాధన వాదనలు వినిపించారు.

## సిఎంగా రేవంత్ అనర్హుడు

మాజీమంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి:** ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి అనర్హుడని రాష్ట్ర మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రతిష్టను దెబ్బతీసేలా రాష్ట్ర ఖజానా దివాళ తీసిందని పదే పదే చెబుతూ రాష్ట్ర ప్రతిష్టను దిగజారుస్తున్నాడని మండిపడ్డారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర ఖజాన దివాళ తీసిందని సిఎం చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. పరిపాలనచేసే దమ్ము లేకనే ఆయన దివాళకోరు మాటలు మాట్లాడుతున్నారని అన్నారు. రాష్ట్రం ఏర్పడ్డటప్పుడే తెలంగాణ అప్పులతో మొదలైందని ఆయన చెప్పారు. ఐనా పదేళ్ల కెసిఆర్ సిఎంగా రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తూ పాలన సాగించలేదా అని ప్రశ్నించారు. ఆదాయం వ్యయాలలో మాజీ సిఎం కెసిఆర్‌కు, ప్రస్తుత సిఎం రేవంత్‌కు చాల వ్యతాసం ఉందని అన్నారు. రేవంత్ మాట్లాడిన ప్రతి మాట పచ్చి అబద్దమని చెప్పారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిలను పట్టే ఆనాడు కెసిఆర్ ప్రజలకు హామీలు ఇచ్చారని, నేడు రేవంత్‌రెడ్డి అడ్డగోలు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అమలు చేయడం చేతకాక ఇప్పుడు చేతులేత్తేశాడని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రతిష్టను దిగజార్చిన సిఎం రేవంత్‌రెడ్డి నేడు మరింత నవ్వుల పాలయ్యాడని, తక్షణమే ఆయన తెలంగాణ సమాజానికి క్షమఫణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

## ఉద్యోగ కల్పనలో పాలకులు విఫలం



**ప్రజాపక్షం/చండూరు:** ఈనెల 15 నుండి 18 వరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతిలో జరుగనున్న ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గడ్డం నవీన్ అన్నారు. మంగళవారం చండూరులో ఆయన వైఎఫ్ నాయకులతో కలిసి మహాసభల కరపత్రంను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రవీన్ మాట్లాడుతూ ఉద్యోగ కల్పనలో కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం చెందాయని అన్నారు. భారతదేశంలో యువజన సామర్ధ్యాన్ని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆరోపించారు. ఉపాధి ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయకుండ ఏ ప్రభుత్వం కూడా ఉద్యోగఅవకాశాలు కల్పించలేవని అన్నారు. గత 10 సంవత్సరాలుగా వందలాది ప్రభుత్వ రంగ సంస్థలు మూతపడ్డాయని ,దేశంలో రోజురోజుకు నిరుద్యోగ సైన్యం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐవైఎఫ్ జాతీయ మహాసభలకు నల్లగొండ జిల్లా నుండి వేలాదిగా తరలివెళ్లి మహాసభలను జయప్రదం చేయాలని నవీన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ చండూరు మండల అధ్యక్షుడు కొండ్రెడ్డి సాయి కుమార్ , సైదులు ,లింగస్వామి ,శ్రీకాంత్ ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## అత్యధిక కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై న్యాయవాదుల సమావేశం

**ప్రజాపక్షం/యాదాద్రి :** జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ, యాదాద్రి భువనగిరి అధ్యక్షులు, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.జయరాజు జూన్ 14న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధిక కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాలోని న్యాయమూర్తులు, సహాయ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్, పోలీసు యంత్రాంగంతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ జూన్ నెలలో 14వ తేది రెండవ శనివారం జిల్లా వ్యాప్తంగా అన్ని కోర్టుల ప్రాంగణములలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు, ఈ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారానికి దాదాపు 3228 రాజీ పడదగు అన్ని క్రిమినల్ కేసులును గుర్తించినట్లు, ఈ కేసులలో పోలీసువారు కక్షిదారులకు నోటీసులు జారీ చేసి వారు రాజీ చేసుకోవటానికి అవకాశం కల్పించాలని, ఈ లోక్ అదాలత్ జూన్ 14వ తేది వరకు ప్రతీరోజు నిర్వహిస్తున్నట్లు, దీనికై ప్రిసిట్టింగ్స్ కూడా ఏర్పాటు చేయడమైనదని, ఈ ప్రి సిట్టింగ్స్‌లలో మధ్యవర్తిత్వ, సలహా, సంప్రదింపులు జరుపబడుతాయని తెలిపి, అత్యధిక కేసుల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై జిల్లాలోని న్యాయమూర్థులకు, పోలీసువారికి తగిన సూచనలు చేశారు. తదుపరి జాతీయ లోక్ అదాలత్ ప్రచార గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి వి.మాధవిలత, ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి ఉప్రశీ, ఎపిపిఒలు సౌజన్య, పద్మజ, చంద్రశేఖర్, అవినాష్, యాదగిరిగుట్ట ఎసిపి పి.రమేష్, ట్రాఫిక్ ఎసిపి యం.ప్రభాకర్ రెడ్డి, సర్కిల్ ఇన్స్పెక్టర్స్, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



# ఆటవికంగా మాట్లాడొద్దు

కేంద్రమంత్రి బండి సంజయ్‌పై మండిపడ్డ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం




**ప్రజాపక్షం/నల్లగొండ ప్రతినిధి:** కేంద్ర ప్రభుత్వంతో శాంతి చర్చలు జరిపేందుకు సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు ప్రకటిస్తే బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చర్చలు లేవు కాల్చి చంపుతామని ఆటవిక న్యాయాన్ని అమలు చేసే విధంగా మాట్లాడటం సరైందికాదని సిపిఐ జిల్లా కార్యదర్శి, ఎంఎల్‌సి నెలికంటి సత్యం విమర్శించారు. నల్లగొండ పట్టణ,మండల 15వ మహాసభ మంగళవారం స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయం, మగ్దూం భవన్‌లో జరిగింది.మహాసభకు ఎంఎల్‌సి సత్యం ముఖ్యతిధిగా హాజరై మాట్లాడుతూ దేశంలో ప్రజా స్వామ్య పరిరక్షణకు కేంద్ర ప్రభుత్వం కృషి చేయాలన్నారు.మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు పేద ప్రజలపై అన్ని రకాల ధరలు పెంచుతూ కార్పొరేట్ శక్తులకు,పెట్టుబడిదారులకు రాయితీలు కల్పిస్తున్నారని పేర్కొన్నారు. వివిధ దేశాలలో చమర ధరలు తగ్గుతున్నప్పటికి భారతదేశంలో మాత్రం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను నెలవారీగా పెంచుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందే విధంగా ప్రభుత్వ అధికారులు పారదర్శకంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అకాల వర్షం వల్ల రైతుల పండ్ల తోటలు,పంటలు విపరీతంగా దెబ్బతింటున్నాయని ప్రభుత్వ వ్యవసాయ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో సర్వే జరిపి నష్టపోయిన రైతులకు పరిహారం అందించాలని కోరారు. సిపిఐ సీనియర్ నాయకులు మల్లేపల్లి ఆదిరెడ్డి మాట్లాడుతూ పేద ప్రజల కోసం నిరంతరం పాటుపడుతున్న సిపిఐ పార్టీని బలోపేతం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. పట్టణంలో పేద ప్రజలందరికీ డబల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలని అదేవిధంగా వివిధ ప్రాంతాలలో గుడిసెలు వేసుకున్న గుడిసెవాసులకు ఇండ్ల పట్టా స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు నిర్మించాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పబ్బు వీర స్వామి మాట్లాడుతూ నల్లగొండ పట్టణ ప్రజలకు అందిస్తున్న తాగునీరు ఉదయ సముద్రం సామర్థ్యాన్ని పెరుగుతున్న జనాభాకు ఆధారంగా 1.5 టిఎంసిల నుంచి 3 టిఎంసిల వరకు సామర్థ్యాన్ని పెంచాలని కోరారు.ఈమహాసభకు సిపిఐ నాయకులు కేఎస్ రెడ్డి అధ్యక్షత వహించగా జిల్లా కార్యవర్గ సభ్యులు బలుగూరి నరసింహ, పట్టణ కార్యదర్శి గాదెపాక రమేష్ నాయకులు ముండ్ల ముత్యాలు,వి లెనిన్,ఎస్.కె మదర్,రేవెల్లి యాదయ్య, గుండె రవి,కోమటిరెడ్డి ప్రద్యుమారెడ్డి,పుట్టల సుజాత, ఎం కౌసల్య,జె విజయ పాల్గొన్నారు.

### రాబోయే రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రత్యామ్నాయంగా నిలబడుతుంది

**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** రాబోయే రోజుల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రత్యామ్నాయంగా నిలబడుతుందని శాసన మండలి సభ్యులు నెలికంటి సత్యం అన్నారు. మంగళవారం చిలుకూరు మండలం నారాయణపురంలో చిలుకూరు మండల 15వ మహాసభలో ఆయన ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. 100 సంవత్సరాల తర్వాత కమ్యూనిస్టు పార్టీ భారతదేశంలో నిలబడి ఉందంటే ప్రజలకు అండగా నిలబడటమే అన్నారు. మిగతా పార్టీలన్ని రంగులు మారే పార్టీలేనని విమర్శించారు. కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం పట్ల ఉద్యమాల పట్ల ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ వ్యూహత్మకంగా వ్యవహరించి విజయం సాధించాలన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పల్లా వెంకటరెడ్డి నాయకత్వంలో సిపిఐ పార్టీ బలంగా ఉందన్నారు. ఈ నాయకత్వం కృషితోనే ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఎమ్మెల్సీ స్థానం దక్కిందన్నారు. చిలుకూరు, హుజూర్‌నగర్‌తో పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పార్టీ అనేక గ్రామాల్లో బలంగా ఉందన్నారు. మండల కార్యదర్శి మండవ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాతీయ కార్యవర్గ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గన్నా చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, నాయకులు చేపూరి కొండలు, మేకల శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## 306మంది లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్, టూరిజం చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** సూర్యాపేట డివిజన్‌లో నాలుగు మండలాల్లోని 306 మంది లబ్ధిదారులకు 3.06 కోట్ల రూపాయలచెక్కులను పంపిణీచేసినట్లు సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రెవిన్యూ డివిజన్‌లోని సూర్యాపేట 143 మందికి, పెన్‌పహడ్ 55 మందికి, చివ్వెంల 66 మందికి, ఆత్మకూర్(ఎస్) 42 మందికి, ఒక్కొక్కరికి 1,00116 రూపాయలు నిరుపేద యువతుల వివాహం కోసం అందజేయడం జరిగిందని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ద్వారా కళ్యాణలక్ష్మి , షాదిముబారక్ చెక్కులు వచ్చిన ఆడపడుచలందరికి కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. ఆడపిల్లలు న్యూట్రిషన్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని, జీవనంలో ఆహారం బాగా కావాలని, ఆహారంలో అన్ని పోషకాలు లేకపోవడం వల్ల వివిధ వ్యాధులు దానిలో ముఖ్యంగా ఎనీమియా సమస్య వస్తుందని తెలిపారు. తెలంగాణ టూరిజం చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాలలో వివాహలు చేయుటకు ఆర్థికంగా చేయూత ఇవ్వాలని అనంతరం సూర్యాపేట శాసనసభ్యులు జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ పేద ఆడపిల్లలకు ఒక లక్ష 116 రూపాయలు అందించడం ప్రపంచంలోనే ఏ రాష్ట్రంలో లేదని ఒక్క తెలంగాణలోనే ఉందని, అది మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ప్రవేశపెట్టిన ఘనత అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో వేణుమాదవ్, సూర్యాపేట తహసిల్దార్ శ్యాంసుందర్‌రెడ్డి, పెన్‌పహడ్ తహసిల్దార్ లాలు, ఆత్మకూర్ ఎస్ తహసిల్దార్ హరికిషోర్,చివ్వెంల తహసిల్దార్ కృష్ణయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/యాదాద్రి :** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అండెం సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ క్రియాశీల కార్యకర్తల సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, అబ్జర్వర్ మాజీ జడ్పి చైర్మన్ ధన్వంతరి, ఇంఛార్జి డాక్టర్ అనిల్ ముఖ్యఅతిథిలుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత ఎలక్షన్స్ పై సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని, రాహుల్ గాంధీ ఆలోచన మేరకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓ వైపు సంక్షేమం, మరోవైపు అభివృద్ధిలో రాష్ట్రాన్ని నడిపిస్తున్నారన్నారు. కాంగ్రెస్ గ్రామ శాఖలను, మండల పార్టీలను, బ్లాక్ అధ్యక్షులను, జిల్లా కార్యవర్గాన్ని నియమించుకొని పార్టీని ప్రతిష్టాత్మకంగా బలంగా రూపొందించాలని ఈ సమీక్ష సమావేశం నిర్వహించుకోవటం జరిగిందన్నారు.

## గ్రామాల్లో భూ భారతి సదస్సులు

జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్



**ప్రజాపక్షం/ఎర్రవల్లి:** రైతులు భూభారతి రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకుని తమ భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం పొందాలని జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ తెలిపారు. మంగళవారం ఇటిక్యాల మండలం వావిలాల గ్రామంలో ఏర్పాటు చేసిన భూ భారతి రెవెన్యూ సదస్సుకు కలెక్టర్ పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. రైతులతో ముఖాముఖి మాట్లాడి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెడుతున్న భూ భారతి (ఆర్వోఆర్) చట్టం అమలులో భాగంగా జిల్లాలో ఇటిక్యాల మండలాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 28 జిల్లాలోని 28 మండలాల్లో భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు నిర్వహించబడుతున్నట్లు తెలిపారు. ధరణి స్థానంలో భూ భారతి భూమి హక్కుల చట్టం తీసుకురావడం జరిగిందని తెలిపారు. .మొదటి రోజు భూ సమస్యలపై గోపాల్ దీన్నె గ్రామంలో 21 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లక్ష్మీ నారాయణ, ఇటిక్యాల తాహసీల్దార్ వీరభద్రప్ప, ఎర్రవల్లి తహసీల్దార్ నరేష్, రైతులు తదితరులు ఉన్నారు.

## 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించేంతవరకు ఎన్నికలు నిర్వహించొద్దు

బిసి హక్కుల సాధన సమితి జిల్లా మహాసభలు జయప్రదం చేయాలి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయనాయుడు



**ప్రజాపక్షం/కోదాడ:** ఈనెల 13వ తేదీన కోదాడ మున్సిపల్ పరిధిలోని బాలాజీనగర్ ఎల్ఐసి బిల్డింగ్‌లో జరగనున్న బిసి హక్కుల సాధన సమితి 3వ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు విజ్ఞప్తి చేశారు. మంగళవారం కోదాడ బిసి కార్యాలయంలో మహాసభల కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జనాభా నిష్పత్తి ప్రకారం బిసిలకు విద్య, ఉద్యోగ ఉపాధి రంగాల్లో చట్టసభల్లోనూ సరైనబరోసా లభించడంలేదని, ఇటీవల కాలంలో బిసి ఐక్యత వల్ల తెలంగాణ రాష్ట్రంలో కులగణన చేపట్టడం బిసిల విజయమని, బిసి ఉద్యమాలకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం కూడా కుల గణనకు పచ్చజెండా ఊపిందని ఇది బిసిల మరో విజయని అన్నారు. స్థానిక సంస్థల్లో 42 శాతం బిసిల రిజర్వేషన్లు ప్రకటించేంతవరకు ఎన్నికలు నిర్వహించవద్దని, కేంద్రంలో పెండింగ్‌లో ఉన్న తెలంగాణ రాష్ట్ర బిసి రిజర్వేషన్ బిల్లును షెడ్యూల్ నైన్‌లో చేర్చడం ద్వారా తెలంగాణలోని బిసిలకు న్యాయం చేయాలని కోరారు. 13న కోదాడలో జరగనున్న బిసి హక్కుల సాధన సమితి జిల్లా మహాసభకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బిసి నాయకత్వం హాజరవుతున్నారని, ఈ మహాసభ విజయవంతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల శ్రీనివాసరావు, బిసి హక్కుల సాధన సమితి నాయకులు పిల్లుట్ల కనకయ్య, సిరాపురపు శ్రీనివాస్, సుల్తానీ వెంకటేశ్వర్లు, అంజయ్య, సిద్దుల రాములు, జిల్లా శ్రీను, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీ ధాన్యం గింజను కొంటాం

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ(గుర్రంపోడు):** రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను కొంటామని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. రబీ ధాన్యం కొనుగోలు లో భాగంగా ఇప్పటివరకు జిల్లాలో 4 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం జరిగిందని, నిజామాబాద్ తర్వాత అత్యధికంగా ధాన్యం కొనుగోలు చేసిన జిల్లాలలో నల్లగొండ రెండవదని తెలిపారు. వర్షం వచ్చినప్పటికి రైతులు ఎలాంటి ఇబ్బంది పడాల్సిన అవసరం లేదని, వారం రోజుల్లో జిల్లాలో ధాన్యం కొనుగోలును పూర్తి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు.మంగళవారం జిల్లా కలెక్టర్ గుర్రంపోడు మండలం కొప్పోలు, గుర్రంపోడు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడ లారీల సమస్య ఉత్పన్నమైందని తెలుసుకొని తక్షణమే ఈ రెండు కేంద్రాలకు వెళ్లి సమస్య పై అక్కడి రైతులు, స్థానికులతో మాట్లాడారు. లారీల సమస్య లేకుండా లారీలను ఎప్పటికప్పుడు పంపించే ఏర్పాటు చేస్తామని అన్నారు. ఒకే మిల్లుకు నాలుగైదు లారీలు పంపించకుండా ఆ పరిధిలో ఉన్న అన్ని మిల్లులకు ఒక్కో లారీ పంపించాలని, అప్పుడే ధాన్యాన్ని వెంట వెంటనే దించుకోవడం కొనుగోలు కేంద్రాలనుండి పంపించడం సులభం అవుతుందని, లేదంటే ఒకే మిల్లుకు పంపించినట్లయితే దిగుమతి చేసుకోవడంలో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. ఒకవేళ కేటాయించిన లారీలు సరిపోకపోతే అదనంగా స్థానికంగా లారీలను ఏర్పాటు చేయాలని తహసిల్దార్ శ్రీనివాసులు ఆమె ఆదేశించారు. మిర్యాలగూడ సబ్ కలెక్టర్, రెవెన్యూ అదనపు ఇన్చార్జి కలెక్టర్ నారాయణ అమిత్, జిల్లా పౌరసరఫరాల మేనేజర్ హరీష్, జిల్లా సహకార అధికారి పత్యా నాయక్, తహసిల్దార్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు. కాగా కొప్పోలు, గుర్రంపోడు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రాథమిక వ్యవసాయ సహకార సం ఘం ద్వారా నిర్వహిస్తుండగా, ఈ రెండు కేంద్రాలలో రికార్డుల నిర్వహణ ,తేమ అన్ని సక్రమంగా ఉండడం పట్ల జిల్లా కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు.

## గ్రామపంచాయతీ కార్యదర్శులతో జెడ్పి సిఇఒ సమీక్ష

**ప్రజాపక్షం/వలిగొండ :** వలిగొండ మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయాన్ని జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎన్.శోభారాని సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మండల స్థాయి అధికారులతో, ఈజీఎస్ సిబ్బంది , పంచాయతీ కార్యదర్శులతో సమీక్షా సమావేశం నిర్వహించినారు. అనంతరం వలిగొండ మండలం నాతాళ్ళగూడెం గ్రామపంచాయతీ, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పరిశీలించారు. లింటల్ లెవెల్ నిర్మాణం చేసిన జూకంటి మనోహర్ అనే లబ్ధిదారుని ప్రశంసించారు. బేస్మెంట్ లెవెల్ నిర్మాణం చెయ్యని వారు త్వరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. అనంతరం నర్సరీ, సన్న బియ్యం పంపిణీ పరిశీలించారు. అక్కంపల్లి లోని ఐకెపి సెంటర్‌ను పరిశీలించారు.

## ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా సిపిఐ నిత్యం ప్రజా సమస్యలపై పోరాటం

**ప్రజాపక్షం/చండూరు :** ఓట్లు ,సీట్లతో సంబంధం లేకుండా ప్రజా సమస్యలపై నిత్యం పోరాటం చేసేది కేవలం కమ్యూనిస్టులు మాత్రమేనని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నల్పరాజు రామలింగయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని కస్తాల గ్రామంలో జరిగిన సిపిఐ శాఖ మహాసభకు ముఖ్య అతిధిగా హజరైయారు. గ్రామ కూడలిలో ఏర్పాటు చేసిన పార్టీ అరుణ పతాకాన్ని పార్టీ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం జరిగిన శాఖ మహాసభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని అన్నారు. సిపిఐ మండల కార్యదర్శి నల్పరాజు సతీష్ కుమార్ మాట్లాడుతూ ఈ నెల 12న దోనిపాముల గ్రామంలో జరుగు సిపిఐ మండల మహాసభను జయప్రదం చేయాలని అన్నారు. కస్తాల గ్రామంలో సిపిఐ బలోపేతానికి ప్రతి కార్యకర్త సైనికుడిలా పని చేయాలని అన్నారు. గ్రామంలో అర్హులైన ప్రతి పేదకుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని ,అదే విధంగా నూతన రేషన్ కార్డులు , ఆసరా పెన్షన్‌లు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. కస్తాల రైతులకు సాగు నీరు అందించాలంటే ఎంతో కాలం నుంచి పెండింగ్‌లో ఉన్న శేశిలేటి వాగు ఫీడర్ ఛానల్ పనులను పూర్తి చేయాలన్నారు. అనంతరం గ్రామ శాఖ నూతన కార్యదర్శిగా జోగి రమేష్ ఏకగ్రీవంగా ఎన్నికైయారు. కట్ట వెంకన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండల కార్యవర్గ సభ్యులు బొడ్డు వెంకటేశ్వర్లు , గంట రమేష్ , బరిగెల వెంకన్న, బండమీది వెంకన్న, గీత పనివారల సంఘం మండల అధ్యక్షుడు గంట నగేష్ పాల్గొన్నారు.



# స్థానికం REGIONAL NEWS
మహబూబ్‌నగర్, నారాయణపేట, వనపర్తి, నాగర్‌కర్నూల్

## జై బాపు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని ప్రారంభించిన వాకిటి శ్రీహరి



**ప్రజాపక్షం/మక్తల్ :** మక్తల్ నియోజకవర్గ శాసనసభ్యులు డా.వాకిటి శ్రీహరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రశాంత్ కుమార్ రెడ్డి నారాయణపేట జిల్లా అడ్వైజర్లు వేణుగౌడ్ సంధ్యారెడ్డి ఏఐసిసి కోఆర్డినేటర్ సుమాన్ టిపిసిసి జనరల్ సెక్రెటరీ ధారా సింగ్ నాయక్ గ్రంథాలయ చైర్మన్ విజయ్ కుమార్ కాంగ్రెస్ నాయకులు బాలకృష్ణ రెడ్డి ఈ కార్యక్రమంలో మక్తల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు , కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## వేసవి శిబిరాన్ని సందర్శించిన కలెక్టర్



**ప్రజాపక్షం/నారాయణపేట :** జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ గ్రౌండ్ ఉన్నత పాఠశాలలో ప్రారంభమైన వేసవి శిబిరాన్ని మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. శిబిరానికి వచ్చిన విద్యార్థులతో మాట్లాడారు. శిబిరంలో ఉపాధ్యాయులు ఏమేమి నేర్పిస్తున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. శిబిరానికి వచ్చే విద్యార్థులకు యోగాతో పాటు ఆంగ్లం, గణితం, భౌతిక శాస్త్రం పై మంచి పట్టు వచ్చేలా తర్ఫీదు ఇవ్వాలని అక్కడి ఉపాధ్యాయులకు కలెక్టర్ సూచించారు. ముఖ్యమంగా తొమ్మిదో తరగతి ఉత్తీర్ణత సాధించి పదోతరగతి కి వెళ్లే విద్యార్థులకు ఆయా సబ్జెక్టులలో సామర్థ్యాన్ని పెంచేలా ఇప్పటి నుంచే శిక్షణ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానాన్ని పెంచాలన్నారు. శిబిరంలో రోజు వారీగా ఏఏ అంశాలలో శిక్షణ ఇచ్చారనే విషయాలను రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే ఈ 15 రోజుల పాటు క్రమం తప్పకుండా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలని ఆమె సూచించారు.

## బిసి జాగృతి సేన ఉపాధ్యక్షుడిగా మండల వాసి



**ప్రజాపక్షం/మద్దూర్ :** రాష్ట్ర బిసి జాగృతి సేన రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మద్దూరు వెంకటేశ్ యాదవ్‌ను నియమిస్తూ నియామకపత్రం అందజేసిన బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య, వ్యవస్థాపక అధ్యక్షులు బొరుగుపల్లి కృష్ణయాదవ్, విద్యానగర్‌లోని బిసి భవన్‌లో బిసి సంఘం దళపతి కృష్ణయ్యను శాలువాతో కప్పి సన్మానించారు. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి బిసి ఉద్యమాన్ని ఉధృతం చేయాలని ప్రజల్లో రాజకీయ చైతన్యం కల్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయం బిసి దళపతి ఆర్.కృష్ణయ్య సుదీర్ఘపోరాటం ఫలమే అని బిసి జాగృతి సేన వ్యవస్థాపక అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ అన్నారు. వెంకటేశ్ యాదవ్ మాట్లాడుతూ ఉన్నత బాధ్యతలు అప్పగించి నియవుపత్రాన్ని అందజేసిన ఆర్.కృష్ణయ్యకు బూరుగుపల్లి కృష్ణ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

## పదవ తరగతి విద్యార్థినికి సన్మానం



**ప్రజాపక్షం/నారాయణపేట జిల్లా :** పేద విద్యార్థులను ప్రోత్సాహిస్తున్న భీష్మరాజ్ ఫౌండేషన్ పదవ తరగతిలో 566/600 మార్కులను సాధించిన విద్యార్థిని హరిషను మంగళవారం నారాయణపేటలో భీష్మరాజ్ ఫౌండేషన్ చైర్మన్ డా.కె.రాజ్ కుమార్ రెడ్డి శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ప్రతిభ కలిగిన విద్యార్థిని విద్యార్థులను ఉన్నత విద్య వైపు మళ్లించాలని తల్లిదండ్రులను ఉపాధ్యాయులను కోరారు. ఉన్నత విద్య చదువుకునే విద్యార్థులను తమ ఫౌండేషన్ ప్రోత్సాహిస్తుందని తెలిపారు. విద్యార్థిని హరిష తండ్రి బాలు నాయక్‌తో పాటు ఫౌండేషన్ సభ్యులు పోలీసు పటేల్ మధుసూదన్ రెడ్డి, నర్సింహనాయుడు, రుద్రారెడ్డి, అశోక్, ఎం.సంతోష్, గోపాల్‌రెడ్డి, నందుకుమార్ తదితరులు ఉన్నారు.

## ప్రణాళికతో చదివితే విజయం సాధ్యం



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** నారాయణపేట జిల్లా కేంద్రంలోని బికెఎస్ కోచింగ్ సెంటర్‌లోని విద్యార్థులకు చదువుపై శ్రద్ధ, పోటీ పరీక్షలకు సన్నద్ధ, సైబర్ నేరాలు, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్ వినియోగానికి దూరంగా ఉండాలని తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుండి చదువుపై పట్టు సాధించాలని, ఏకాగ్రతతో ప్రణాళికబద్ధంగా చదివి ఉన్నత ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో ప్రభుత్వ ఉద్యోగం పొందడం సులువు కాదని, గట్టిగా ప్రయత్నిస్తే, అసాధ్యం ఏమీ ఉండదని ఎస్సై అన్నారు. అలాగే సైబర్ నేరాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎవరైనా అత్యవసర సమయంలో డయల్ 100 కు కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బికెఎస్ కోచింగ్ డైరెక్టర్ నవిత బికెఎస్, వెంకట్ రాములు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ట్రెసా జిల్లా అధ్యక్షుడిగా సి.నరసింహారావు

**ప్రజాపక్షం/జడ్చర్ల :** తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ ట్రెసా మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా సి.నర్సింగరావు, ఎంపికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా దేవరకద్ర డిప్యూటీ ఎమ్మార్వో కాలేద్దీన్ ఎక్బాల్, అసోసియేట్ అధ్యక్షుడిగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్ ఏవో శంకర్ ఎంపికయ్యారు. ఇవాళ హైదారాబాద్ ట్రెసా భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ట్రెసా మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడిగా నర్సింగరావు ను ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా ఎన్నికైన నర్సింగరావును ప్రస్తుతం జడ్చర్ల తాసీల్దార్‌గా కొనసాగుతున్నారు. ప్రసాద్ రాష్ట్ర నాయకులు వంగ రవీందర్ రెడ్డి, గౌతమ్ లతో పాటు రాష్ట్ర నాయకులు ఈ ఎంపిక కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ నెల 21న మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్న ప్రమాణ స్వీకార కార్యక్రమంలో నూతన అధ్యక్ష కార్యదర్శులు అసోసియేటెడ్ అధ్యక్షుడు బాధ్యతలు స్వీకరించనున్నట్లుగా తెలుస్తోంది.




# వ్యవసాయం లాభసాటిగా మారాలి





**ప్రజాపక్షం/బిజినేపల్లి :** వ్యవసాయం లాభసాటిగా మారాలని డాక్టర్ అర్చన అన్నారు. రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం పాలెం బిఎస్‌సి అగ్రికల్చర్ కళాశాల శాస్త్రవేత్తలు మండలంలోని మంగనూరు గ్రామంలో రైతులకు అవగాహన సదస్సు మంగళవారం రైతువేదిక నిర్వహించారు. ఈసందర్భంగా శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు ప్రతిసంవత్సరం ఒకేపంటను సాగుచేయకుండా పంటమార్పిడి చేయాలని పంటమార్పిడితో పంట నాణ్యత దిగుబడి ఎక్కువగా వస్తుందన్నారు. మృత్తిక శాస్త్రవేత్త విలాకర్ మాట్లాడుతూ నేలను కాపాడుకోవడం మన అందరి బాధ్యత అని గుర్తు చేశారు. విచ్చలవిడిగా నేలపై యూరియా ఇతర రసాయన ఎరువులు, మోతాదుకు మించివాడటం వలన నేల సారవంతం కోల్పోయి దిగుబడులు తగ్గుతాయని వారు రైతులకు తెలిపారు. ఎక్కువగా సేంద్రీయ ఎరువులైన పశువులపేడ పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసి కలియదున్నాలన్నారు. దీనివలన నేలలో సారవంతం పెరిగి మంచి దిగుబడులు పొందే అవకాశం ఉందన్నారు. అంతేకాకుండా భూసారపరీక్షలు చాలా కీలకమైనదని తెలిపారు. అనంతరం రైతులు ఏరకాల పంటలు ఎప్పుడు సాగుచేయాలని మండల వ్యవసాయాధికారిణి నీతి రైతులకు క్షుణ్ణంగా వివరించారు. కార్యక్రమంలో బిఎస్‌సి కళాశాల విద్యార్థులు రాహుల్, మమత, శ్రేయ రైతులకు నేల లో పోషకాలపాత్ర గురించి ప్రదర్శనలద్వారా వివరించారు.

### వెల్కిచర్ల గ్రామంలో

వెల్కిచర్ల గ్రామంలో డాక్టర్ చరణ్‌తేజ్ రైతులకు నేల స్వభావం , నేల ఎంపిక ఏఏ నేలలో ఎలాంటి రకాల విత్తనాలను సాగుచేసుకోవాలని స్వల్పకాలిక దీర్ఘకాలిక రకాలను సాగుచేసి మంచి నాణ్యతతోపాటు దిగుబడులను పొంది రైతన్నలు సకాలంలో పంటకోతకువచ్చే విధంగా చూసుకోవాలని వారికి సూచించారు. నేడు వ్యవసాయరంగంలో రోజురోజుకు వస్తున్న విప్లవాత్మకమార్పులకు అనుగుణంగా రైతన్నలుకూడా మారి సాంకేతికపరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని కోరారు. తమ కళాశాల శాస్త్రవేత్తలు పరిశోధన శాస్త్రవేత్తలు వ్యవసాయ అధికారుల సలహాలు సూచనలుపాటించి రైతులు కేవలం సాంప్రదాయ పంటలుసాగుచేసి నష్టపోకుండా వాణిజ్యపరమైన పంటలుసాగుచేసి ఆర్థికంగా ఎదగాలని కోరారు. కార్యక్రమంలో ఏవో మురళిధర్, ఏఈవో శ్రీనివాస్, ఆదర్శరైతులు పాల్గొన్నారు.

## వ్యవసాయ పంటల ఆవశ్యకతపై అవగాహన

**ప్రజాపక్షం/కల్వకుర్తిరూరల్ :** కల్వకుర్తి మండలం తోటపల్లి క్లస్టర్ పరిధిలోని సుద్దకల్ గ్రామంలో రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో వ్యవసాయ మెలుకువలు ప్రస్తుతమున్న పరిస్థితులలో పంటల ఆవశ్యకతపై రైతులకు అవగాహన కల్పించడంతోపాటు మెలుకువలు తెలపడం జరుగుతుందని ఏఈఓ తరుణ్ తెలిపారు. ఈసమావేశానికి రైతులు, గ్రామప్రజలు, ప్రజాప్రతినిధులు, యువకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## మంత్రులను కలిసిన జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి



**ప్రజాపక్షం/వంగూర్:** నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ముత్యాల లక్ష్మారెడ్డి మంగళవారం హైదరాబాద్‌లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఐటిశాఖమంత్రి శ్రీధర్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈసందర్భంగా మంత్రులతో మాట్లాడుతూ రాబోయే స్థానికసంస్థల ఎన్నికల్లో సుదీర్ఘకాలంగాపార్టీలో పని చేసినవారికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పిసిసిఫోక్ పర్సన్ బెక్కం వేణుగోపాల్‌రెడ్డి, కస్తూరిఫౌండేషన్ సభ్యులు కంకణాల నర్సిరెడ్డి పాల్గొన్నారు.

## సమ్మె విజయవంతం చేయండి

**ప్రజాపక్షం/వంగూర్ :** ఈనెల 20న చేపట్టనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతంచేయాలని సిఐటియు జిల్లానాయకులు బండపల్లి శివరాములు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో ఆశా కార్యకర్తలతోకలిసి సమ్మె నోటీసులను వైద్యాధికారిణి డాక్టర్ శృతికి అందజేశారు. ఈసందర్భంగా శివరాములు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలకు పాల్పడుతుందని ఆయన విమర్శించారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు, యూనియన్ అధ్యక్షురాలు సూర్యకళ, సభ్యులు సుమతమ్మ, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం సహాయ నిధిని చెక్కులు పంపిణీ

**ప్రజాపక్షం / కొత్తకోట :** దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి ఆదేశాల మేరకు కొత్తకోట మున్సిపాల్టీకి చెందిన 11 మంది సిఎం రిలీఫ్ ఫండ్ లబ్దిదారులకు, ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మార్కెట్ చైర్మన్ పల్లెపాగ ప్రశాంత్ లబ్దిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేద, మధ్య తరగతి కుటుంబాలకు కాంగ్రెస్ సర్కార్ వివిద రూపాల్లో సహాయం అందిస్తుందని ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న నిరుపేదలకు సహాయంగా సీఎం రిలీఫ్ ఫండ్ ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొత్తకోట టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి. అరుణ్ , శ్రీనివాస్ , జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి పాపయ్య, కృష్ణారెడ్డి, జిల్లా రైతు నాయకులు శ్రీనివాస్ రెడ్డి, జనరల్ సెక్రటరీ ఎల్లంపల్లి నరేందర్ రెడ్డి, మాజీ కో ఆప్షన్ సభ్యులు జేఎం మిషేక్ , రవీందర్ రెడ్డి, దేవస్థానం డైరెక్టర్ బాదం వెంకటేష్ , సీనియర్ నాయకులు ముజీబ్ , యాదయ్యసాగర్ , మైనార్టీ నాయకులు తయాబ్ , ముస్తఫా, ఇజాజ్ అల్లి, మతిన్ , నాజీర్ , 2వ వార్డు ఇంచార్జీ ముంత బాలరాజు యాదవ్ , పదో వార్డు శ్యాం, అంజన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## భూ సమస్యల సత్వర పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

కలెక్టర్ విజయేందిర బోయి



**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ (మూసాపేట్ ) ప్రతినిధి** : భూ సమస్యలను సత్వరము పరిష్కరించాలనే కృత నిశ్చయంతో ప్రభుత్వం భూభారతి రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తోందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. భూ భారతి పైలట్ ప్రాజెక్టు మూసాపేట్ మండలంలో రెవెన్యూ సదస్సులో భాగంగా మంగళవారం జానం పేట గ్రామం మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో, వేముల గ్రామం రైతు వేదికలో నిర్వహించిన సదస్సులలో కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తో కలిసి పాల్గొన్నారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ, దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్క్ తదితర వాటిని సందర్శించి, రైతుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న తీరును పరిశీలించారు. సదస్సులతో రైతుల నుండి భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా భూ భారతి విధివిధానాల గురించి, చట్టంలో పొందుపర్చిన అంశాల పై అవగాహన కల్పించారు. రెవెన్యూ అధికారులతో కూడిన బృందాలు అందుబాటులో ఉంటూ భూ సంబంధిత సమస్యల పై దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. రెవెన్యూ సదస్సులలో ఉచితంగా నిర్ణీత దరఖాస్తు ఫారంలు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రైతులు దరఖాస్తు నింపి అధికారులకు సమర్పించాలన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపిన మీదట నిర్ణీత గడువులోపు భూ భారతి చట్టం ప్రకారం సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని కలెక్టర్ సూచించారు. ప్రస్తుతం పైలెట్ ప్రాతిపదికన మూసాపేట్ మండలంలో అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతులు ప్రజలు ఈ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ సదస్సులలో తహశీల్దార్ రాజు , ఇతర అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో 9 కెజిబివిలు ఇంటర్ వరకు అప్‌గ్రేడ్

- నూతనంగా కెజిబివిల్లోను ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్
- జిల్లాలో 20 కేజిబివిల్లో ఇంటర్‌వరకు తరగతులు



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి:** నాగర్‌కర్నూల్ జిల్లాలో మరో 9 కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం (కెజిబివి) ఇంటర్మీడియట్ వరకు అప్‌గ్రేడ్‌చేస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. నాగర్‌కర్నూల్ జిల్లాలో గత ఏడాది వరకు 11కెజిబివిల్లో ఇంటర్ తరగతులు కొనసాగగా ఈ విద్యా సంవత్సరం నుంచి 9కెజిబివిలను అప్‌గ్రేడ్‌చేసి ఇంటర్ తరగతులను రానున్న విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ మొదటి సంవత్సరం తరగతులను ప్రారంభించనున్నారు. జిల్లాలోని 20 కేజిబివిల్లో 5,740మంది బాలికలు చదువుకుంటుండగా వారికి ప్రభుత్వం అన్నిరకాల వసతి సౌకర్యాలను కల్పిస్తూ నాణ్యమైన విద్యను అందిస్తున్నది. బాలికలకు భద్రతతో పాటు మంచి విద్య అందుతుండటంతో కెజిబివిలలో తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఉత్సాహం చూపుతున్నారు.

**నాగర్‌కర్నూల్ జిల్లాలో :** జిల్లాలోని నాగర్‌కర్నూల్, తిమ్మాజిపేట, బిజినేపల్లి, తాడూరు, తెలకపల్లి, పెద్దకొత్తపల్లి, కొల్లాపూర్, పెంట్లవెల్లి, కోడేర్, కల్వకుర్తి, వెల్దండ, చారకొండ, ఊర్కొండ, వంగూర్, ఉప్పునుంతల, అచ్చంపేట, బల్మూర్, లింగాల, అమ్రాబాద్, పదర మండలాల్లో కేజిబివిలు ఉన్నాయి.

### బాలికలు ఆత్మస్థైర్యంతో రాణించేలా శిక్షణ



కేజిబివిల్లో విద్యార్థినిలకు చదువుతోపాటు భోజనం, ఇతర వసతిసౌకర్యాలను సమకూరుస్తున్నాం. ఇంటర్ పూర్తికాగానే విద్యార్థినిలు ఎంసెట్, నీట్, టిటిసి, డిఎడ్,లాసెట్ పరీక్షలురాసేలా ప్రోత్సహిస్తూ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నాం. వృత్తివిద్యకోర్సులతోపాటు కుట్లు, అల్లికలు, కరాటేవంటి వాటిల్లో శిక్షణ ఇవ్వడంతోపాటు భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లను సులభంగా ఎదుర్కొనేలా పలు కార్యక్రమాలద్వారా తీర్చిదిద్దుతున్నాం. నూతనంగా ఇంటర్‌వరకు అప్‌గ్రేడ్‌అయిన కేజిబివిలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ తరగతులను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

**– జిల్లా కేజిబివిల పర్యవేక్షణ అధికారిణి ఇటికెల శోభారాణి**

### కెజిబివిలకు ఆదరణ పెరిగింది



పేదరికంతో అర్థాంతరంగా బడులకు దూరమైనవారు, తల్లిదండ్రులు కోల్పోయిన బాలికలకు ఉచిత విద్యాభ్యాసంకోసం ఏర్పాటుచేసిన కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాలు(కేజిబివి) బాలికలకు బాసటగా నిలుస్తున్నాయి. విద్యతోపాటు భోజనం, వసతి సౌకర్యాలను సమకూరుస్తుండటంతో గ్రామీణప్రాంత బాలికలు వాటిపై మొగ్గుచూపుతున్నారు. 2005లో ఏర్పాటుచేసిన వాటికి మొదట్లో ఆదరణ తక్కువే ఉన్నా ఇప్పుడు ప్రవేశాలకు పోటినెలకొంది. 6నుంచి 10వతరగతివరకు మొదట్లో వాటిల్లో బోధించగా, 2018లో పలు కేజిబివిల్లో ఇంటర్‌విద్య ప్రవేశపెట్టారు. కొన్నింటికే పరిమితమైన ఇంటర్‌విద్యను మిగిలిన అన్నింట్లో ప్రవేశపెట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ప్రభుత్వ ఉత్తర్వులకు అనుగుణంగా ఇంటర్ తరగతులకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

**– జిల్లావిద్యాశాఖ అధికారి ఎ.రమేష్‌కుమార్**

## దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేద్దాం





**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** దేశవ్యాప్తంగా మే 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మున్సిపల్ సంఘం రాష్ట్రకార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఈ సమ్మెను జయప్రదం చేయాలని మంగళవారం నాగర్‌కర్నూల్ మున్సిపల్ కమీషనర్ నరేష్‌బాబుకు నాగర్‌కర్నూల్‌జిల్లా ఎఐటియుసి కార్యదర్శి శివశంకర్‌తో కలిసి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ కార్మికులు 102 సంవత్సరాలనుండి పోరాడి సాధించుకున్న కార్మికచట్టాలను కార్మికుల హక్కులను రద్దు చేస్తూ కేంద్రప్రభుత్వం 44కార్మిక చట్టాలతో 29కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగుకోడ్లుతెచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నదన్నారు. కేంద్రప్రభుత్వం కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలతో 47కోట్లమందికి నష్టం కలుగుతున్న సందర్భంలో భారతదేశంలో ఇప్పటికే 27సార్లు సమ్మెలు చేసి నాలుగుకోడ్లు అమలుకాకుండా ఆపడం జరిగిందన్నారు. కావున మే20న జరిగే ఒకరోజుదేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొనేందుకు సహకరించాలని కమీషనర్‌కు సమ్మె నోటీసు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లానాయకులు డి.వెంకటస్వామి, సింగోటం పాల్గొన్నారు.

## 'హలో యువత – చలోతిరుపతి' వాల్‌పోస్టర్ విడుదల



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** దక్షిణ భారతదేశంలో చారిత్రక, ఆధ్యాత్మిక, లౌకిక కేంద్రంగా ప్రపంచ ప్రసిద్ధిచెందిన తిరుపతిలో అఖిలభారత యువజన సమాఖ్య ఎఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బిజ్జశ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈమహాసభలకు దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాల నుండి వెయ్యి మందికి పైగా యువజన ప్రతినిధులు హాజరవుతున్నారని ఆయన తెలిపారు. ఎన్‌డిఎ ప్రభుత్వం అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలు, రాజకీయాలు, నియంతృత్వ కార్పొరేట్ విధానాలు, విద్య,వైద్యం, ఉపాధి హక్కులకోసం , సామాజిక, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక విలువలు తదితర అంశాలు, కార్పొరేట్ కబంధహస్తాల్లో నలుగుతున్న చట్టసభలు, రాజకీయాలు, మీడియా విలువలు, రక్షణకోసం చర్చించి భవిష్యత్తు కార్యాచరణ చేపట్టనున్నారు. కావున యువత పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు కేశముల శివకృష్ణ, ఎఐవైఎఫ్ నాయకులు సత్యం, వెంకటయ్య, శేఖర్, మధు, జీవన్, ఆంజనేయులు, కృష్ణ, శేఖర్, వెంకటయ్య, సుధీర్, నరేష్ పాల్గొన్నారు.

## పెబ్బేరు సంత పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చలి వేంద్రాల ఏర్పాటు



**ప్రజాపక్షం / పెబ్బేరు** : పెబ్బేరు పట్టణానికి వివిధ గ్రామాల నుండి సొంత పనులు , వ్యాపారాల నిమిత్తం వచ్చే ప్రజల దాహార్తిని తీర్చడానికి పెబ్బేరు మున్సిపల్ కమిషనర్ ఆశోక్ రెడ్డి సూచన మేరకు పెబ్బేరు సంత పరిరక్షణ సమితి , వేణుగోపాల స్వామి భూమి పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ వేసవి కాలం చలివేంద్రాలను ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేందుకు పెబ్బేరు పట్టణం మూడు ప్రధాన కూడళ్లలో బస్టాండు, సుభాష్ చౌరస్తా, కొల్లాపూర్ ఖమాన్ చౌరస్తా చలివేంద్రాలను మున్సిపల్ కమిషనర్ ఆశోక్ రెడ్డి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ ఎద్దుల విజయవర్ధన్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, సంత కాంట్రాక్టర్లు, సంత సభ్యులు , అన్ని రాజకీయపార్టీల ప్రముఖులు పాల్గొని ప్రారంభించారు.

### జిఎంఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో...



**ప్రజాపక్షం / కొత్తకోట** : భగవాన్ శ్రీశ్రీ సత్య సాయి బాబా వారి మాతృమూర్తి ఈశ్వరమ్మ జయంతి సందర్భంగా కొత్తకోట పట్టణ , మండల సే వా సమితి అధ్యక్షులు ఎం. కృష్ణ ఆధ్వర్యంలో రాసాల వెంకటేష్ సారథ్యం లో అంబలి , మజ్జిగ వితరణ కార్యక్రమం కొనసాగింది. ఈ కార్యక్రమం లో మాజీ సర్పంచ్ అరుణ శ్రీనివాస్ పాల్గొని మజ్జిగ , అంబలిని వితరణ గావించి ప్రజల దాహార్తిని తీర్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రజలు, సాయిబాబా సేవా సమితి సేవకులు పాల్గొని చల్లని మజ్జిగ, అంబలి, మంచినీటిని ప్రజలకు అందించడం జరిగింది.

## భూ సమస్య ఉన్న ప్రతీ రైతు రెవెన్యూ సదస్సు సద్వినియోగం

**ప్రజాపక్షం/ వనపర్తి** : భూ సమస్య ఉన్న ప్రతి రైతు రెవెన్యూ సదస్సును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. మంగళవారం గోపాలపేట మండలంలోని మున్ననూర్ తాడిపర్తి గ్రామా ల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులను కలెక్టర్ తనిఖీ చేశారు. భూ సమస్య ఉన్న ప్రతి ఒక్కరు రెవెన్యూ శాఖను సద్వినియోగం చేసుకునే విధంగా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను సూ చించారు. రెవెన్యూ సదస్సు నిర్వహించనున్న గ్రామంలో దరఖాస్తులను ఒక రోజు ముందుగానే పంచడం అదేవిధంగా టాంటాం చేయించడం వంటివి చేయాలన్నారు. భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని మున్ననూర్ గ్రామంలో 35 దరఖాస్తులు, తాడిపర్తి గ్రామం నుండి 36 వెరసి 71 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. దరఖాస్తులను సాధ్యమైనంత వరకు అక్కడికక్కడే పరిష్కరించే ప్రయత్నం చేయాలని, సక్సెషన్‌కు సంబంధించి వెంటనే నోటీస్‌లు జారీ చేయాలని సూచించారు. ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, గోపాల్‌పేట తహసీల్దార్ పాండు, తహసీల్దార్ రాజు, డి. సెక్షన్ సూపరింటెండెంట్ మదన్ తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.




## మిల్లర్ల కోత తర్వాతే రైతుకు ధాన్యం కాంటా చిట్టి

**ప్రజాపక్షం/పెబ్బేరు** : జిల్లా ఉన్నత అధికారులు, స్థానిక ఎమ్మెల్యే మెగా రెడ్డి పలుమార్లు హెచ్చరించిన మిల్లర్ల మాయాజాలానికి అడ్డు అదుపు లేకుండా రైతులకు వరి ధాన్యం కొనుగోలులో తరుగు తీసిన తర్వాతనే రైతుకు కాంట చిట్టి కొనుగోలు కింద నిర్వాహకులు ఇస్తున్నారు. నిబంధనల ప్రకారం కొనుగోలు కేంద్రాలలో తూకం వేసిన బస్తాలను, లారీకి ఎత్తిన వెంటనే రైతుకు కొనుగోలు ధృవపత్రాన్ని ఐకేపి, సింగిల్ విండో నిర్వాహకులు కూడ రైతులకు అందివ్వడం లేదు. మిల్లర్ల సెటిల్మెంట్ పూర్తయిన తర్వాతనే రైతులకు నిర్వాహకులు కొనుగోలు చిట్టిని ఇస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకొని కొనుగోలు నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని రైతుల విజ్ఞప్తి చేస్తున్నారు.

# క్రీడ

## అందుకే కెప్టెన్సీ వదులుకున్నా..: కోహ్లీ



అప్పట్లో విరాట్ కోహ్లీ తన కెప్టెన్సీ బాధ్యతలు వదిలేయడం సంచలనమైంది. అప్పుడు తాను అలా ఎందుకు చేయాల్సి వచ్చిందో తాజాగా విరాట్ వివరించాడు. దీని గురించి 'ఆర్సీబీ బోల్ డైరీస్' పాడ్‌కాస్ట్‌లో మాట్లాడాడు. కోహ్లీ మొదట 2021 వరల్డ్‌కప్ తర్వాత టీ20ల సారథ్య బాధ్యతలకు వీడ్కోలు పలికాడు. ఓ సంవత్సరం అనంతరం దక్షిణాఫ్రికాతో ఓటమి తర్వాత టెస్ట్ క్రికెట్ కెప్టెన్సీని సైతం వదులుకున్నాడు. కొన్ని రోజులకు ఐపీఎల్‌లో రాయల్‌ఛాలెంజర్స్ బెంగళూరు జట్టు సారథ్యం నుంచి కూడా పక్కకు తప్పుకున్నాడు. తన బ్యాటింగ్ మీద పెరిగిన అంచనాలతో నిరంతరమైన ఒత్తిడికి గురికావడంతోనే తాను కెప్టెన్సీ వదులుకున్నట్లు కోహ్లీ తెలిపాడు. 'ఒకానొక దశలో నేను తీవ్ర ఒత్తిడికి గురయ్యాను. టీమ్‌ఇండియాకు 7 8 సంవత్సరాలు, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు తొమ్మిది సంవత్సరాలు సారథిగా వ్యవహరించాను. నేను ఆడిన ప్రతి మ్యాచ్‌లోనూ నా బ్యాటింగ్ మీద ఎక్కువగా అంచనాలుండేవి. ఇది నాలో తీవ్రమైన ఒత్తిడికి కారణమైంది. అందుకే నేను కెప్టెన్సీ బాధ్యతల నుంచి నెమ్మదిగా బయటపడ్డా. ఇప్పుడు స్వేచ్ఛగా ఆడగలుగుతున్నా. ఈ ఐపీఎల్ సీజన్‌లోనూ చక్కగా పరుగులు చేయగలుగుతున్నా' అని విరాట్ వివరించాడు.

అలాగే తన కెరీర్ ప్రారంభం నాటి విశేషాలను కూడా అతడు పంచుకున్నాడు. 'అప్పటి కెప్టెన్ ఎంఎస్ ధోనీ, టీమ్ ఇండియా కోచ్ గ్యారీకిర్‌స్టెన్ నన్ను వెన్నుతట్టి ప్రోత్సహించారు. నేను మూడో స్థానంలో బ్యాటింగ్ చేసేందుకు అవకాశం ఇచ్చారు. నా సహజ శైలిలో నేను ఆడే వాతావరణాన్ని కల్పించారు.' అని కోహ్లీ ఆనాటి సంగతులను నెమరు వేసుకున్నాడు.



## ఈ సీజన్ మాకు కలిసి రాలేదు..

### హైదరాబాద్ హెడ్ కోచ్

ఐపిఎల్ 2025 సీజన్‌లో భాగంగా సోమవారం ఉప్పల్ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. దీంతో సన్‌రైజర్స్ ప్లేఆఫ్స్ ఆశలు ఆవిరయ్యాయి. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేసింది. తర్వాత వరుణుడి రాకతో హైదరాబాద్‌కు బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. ఈ సీజన్‌లో ఇప్పటివరకు 11 మ్యాచ్‌లు ఆడిన ఎస్ఆర్‌హెచ్ కేవలం మూడింట్లో మాత్రమే విజయం సాధించి ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది. ఈ మ్యాచ్ అనంతరం జట్టు ప్రధాన కోచ్ డానియల్ వెటోరి మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశాడు. "మేం ప్రతి మ్యాచ్ దూకుడుగా ఆడాలని అనుకోలేదు. ఈ సంవత్సరం పరిస్థితులు మేం ఊహించిన విధంగా లేవు. గత సంవత్సరం మనం చాలా హైస్కోరింగ్ మ్యాచ్‌లు చూశాం. కానీ ఈసారి కాస్త భిన్నంగా ఉంది. హైదరాబాద్ పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలించలేదు. రెండు పిచ్‌లు 250+ స్కోర్లకు వీలుగా ఉంటే.. నాలుగు పిచ్‌లు ఫాస్ట్ బౌలర్లకు అనుకూలంగా ఉన్నాయి. అదే సమయంలో స్పిన్నర్లకు సహకరించలేదు. కొత్త బంతిని కొట్టడం బ్యాటర్లకు ఇబ్బందిగా మారింది. బంతి బ్యాట్ మీదకు రాలేదు" అని వెటోరి వివరించాడు.

అలాగే సోమవారం ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచ్ విషయాన్ని కూడా ప్రస్తావించాడు. "ఢిల్లీతో మ్యాచ్‌కు ముందు మేం 10 మ్యాచుల్లో కేవలం మూడు మాత్రమే గెలిచాం. కచ్చితంగా గెలవాల్సిన పరిస్థితుల్లో సోమవారం జరగాల్సిన మ్యాచ్ వర్షం కారణంగా రద్దయ్యింది. మా టీమ్ అద్భుతంగా ఢిల్లీని 133 పరుగులకు కట్టడి చేసింది. కానీ వరుణుడు మా ఆశలపై నీళ్లు చల్లాడు. మొత్తానికి ఈ సీజన్ మాకు కలిసిరాలేదు. మా ఆటగాళ్ల ప్రదర్శనలో నిలకడ లోపించింది. మహ్మద్ షమీకి ఇది నిజంగా కఠినమైన సీజన్. కానీ అతడు మంచి ప్రదర్శన ఇవ్వడానికే ప్రయత్నించాడు" అని డానియల్ వెటోరి తెలియజేశాడు.

## అర్ధ శతకంతో మెరిసిన జాక్స్..

వాంఖడేలో రెచ్చిపోయే ఆడే ముంబై ఇండియన్స్ బ్యాటర్లకు గుజరాత్ బౌలర్లు ముకుతాడు వేశారు. టాపార్డర్‌లో విల్ జాక్స్(53) అర్ధ శతకంతో చెలరేగగా.. 97 3తో పటిష్టంగా ఉన్న ముంబై.. మిడిల్ ఓవర్లలో సాయి కిశోర్(234), రషీద్ ఖాన్(1



21)ల విజృంభణతో వరుసగా వికెట్లు కోల్పోయింది. దాంతో, ఆ జట్టు స్కోర్ 130 దాటడమే గగనం అనిపించింది. కానీ, ఆల్‌రౌండర్ కార్బిన్ బాష్(2) డెత్ ఓవర్లలో ధనాధన్ ఆడాడు. ప్రసిధ్ కృష్ణ వేసిన 20వ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు సబాదాడు. ఆఖరి బంతికి దీపక్ చాహర్ బౌండరీ కొట్టడంతో ముంబై 8 వికెట్ల నష్టానికి 155 పరుగులు చేసింది. ఆరు విజయాలతో జోరుమీదున్నముంబై ఇండియన్స్ వాంఖడేలో టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగింది. అయితే.. గుజరాత్ టైటాన్స్ బౌలర్ల ధాటికి ప్రధాన ఆటగాళ్లు బ్యాట్లెత్తేశారు. పవర్ ప్లేలో మూడు క్యాచ్‌లు వదిలేసినా భారీ స్కోర్ చేయలేకపోయింది. టాస్ ఓడిన ముంబైకి సిరాజ్ ఆదిలోనే షాకిచ్చాడు. ఫామ్‌లో ఉన్న ఓపెనర్ రియాన్ రికెల్టన్(2)ను సిరాజ్ ఔట్ చేశాడు. అయితే..ఆ తర్వాత బంతికే విల్ జాక్స్ ఇచ్చిన సులువైన క్యాచ్‌ను సుదర్శన్ నేల పాలు చేశాడు. లైఫ్ లభించడంతో జాక్స్ బౌండరీలతో రెచ్చిపోయాడు. అయితే.. డేంజరస్ రోహిత్ శర్మ(7)ను అర్షద్ పెవిలియన్ పంపాడు. ఆ తర్వాత వచ్చిన సూర్యకుమార్ యాదవ్(35)తో కలిసి జాక్స్ దంచేయగా ముంబై 2 వికెట్ల నష్టానికి 56 పరుగులు చేసింది. గుజరాత్ స్పిన్నర్లను బాదేసిన ఈ ఇద్దరూ మూడో వికెట్‌కు 69 పరుగులు జోడించి ముంబైని ఆదుకున్నారు.

### కిశోర్, రషీద్ తిప్పేయగా..

ఓపెనర్లు త్వరగా పెవిలియన్ చేరినా జాక్స్ కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అయితే.. దంచికొడుతున్న సూర్యను సాయి కిశోర్ ఔట్ చేసి ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత కాసేపటకే ఈ సీజన్‌లో తొలి అర్ధ శతకం సాధించిన జాక్స్‌ను రషీద్ ఖాన్ పెవిలియన్ చేర్చాడు. ఆదుకుంటాడనుకున్న కెప్టెన్ హార్దిక్ పాండ్యా(1), తిలక్ వర్మ (7)లు విఫలం కాగా.. నమన్ ధిర్(7) ప్రసిధ్ ఓవర్లో గిల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. ఆ తర్వాత టెయిలెండర్లు కార్బిన్ బాష్(27), దీపక్ చాహర్(8 నాటౌట్)ల పోరాడారు. 20 ఓవర్లో తొలి బంతిని బాష్ స్టాండ్స్‌లోకి పంపాడు. స్వీప్ షాట్‌తో రెండో బంతిని సిక్సర్‌గా మలవగా ముంబై 150కి చేరువైంది. కానీ, బట్లర్ అతడిని రనౌట్ చేసి ముంబైకి షాకిచ్చాడు. అయితే.. ఆఖరి బంతికి చాహర్ ఫోర్ బాదడంతో ముంబై ప్రత్యర్థికి 156 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

## 'కూలీ' కౌంట్‌డౌన్ షురూ





తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న ది మోస్ట్ అవైటెడ్ మూవీ 'కూలీ' చిత్ర షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. ఈ సినిమాను దర్శకుడు లోకేశ్ కనగరాజ్ డైరెక్ట్ చేయగా పూర్తి యాక్షన్ థ్రిల్లర్‌గా ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమవుతోంది. ఇక ఈ సినిమా నుంచి మేకర్స్ తాజాగా ఓ సాలిడ్ అప్డేట్ అయితే ఇచ్చారు. కూలీ చిత్ర రిలీజ్‌కు 100 రోజులు ఉందని.. దీంతో కూలీ తన కౌంట్ డౌన్ స్టార్ట్ చేస్తున్నాడని ఓ వీడియో రూపాలో ప్రకటించారు. కొన్ని వింటేజ్ షాట్స్‌తో ఈ వీడియో ప్రేక్షకులను థ్రిల్ చేస్తోంది. ఇక ఈ సినిమాలో భారీ క్యాస్టింగ్ ఉండటంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని ప్రేక్షకులు ఆసక్తిగా చూస్తున్నారు. ఈ సినిమాలో అక్కినేని నాగార్జున, ఉపేంద్ర, సత్యరాజ్, సౌబిన్ షాహిర్, శ్రుతి హాసన్, పూజా హెగ్డే తదితరులు కనిపిస్తున్నారు. ఈ సినిమాకు అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుండగా సన్ పిక్చర్స్ అత్యంత భారీ బడ్జెట్‌తో ప్రొడ్యూస్ చేస్తున్నారు.



## మెగా ఫ్యామిలీలో మరో గుడ్‌న్యూస్

ప్రస్తుతం మెగా హీరోలు అంతా కూడా పలు భారీ సినిమాలు చేస్తున్న సంగతి తెలిసిందే. మరి ఈ నేపథ్యంలో చాలా మంది హీరోలు పలు అరుదైన గౌరవాలు కూడా అందుకుంటుండగా ఒకో గుడ్ న్యూస్ అయితే మెగా ఫ్యామిలీ నుంచి వస్తూ అభిమానులకి ఆనందం కలిగిస్తున్నాయి. ఇలా కొన్నాళ్ల కితమే మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ అలాగే హీరోయిన్ లావణ్య త్రిపాఠిలు ప్రేమ పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. మరి వీరి నుంచి కొన్ని రోజులు కితమే ఒక గుడ్ న్యూస్ రావచ్చని కూడా మేము చెప్పాము. ఇక స్వయంగా వరుణ్ తేజ్ – లావణ్యలు ఇపుడు అఫీషియల్‌గా ఆ న్యూస్‌ని ప్రకటించేసారు. ఒక బ్యూటిఫుల్ పిక్ ని షేర్ చేసుకొని తాము అతి త్వరలోనే తల్లిదండ్రులు కాబోతున్నట్టుగా రివీల్ చేశారు. దీనితో సినీ ప్రముఖులు చాలా మంది వారికి శుభాకాంక్షలు తెలియజేస్తుండగా వారితో పాటుగా అభిమానులు కూడా ఆనందం వ్యక్తం చేస్తూ తమ బెస్ట్ విషెస్ ని తెలియజేస్తున్నారు.

## 'పెద్ది'లో శ్రీలీల?



గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'పెద్ది'పై ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ అయ్యాయి. దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ పూర్తి రగ్గడ లుక్‌లో కనిపిస్తుండటంతో ఈ సినిమాను ఎప్పుడెప్పుడు చూద్దామా అని అభిమానులు ఆసక్తిగా చూస్తున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా సినీ సర్కిల్స్‌లో ఓ ఇంట్రెస్టింగ్ వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో ఓ అదిరిపోయే మాస్ మసాలా సాంగ్ ఉండనుందని తెలుస్తోంది. ఈ స్పెషల్ సాంగ్‌లో 'కిస్సిక్' అంటూ నేషన్‌ను షేక్ చేసిన యంగ్ బ్యూటీ శ్రీలీల డ్యాన్స్ చేయబోతుందనే వార్త జోరుగా చక్కర్లు కొడుతోంది. ఇప్పటికే పుష్ప2 మూవీలో అమ్మడి పాటకు యమ క్రేజ్ దక్కింది. దీంతో ఇప్పుడు మరోసారి ఈ బ్యూటీతో బుచ్చిబాబు సాలిడ్ సాంగ్ ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. అయితే, ప్రస్తుతం చాలా సెలెక్టివ్‌గా సినిమాలను లైనప్ చేస్తున్న ఈ బ్యూటీ, పెద్ది కోసం మరోసారి స్పెషల్ అవతారం ఎత్తుతుందా లేదా అనేది చూడాలి.

# రీల్



## వీరమల్లు రిలీజ్ డేట్ ఫిక్స్

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ లేటెస్ట్ మూవీ 'హరిహర వీరమల్లు' షూటింగ్ పూర్తయినట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఈ మేరకు ఓ ఫోటోను కూడా వారు సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు. దీంతో ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా పూర్తి చేస్తున్నారట మేకర్స్. అయితే, ఈ సినిమాను వేసవి కానుకగా మే 30న గ్రాండ్ రిలీజ్ చేస్తారని చిత్ర వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. కానీ, ఈ చిత్ర రిలీజ్ డేట్ విషయంలో పూర్తి నిర్ణయం ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ప్రైమ్ వీడియో చేతిలో ఉందని తెలుస్తోంది. ఈ చిత్ర ఓటీటీ రైట్స్‌ను అమెజాన్ ప్రైమ్ వీడియో దక్కించుకుంది. దీంతో ఈ సినిమాను మే 30న రిలీజ్ చేయాలని చిత్ర యూనిట్‌పై వారు ఒత్తిడి చేస్తున్నారు. కానీ, మేకర్స్ ఈ రిలీజ్ డేట్‌ను జూన్ రెండో వారానికి మార్చాలని రిక్వెస్ట్ చేస్తున్నారట. అలా అయితే, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కూల్‌గా ముగించేయ వచ్చని చిత్ర యూనిట్ భావిస్తోందట. మరి వీరమల్లు మేకర్స్ కోరికను అమెజాన్ ప్రైమ్ వీడియో వింటుందా లేదా అనేది వేచి చూడాలి. ఈ సినిమాను దర్శకుడు జ్యోతికృష్ణ డైరెక్ట్ చేయగా ఏ.ఎం.రత్నం ప్రొడ్యూస్ చేస్తున్నారు. నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో బాబీ డియోల్ విలన్ పాత్రలో నటిస్తున్నాడు.

# శాంతి చర్చల కోసం ఒత్తిడి తెండి

**ప్రజా స్వామిక వాదులకు, అన్ని ప్రజాసమూహాలకు, రాజకీయ పార్టీలకు తెలంగాణ రాష్ట్ర శాంతి చర్చల కమిటీ పిలుపు**



**ప్రజాపక్షం / హైదరాబాద్:** శాంతి చర్చలకు కేంద్ర ప్రభుత్వం ముందుకు రావాలని కేంద్ర ప్రభుత్వంపై ఇంకా ఒత్తిడి పెంచాలని దేశ వ్యాప్తంగా ప్రజా స్వామిక వాదులకు, అన్ని ప్రజాసమూహాలకు, రాజకీయ పార్టీలకు తెలంగాణ రాష్ట్ర శాంతి చర్చల కమిటీ పిలుపునిచ్చింది. శాంతి చర్చల కమిటీ పిలుపు తరువాత దేశంలోని అనేక ప్రాంతాల్లో ప్రజలు, వివిధ ప్రజా సంఘాలు, పార్టీలు, సామాజిక సమూహాలు స్పందించి శాంతి చర్చలకు కేంద్రం ముందుకు రావాలని ఉద్యమిస్తున్నాయని తెలిపింది. శాంతి చర్చలకు మావోయిస్టు పార్టీ ముందుకు వచ్చినప్పటికీ కేంద్ర ప్రభుత్వం మొండిగా ఉండడం ప్రజాస్వామికం కాదని పేర్కొంది. చర్చలకు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు దేశ వ్యాప్తంగా ప్రజలు, ప్రజా స్వామిక వాదులు, అన్ని రాజకీయ పార్టీలు, దళిత, ఆదివాసీ, విద్యార్థి, మత మైనార్టీ వివిధ ప్రజా సమూహాలు ప్రజా స్వామిక పద్ధతిలో శాంతి యుత నిరసనలతో ఒత్తిడి తీసుకరావాలని కమిటీ పిలుపునిచ్చింది. ఈ మేరకు హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో మంగళవారం జరిగిన జస్టిస్ బి.చంద్ర కుమార్ అధ్యక్షతన జరిగిన శాంతి చర్చల కమిటీ సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది. కమిటీ సభ్యులు కందిమళ్ల ప్రతాప్‌రెడ్డి, ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్‌రావు, సిహెచ్.బాలకిషన్ రావు, ఆత్రం భుజంగరావు, రహమాన్ ఎడిటర్, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్, సోమ రామమూర్తి, అజయ్ బాల్నే, హరిప్రీత్, న్యాయవాది వెంకన్న, బండి దుర్గా ప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు. కాల్పుల విరమణ పాటించి శాంతి చర్చలకు ముందుకు రావాలని శాంతి చర్చల కమిటీ కేంద్ర ప్రభుత్వానికి, మావోయిస్టు పార్టీకి మరోసారి విజ్ఞప్తి చేసింది. మావోయిస్టు పార్టీ శాంతి చర్చలకు సిద్ధమని, అనువైన వాతావరణం ఏర్పాటు చేయాలని పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పత్రికా ముఖంగా ప్రకటన చేసారని, తదుపరీ మూడు సార్లు అ పార్టీ చర్చలకు సిద్ధం అని ప్రకటించినా కేంద్ర ప్రభుత్వం మొండిగా వ్యవహారిస్తూ కర్రేగుట్ట ఆపరేషన్‌ను వేలాది బలగలాలతో కొనసాగించడం ప్రజా స్వామ్య విధానం కాదని కమిటీ అభిప్రాయపడింది. కేవలం కేంద్ర ప్రభుత్వం, మావోయిస్టు పార్టీ ఎలాంటి షరతులు లేకుండా చర్చలకు రావాలని కమిటీ కోరింది.

### శాంతి చర్చల కమిటీ చైర్మన్‌గా జస్టిస్ చంద్ర కుమార్

తెలంగాణ రాష్ట్ర శాంతి చర్చల కమిటీ చైర్మన్‌గా జస్టిస్ బి.చంద్ర కుమార్, ఉపాధ్యక్షులు కందిమళ్ళ ప్రతాప్‌రెడ్డి, కోఆర్డినేటర్‌గా బండి దుర్గా ప్రసాద్, ముఖ్య సలహాదారులుగా ఫ్రొఫెసర్ జి.హరగోపాల్‌లను కమిటీ ఎన్నుకుంది. రాష్టంలో శాంతి చర్చల కమిటీ నిర్మాణం, శాంతి సభలు, ర్యాలీలు చేయాలని సమావేశం తీర్మానించినట్లు అధ్యక్షులు జస్టిస్ బి.చంద్రకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

## పర్యటన రద్దు (మొదటి పేజీ తరువాయి)

నిఘా వైఫల్యం ఉందని కేంద్రం అఖిలపక్ష సమావేశంలో అంగీకరించిందని పేర్కొంటూ, అటువంటి సమాచారం తర్వాత కూడా ప్రజలను రక్షించడానికి కశ్మీర్‌లో భద్రతా ఏర్పాట్లను బలోపేతం చేయకపోవడంపై కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని ఖర్గే అన్నారు. జార్ఖండ్ రాజధాని రాంచీలో మంగళవారం జరిగిన 'సంవిధాన్ బచావో' ర్యాలీలో ఖర్గే పాల్గొని ప్రసంగించారు. పహల్గామ్ దాడికి మూడు రోజుల ముందు మోడీజీకి నిఘా నివేదిక పంపబడిందని తమకు సమాచారం అందిందని, అందుకే మోడీజీ కశ్మీర్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు. మీ భద్రత నిమిత్తం అక్కడికి వెళ్లడం సరైనది కాదని నిఘా నివేదిక చెబుతున్నప్పుడు, ప్రజలను రక్షించడానికి నివేదిక విషయాన్ని మీ భద్రత, నిఘా, స్థానిక పోలీసుకు ఎందుకు తెలియజేయలేదని ప్రశ్నించారు. ప్రధానికి సమాచారం అందిన వెంటనే ఆయన కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. కానీ అక్కడి పర్యాటకులను రక్షించడానికి మరిన్ని బలగాలను ఎందుకు పంపలేదన్నారు. భారత్ భారీ సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని, అఖిలపక్ష సమావేశంలో కేంద్రం నిఘా వైఫల్యాన్ని అంగీకరించిందన్నారు. ఇంటర్‌జెన్స్ వైఫల్యాన్ని అంగీకరించి, పహల్గామ్ దాడిలో జరిగిన ప్రాణనష్టానికి కేంద్రం బాధ్యత వహించకూడదా అని ప్రశ్నించారు. దేశం అత్యున్నతమైనదని, ఆ తరువాతే పార్టీ, మతం, కులం అని అన్నారు. అందువల్ల పహల్గామ్ దాడి తర్వాత పాకిస్తాన్‌పై ఏదైనా చర్య తీసుకుంటే కాంగ్రెస్ కేంద్రం వెనుక నిలుస్తుందని ఖర్గే నొక్కి చెప్పారు. తాము దేశం, పేదల, గిరిజనుల కోసం పోరాడుతున్నామని, కానీ బిజెపి, ప్రధాని మాత్రం జుమ్లాను నమ్ముతున్నారని మండిపడ్డారు. రాంచీలోని హెచ్ఇసి వంటి ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేయడం, ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాల నుండి ఉద్యోగాలను లాక్కోవడం మోడీ విధానం అని కూడా ఖర్గే ఆరోపించారు. 30 లక్షల ఉద్యోగ ఖాళీలు ఉంటే, ప్రభుత్వంపై వాటిపై మౌనంగా ఉందన్నారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో కీలక పాత్ర పోషించిన నేషనల్ హెరాల్డ్ వంటి పత్రికను నిలబెట్టడానికి ప్రయత్నాలు చేసిన కాంగ్రెస్ నాయకురాలు సోనియా గాంధీపై కేంద్రం ఇడి వంటి శక్తులను ప్రయోగిస్తోందని ఖర్గే ఆరోపించారు. జనసంఘ్, ఆర్ఎస్ఎస్, బిజెపి నాయకుల మాదిరిగా కాకుండా, మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూతో సహా అనేక మంది కాంగ్రెస్ నాయకులను జైలులో పెట్టారని, ఇప్పుడు ఈ వ్యక్తులు మనకు దేశభక్తి పాఠం నేర్పుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇడి వంటి సంస్థలు ప్రతిపక్ష నాయకులను భయపెట్టడానికి దుర్వినియోగం చేస్తున్నారన్నారు. దాదాపు 200 కేసుల్లో ఇద్దరు వ్యక్తులకు మాత్రమే శిక్ష విధించబడిందన్నారు. గిరిజన ముఖ్యమంత్రి (హేమంత్ సోరెన్)ను జైలుకు పంపడంలో ప్రధానమంత్రి కీలక పాత్ర పోషించారని ఆరోపిస్తూ, ప్రధాని మోదీ గిరిజన నాయకులను భయపెట్టే పద్ధతులకు పాల్పడకూడదని సూచించారు.

## ఏం జరుగుతోంది?

(మొదటి పేజీ తరువాయి)

పోలీసులు సమాచారం ఇవ్వలేదు. కానీ వందలాది బంకర్‌లను, మావోయిస్టు స్థావరాలను ధ్వంసం చేసినట్లు పోలీసులు చెబుతున్నారు. అంతేకాదు కర్రెగుట్టలపై డిటోనేటర్లు వేలాది కిలోల పేలుడు పదార్థాలు, రేషన్ సరుకులు స్వాధీనం చేసుకున్నామని భవిష్యత్తులో మావోయిస్టులు కర్రెగుట్టలపై స్థావరాలను ఏర్పరచుకునే అవకాశం ఇవ్వబోమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. కర్రెగుట్టలపై సుమారు వెయ్యిమంది మావోయిస్టులు అందులో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారని కర్రెగుట్టలపై పోలీసులు దాడి చేశారు. సిఆర్‌పిఎఫ్, బస్తార్ ఫైటర్స్, ఛత్తీస్‌గఢ్ పోలీసులు, ఇతర కేంద్ర బలగాలు కూంబింగ్ నిర్వహిస్తున్నాయి. దాదాపు కర్రెగుట్టలను పూర్తిగా తమ స్వాధీనంలోకి తెచ్చుకోవడంతో పాటు అవుట్ పోస్టులను ఏర్పాటు చేస్తున్న పోలీసులు చెబుతున్నట్లుగా వెయ్యి మంది మావోయిస్టులు ముఖ్యంగా అగ్రనేతలు ఏమయ్యారన్న ప్రశ్నకు పోలీసులు సమాధానం చెప్పాల్సి ఉంది. మావోయిస్టు సాయుధ దళాల నుంచి వారి కోరియర్లకు సంబంధాలు తెగిపోయాయన్న ప్రచారం కూడా నడుస్తుంది. కర్రెగుట్టలపై తాజా సమాచారానికి సంబంధించి పోలీసుల వైపు నుంచి తప్ప మావోయిస్టుల వైపు నుంచి ఒక ప్రకటన కూడా విడుదల కావడం లేదు. హిడ్మా సహా మావోయిస్టు అగ్రనేతలందరూ పోలీసు వలలో చిక్కుకున్నారా బస్తార్ ఐజి సుందర్‌రాజన్ మంగళవారం విడుదల చేసిన ప్రకటన ప్రకారం మావోయిస్టులు పెద్ద సంఖ్యలో గాయపడ్డారని అందులో అగ్రనేతలు ఉన్నారని వారు లొంగిపోక తప్పదని చెబుతున్నది వాస్తవమేనా అన్న చర్చ సాగుతుంది. ఒక పక్క ఆపరేషన్ కర్రెగుట్టలకు సంబంధించి పోలీసులు బిజెపి ప్రభుత్వం తమ విజయంగా ముందుకు సాగుతుంటే మరో పక్క శాంతికాముకులు, వామపక్షాలు మావోయిస్టులతో శాంతి చర్చలు కొనసాగించాలని డిమాండ్ చేస్తూ తదనుగుణంగా ఆందోళన కార్యక్రమాలను చేపడుతున్నాయి. దీనిపై ప్రభుత్వం నుంచి ఎటువంటి స్పందన రాకపోగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాత్రం చర్చల ప్రసక్తే లేదని మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ముందుకు సాగుతామన్న మాటలు ప్రభుత్వ వైఖరిని స్పష్టం చేస్తున్నాయి. కర్రెగుట్టలపై ఏదో జరుగుతుంది. వాస్తవాన్ని ప్రభుత్వం దాచి పెడుతుందన్న వ్యాఖ్యలు వినపడుతున్నాయి. మావోయిస్టుల విషయంలో ప్రతి విషయాన్ని తమ వైపు నుంచి మీడియాకు వెల్లడించే పోలీసులు కర్రెగుట్టలపై జరుగుతున్న దాడులకు సంబంధించి పూర్తి సమాచారాన్ని ఇవ్వకుండా దాచి పెడుతున్నారని ఆపరేషన్ కగార్‌ను వ్యతిరేకిస్తున్న వారు వాదిస్తున్నారు. మావోయిస్టుల విషయంలో పోలీసుల ప్రకటనలు పలుమార్లు నిరాధారమని తేలడంతో పాటు తప్పుడు ప్రకటనలుగా తేలిపోయాయి. పలువురు అగ్ర నాయకులు గాయపడ్డారని లేదా మరణించారని తెలిపిన సందర్భాలు అనేకం ఉన్నాయి. కాని అవి చాలా సందర్భాల్లో నిజం కాలేదు. ప్రస్తుతం ఆపరేషన్ కర్రెగుట్టలకు సంబంధించి వాస్తవాలను కేంద్ర ప్రభుత్వం తెలియజేయాలని ఇది మావోలపై జరుగుతున్న దాడి కాదని ఆదివాసీలపై జరుగుతున్న దాడిగా ప్రజాస్వామిక వాదులు చెబుతున్నారు. ఛత్తీస్‌గఢ్ అడవుల్లోని అపారమైన ఖనిజ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టే నేపంతో మావోయిస్టుల మాటున ఆదివాసీలను అంతం చేస్తున్నారన్న విమర్శలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సి ఉంది. ఇదిలా ఉండగా మావోయిస్టులు ఇన్ఫార్మ్ నేపంతో ఒకరిని హతమార్చారు. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో ఒక మహిళా మావోయిస్టు మృతిచెందింది.

## పరిష్కరించుకోండి

(మొదటి పేజీ తరువాయి)

భద్రతామండలి తేల్చి చెప్పింది. భారత్‌పై జరిగిన ఉగ్రవాద దాడికి మండలిలో దేశాల నుండి తీవ్రస్థాయిలో వ్యతిరేకత వ్యక్తమైంది. ఈ ఉగ్రవాద దాడికి ఒక జవాబుదారీ ఉండాలని భద్రతామండలి పేర్కొంది. మతం ప్రాతిపదికపై ప్రజలను వేరుచేసి మగవారిని మాత్రమే లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు కాల్చిచంపడాన్ని భద్రతామండలిలో కొన్ని దేశాలు ప్రత్యేకంగా ప్రస్తావించి తీవ్రంగా ఖండించాయి. తప్పుడు కథనాలను సమ్మతించేందుకు భద్రతామండలి తిరస్కరించింది. పాకిస్థాన్ కేంద్రంగా పనిచేస్తున్న లష్కరే తోయిబా ఉగ్రవాద సంస్థకు పహల్గామ్‌లో దాడితో సంబంధం ఉండే అవకాశాల గురించి కూడా సభ్యులు పాకిస్థాన్‌ను ప్రశ్నించారు. ఇతరులెవ్వరికీ అనుమతి లేకుండా గంటన్నరసేపు భద్రతామండలి రహస్య సమావేశం జరిగింది. పహల్గామ్ పరిస్థితిని పాకిస్థాన్ తనకు అనుకూలంగా అంతర్జాతీయ సమస్యగా మార్చేందుకు చేసిన ప్రయత్నం విఫలమైందని సమావేశానంతరం భద్రతామండలి వర్గాలు తెలిపాయి. ఈ సమావేశంలో అందరినీ తనకు అనుకూలంగా మలచుకోవడానికి పాకిస్థాన్ చేసిన ప్రయత్నం గతంలో మాదిరిగానే మరోసారి విఫలమైందని ఐక్యరాజ్యసమితిలో భారతదేశ శాశ్వత ప్రతినిధి (మాజీ) సయ్యద్ అక్బరుద్దీన్ పిటిఐ వార్తాసంస్థకు చెప్పారు. భద్రతా మండలి జోక్యం చేసుకునే పరిస్థితి తెచ్చేందుకు పాకిస్థాన్ చేసిన ప్రయత్నాలను భారతదౌత్యం మరోసారి వమ్ము చేసిందని చెప్పారు.

లష్కరే తోయిడా ఉగ్రవాద సంస్థకు ఆశ్రయం ఇచ్చిన విషయం అమెరికా గూఢచారి సంస్థద్వారా గతంలో ఎప్పుడో బహిర్గతమైంది. ఇప్పుడు తహవ్వుర్ రాణా ద్వారా కూడా పాకిస్థాన్ సైన్యానికీ, ఉగ్రవాదులకూ మధ్య సంబంధాల విషయం చాలా వరకూ వెలుగులోకి వచ్చింది. పహల్గామ్‌లో దాడి చేసిన తర్వాత పాకిస్థాన్ కొత్త తరహా ఆట ప్రారంభించింది. అంతర్జాతీయస్థాయిలో ఉగ్రవాదానికీ తమకూ ఎలాంటి సంబంధం లేదనీ, ఈ ఘటనలను తమకు అంటగడుతున్నారనీ, వీటికి సంబంధించి ఎలాంటి సాక్ష్యాధారాలు లేవని చెబుతున్నది. జమ్మూకశ్మీరులో ప్రజలను అణచివేతకు గురిచేయడంవల్ల, ప్రజల స్వేచ్ఛను హరించడం వల్ల, వారి స్వాతంత్ర్యాన్ని కాజేయడంవల్ల భారత్ అక్కడి ప్రజల మనోభావాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తోందని, అందువల్లనే అక్కడ ఉగ్రవాదం పెచ్చరిల్లుతోందన్న ప్రచారాన్ని ముందుకు తెచ్చింది. అదేవిధంగా 1960లో కూడా భారతదేశం సింధునదీ జలాల ఒప్పందాన్ని రద్దుచేసిన విషయాన్ని ప్రస్తావించింది. నీరు అనేది ప్రాణాధారమని, అది ఆయుధం కాదని, సింధునది 24 కోట్ల మంది పాకిస్థాన్ ప్రజలకు జీవనాధారమని వాదిందించింది. సోమవారంనాడు పాకిస్థాన్ విజ్ఞప్తి మేరకు ఏర్పాటు చేసిన భద్రతామండలి సమావేశంలో ఆ దేశానికి చాలా కఠినమైన ప్రశ్నలు ఎదురయ్యాయి. భారత్‌కు బలమైన మద్దతు లభించింది. రెండు దేశాలూ ఉద్రిక్తతలకు దూరంగా ఉండాలని ఈ మే నెలలో భద్రతామండలికి అధ్యక్షుడుగా ఉన్న గ్రీస్ శాశ్వత ప్రతినిధి ఎలాంజిలోస్ సెకెరిస్ కోరారు. పాకిస్థాన్ ప్రస్తుతం భద్రతామండలిలో ఆశాశ్వత సభ్యత్వంతో ప్రతినిధిగా ఉంది. భద్రతామండలి రహస్య సమావేశం తర్వాత మండలిలో ఈ విషయంపై ఎలాంటి తీర్మానం చేయలేదు. ఐతే పాకిస్థాన్ మాత్రం తాము ఆశించిన ప్రయోజనం నెరవేరిందని ప్రకటించింది. మధ్యాసియా,ఆసియా పసిఫిక్‌లో రాజకీయ,శాంతి నిర్మాణ వ్యవహారాల సహా ప్రధాన కార్యదర్శిగా ఉన్న యునెస్కో అధ్యక్షుడు ఖలెద్ మహ్మద్ ఖైరి (ట్యునీషియా) మండలి తరపున ఈ సమావేశ వివరాలు తెలిపారు. భారత్–పాకిస్థాన్ మధ్య సమస్యను చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సమావేశం పిలుపు ఇచ్చిందన్నారు. రెండు దేశాలమధ్య ప్రస్తుత పరిస్థితి చాలా సున్నితంగా ఉందన్నారు. రోజురోజుకూ పెరుగుతున్న యుద్ధవాతావరణాన్ని, ఉద్రిక్తలను పరిష్కరించేవిషయంపై చర్చలు జరిగాయన్నారు. యుద్ధనివారణకు సమావేశంలో యత్నాలు జరిగాయన్నారు. రెండు దేశాల సైన్యాలను దూరంగా ఉంచి తీవ్ర పరిణామాలు రాకుండా చూసేందుకు అభిప్రాయాల మార్పిడి జరిగిందన్నారు. భద్రతామండలి సభ్యులు శాంతంగా,సహనంతో వ్యవహరించినందుకు అహ్మద్ కృతజ్ఞతలు తెలియజేశారు. అన్ని పొరుగుదేశాలతో శాంతియుతంగా, సహకార సంబంధాలను కొనసాగిస్తామని సమావేశంలో పాకిస్థాన్ పునరుద్ఘాటించిందని ఆయన చెప్పారు. పరస్పర గౌరవం, సార్వభౌమాధికార సమానత్వ దృక్పథంతో కూడిన చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని అహ్మద్ అన్నారు.

ఉగ్రవాద నిర్మూలను, ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో భారత్‌కు రష్యా తన పూర్తి మద్దతు తెలియజేసింది. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా మరోసారి తాజాగా భారత్‌కు తన మద్దతు తెలియజేశారు. ఈ సమావేశం సానుకూలంగా జరిగిందనీ, శాంతియుత పరిష్కారానికి ఆశాభావం కలిగిందన్నారు. రెండు దేశాలు సేనలను దూరంగా ఉంచి శాంతికి దోహదం చేస్తాయన్న ఆశాభావాన్ని రష్యా దౌత్యవేత్త వ్యక్తం చేశారు.

**పౌరులపై దాడి సమ్మతం కాదు: గుటెర్రెస్**

భద్రతామండలి సమావేశానికి ముందుగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్, భారత్–పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలపట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. అమాయకులైన సామాన్య ప్రజలను లక్ష్యంగా చేసుకుని హతమార్చడం ఎంత మాత్రం సమ్మతం కాదన్నారు. అనేక సంవత్సరాలుగా కొనసాగుతున్న వివాదంలో పహల్గామ్ ఘటన ఒక పరాకాష్ఠగా ఆయన పేర్కొన్నారు. "ఈ సంఘటన నన్ను కలచివేసింది, రెండు దేశాల మధ్య సంబంధాలు తీవ్ర ఉద్రిక్తతదశకు చేరుకున్నాయి, దారుణమైన హింసాకాండ ఘటన తర్వాత ఎలాంటి భావోద్వేగాలు చెలరేగుతాయో నేను అర్థం చేసుకోగలను, ఇది ఖండనీయం" అని గుటెర్రెస్ అన్నారు. సామాన్య పౌరులను హతమార్చిన ఉగ్రవాదులను, అందుకు బాధ్యులను న్యాయస్థానం ముందు నిలబెట్టాలన్నారు. కానీ ఇప్పుడు వీలైనంతస్థాయిలో ఎక్కువ సహనం పాటించాలన్నారు. రెండు దేశాలూ తప్పు చేయకూడదు, సైనిక పరిష్కారం ఈ సమస్యకు పరిష్కారం కాదని అన్నారు. భద్రతామండలిలో వీటో అధికారాలున్న చైనా, అమెరికా, ఫ్రాన్స్, రష్యా, బ్రిటన్‌సహా ఆల్జీరియా, డెన్మార్క్, గ్రీస్, గుయానా, పాకిస్థాన్, పనామా, దక్షిణ కొరియా, సియర్రా లియోన్, స్లోవేనియా, సోమాలియా వంటి ఆశాశ్వత సభ్య దేశాలున్నాయి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at D.No 1- 6-75, Suravaram Venkataram Reddy Bhavan, Subhashnagar, Mahabubnagar - 509001, Telangana State, RNI TELTEL /2018/76758 **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com